ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
హైదరాబాద్
: fb.com/vaartha Digital
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
21-8-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 202 పేజీలు: 10+4 వెల: 6.50

బంగ్లా కొత్త అధ్యక్షుడిగా మీర్జా ఫఖ్రుల్ ఇస్లాం 3

చెత్త నిర్వహణ బాధ్యత ప్రతి ఒక్కరిది: సుప్రీం కోర్టు 5

జస్టిస్ సుభాష్‌రెడ్డి నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో ఏర్పాటు
ముగ్గురు రిటైర్డ్ జడ్జిలు, సిబిఐ మాజీ డైరెక్టర్, మాజీ డిజిపి నియామకం



జంతర్‌మంతర్ ఘటనపై హైపవర్ కమిటీ 5

దేశాలకు ట్రంప్ 'ఎకనామిక్ డీ-డే' హెచ్చరిక



ఇరాన్‌కు ఆర్థిక సాయం చేస్తే భారీ మూల్యం తప్పదు

# 'కృష్ణ'ను పరిష్కరించండి

ఎత్తిపోతల పథకాల్లో తెలంగాణ ప్రయోజనాలు పరిరక్షించండి
దక్షిణాదితోనే దేశాభివృద్ధి
ఎపితో వివాదాలకు చట్టపరమైన పరిష్కారం కనుగొనాలి
సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో డి.సిఎం భట్టి



మహాబలిపురంలో గురువారం జరిగిన సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, డి.సిఎం భట్టి, దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, డికె శివకుమార్, విజయ్, సతీశన్ తదితరులు

**హైదరాబాద్, అగస్టు 20, ప్రభాతవార్త:** దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధి చెందినేతే దేశాభివృద్ధి సాధ్యమవుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. నీటి, ఇంధన భద్రత, వాతావరణ మార్పులు, పట్టణీకరణ, రవాణా, లాజిస్టిక్స్, ఆర్థిక పోటీతత్వం వంటి అంశాలు రాబోయే రోజుల్లో దక్షిణాది రాష్ట్రాలకు కీలక సవాళ్లుగా మారనున్నాయని చెప్పారు. వీటిని ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు పోటీ పడుతూనే పరస్పరం సహకరించుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మహాబలిపురంలో జరిగిన 31వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశంలో ఆయన తెలంగాణ వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. కేంద్ర హోం శాఖ మంత్రి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలను సామరస్యపూర్వకంగా పరిష్కరించడంతో పాటు, నిర్ణయాలను వేగంగా అమలు చేయడమే సహకార సమాఖ్యవాద స్ఫూర్తి అన్నారు. భిన్నమైన ప్రయోజనాలు ఎదురైనప్పుడు >>2

నిధుల పంపకం, రాష్ట్రాల హక్కులపై ఎలుగెత్తిన దక్షిణాది రాష్ట్రాల నేతలు 3

## 9,10 షెడ్యూలు సంస్థల విభజన పూర్తి చేయండి

సమావేశంలో ఎపి సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పునర్విభజనకు సంబంధించిన పెండింగ్ అంశాలను సిఎం చంద్రబాబు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్ర విభజన జరిగి 12 సంవత్సరాలు గడిచినా షెడ్యూల్ 9, 10లోని సంస్థల విభజన పూర్తి కాలేదని పేర్కొన్నారు. ఆస్తులు, అప్పులు,సంస్థల విషయంలో సమ న్యాయం జరగాల్సిన అవసరం ఉందన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 66 కింద >>2



# 'ఉచితాలు' ఉచితమా?

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డేంజర్‌బెల్స్
కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్‌లపై స్టే తొలగించలేం
భూ బాధితులకు డబ్బు ఇవ్వలేమంటే ఎలా?
ప్రజలు కట్టే పన్నును ఉచిత పథకాలకు ఎలా ఇస్తారు?
హైకోర్టు ధర్మాసనం సీరియస్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు20:** తెలంగాణలో అమలవుతున్న కల్యాణలక్ష్మి, షాదీము బారక్ వంటి పథకాల చట్టబద్ధత, ఉచిత పథకాలకు నిధుల వినియోగంపై దాఖలైన పిటిషన్లపై విచారణ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై గురువారం తెలంగాణ హైకోర్టు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ పథకాల నిధుల విడుదలపై ఉన్న (గతంలో విధించిన) మధ్యంతర స్టేను ఎత్తివేసేందుకు జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం స్పష్టంగా నిరాకరించింది. నిధుల విడుదలపై ఉన్న స్టేను తొలగించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభ్యర్థనను తోసిపుచ్చింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై డేంజర్ బెల్స్ మోగుతున్నాయని హెచ్చరించిన ధర్మాసనం పరిమితి లేకుండా ఉచిత పథకాలకు నిధులు మళ్లించడం వల్ల ఇతర అత్యవసర రంగాలపై తీవ్ర ప్రభావం పడుతోందని వ్యాఖ్యానించింది. నీటిపారుదల, ఇతర ప్రాజెక్టుల కోసం నిర్బంధంగా భూములిచ్చిన బాధితులకు ఏళ్లకు ఏళ్లు పరిహారం చెల్లించకుండా బకాయిలు >>2



సుస్మిత వ్యాఖ్యలతో నాకు

## సంబంధం లేదు

నోటీసులు ఉపసంహరించాలి
మల్లురవికి వివరణను పంపిన మంత్రి కొండా సురేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు20:** తన కుమార్తె చేసిన వ్యాఖ్యలపై తనను వివరణ ఇవ్వాలని కోరడం సముచితంగా లేదని రాష్ట్ర అటవీ,పర్యావరణ,దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. టిపిసిసి క్రమశిక్షణా కమిటీ జారీ చేసిన నోటీసుకు సంబంధించి మంత్రి కొండా సురేఖ గురువారం తనవివరణతో లేఖను కమిటి ఛైర్మన్ మల్లురవికి పంపించారు. లేఖలో క్రమశిక్షణా కమిటీకి మంత్రి తన వివరణ ద్వారా స్పష్టతనిచ్చారు.ఆగస్టు 19న తన జన్మదినోత్సవం సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కొండా కుటుంబ >>2

మంత్రి కొండా సురేఖ మాజీ ఒఎస్‌డిపై హత్యాయత్నం కేసు 3

# 'గీత' దాటితే చర్యలు తప్పవు

సుస్మిత పటేల్ వ్యాఖ్యలు బాధాకరం
పార్టీ టికెట్‌పై అంతిమ నిర్ణయం కేంద్ర ఎన్నికల కమిటీ, సిడబ్ల్యుసిలది మాత్రమే: పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్, ఆగస్టు 20,ప్రభాతవార్త:** మంత్రి కొండా సురేఖ కూతురు కొండా సుస్మిత వ్యాఖ్యలు బాధాకరం, తీవ్రంగా ఖండిస్తున్నామనీ టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్ అన్నారు. గురువారం నిజామాబాద్‌లో వినాయక్‌నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద స్వర్గీయ మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించడంతోపాటు వనమహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వనమహోత్సవంలో భాగంగా మల్లారం గండి వద్ద నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సంరద్భంగా ఆయన మాట్లాడుతూ సుస్మిత వ్యాఖ్యలపై మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీసులు ఇచ్చామనీ కొండా సురేఖ మంత్రి పదవిలో ఉన్నారు కాబట్టి వివరణ కోరాం అన్నారు.వివరణ ఇచ్చాక తదుపరి చర్యకు తీసుకుంటామనీ అన్నారు. చిన్నారెడ్డి సీనియర్ నాయకులు, పార్టీలైన్ దాటితే క్రమశిక్షణ చర్యలు తప్పవు. అభ్యర్థులను ఎవరు ప్రకటించిన అవి చెల్లవు. పార్టీలో ఓ విధానం ఉంటుందనీ ఎన్నికల కమిటీ,సిడబ్ల్యుసి అంతిమ నిర్ణయం ప్రకారం అభ్యర్థుల ఎంపిక చేస్తారని ఎవరుపడితే వాళ్ళు ప్రకటించుకోవడం కాంగ్రెస్ పార్టీలో ఉండదని తెలిపారు. పోచారంశ్రీనివాసరెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆయనతో మాట్లాడాం ఆయన ఆవేదనను అర్థం చేసుకున్నామనీ తెలిపారు. బాన్సువాడ పాత కాంగ్రెస్ నాయకులతో కూడా మాట్లాడినామని చెప్పారు. సొసైటీలు, మార్కెట్ కమిటీ ఛైర్మన్‌లు వంటి నామినేటెడ్ పదవుల్లో కాంగ్రెస్‌లో సీనియర్ నేతలకు 70 శాతం పదవులు ఇస్తామనీ తెలిపారు. బాన్సువాడ లో పాత కొత్త నేతల కలయిక తో ముందుకు వెళ్తామనీ 20 సొసైటీ పదవుల్లో 14 పాత కాంగ్రెస్ వాళ్ళకు ఇస్తున్నామని,పోచారం కాంగ్రెస్ సిద్ధాంతాలకు, సంక్షేమానికి మద్దతుగా ఉన్నారనీ కితాబు ఇచ్చారు. బిఆర్ఎస్ శాసనభ ప్రతిపక్ష ఉపనాయకుడు హరీష్‌రావు 22ఎ పైఅనవసర రాద్ధాంతం చేస్తున్నారని బిఆర్ఎస్ కూడా ఇలా చేయడం తగదని అన్నారు.కింది స్థాయిలో జరిగిన తప్పిదం మా దృష్టికి వస్తే లోపాలను సరిదిద్దాలని అధికారులను సిఎం ఆదేశించారు. కొండా సుస్మితపటేల్ వ్యాఖ్యలు ఖండిస్తూ కాంగ్రెస్ నాయకులు విలేఖరుల సమావేశం నిర్వహించారు. మంత్రి కొండా సురేఖకు ఆమె కూతరుకు పద్ధతి మార్చుకోవాలని హెచ్చరికలు చేశారు. కొండా సుస్మితపై వడ్డెర కాంగ్రెస్ కార్పొరేషన్ ఛైర్మన్ >>2

## 22ఎ ఫిర్యాదులపై సత్వర పరిష్కారం

ప్రత్యేక టాస్క్‌గా పనిచేయాలి
అధికారులకు పర్యవేక్షణ బాధ్యత
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు20:** 22ఏ నిషేధిత భూముల అంశంలో ప్రజలకు పూర్తి భరోసా కల్పించే దిశగా రెవెన్యూ శాఖ చర్యలను మరింత వేగవంతం చేసిందని కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును కేవలం ఒక ఫిర్యాదుగా కాకుండా ఒక బాధ్యతగా తీసుకోవాలని, సమస్య పరిష్కారమయ్యే వరకు ప్రత్యేకంగా పర్యవేక్షించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. నిజమైన హక్కుదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని, అర్హత ఉన్న ప్రతి దరఖాస్తుదారుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. 22ఏ ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కాల్ >>2



గురువారం హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో సిజె అపరేష్ కుమార్, డిజిపి ఆనంద్ తదితరులు

## సమన్వయం, డిజిటల్ వేదికలతో సత్వర న్యాయం

కొత్త నేర చట్టాల అమలుకు సమన్వయమే కీలకం: సిజె జస్టిస్ అపరేష్ కుమార్
డిజిటల్ వేదికలను సమర్థంగా వినియోగించాలి: డిజిపి సివి ఆనంద్
సాంకేతిక పరిజ్ఞానం, సమన్వయం అవసరం: జస్టిస్ మోషుమి భట్టాచార్య

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు20:** కొత్త చట్టాలైన భారతీయ న్యాయ సంహిత(బిఎస్ఎస్),భారతీయ నాగరిక్ సురక్షా సంహిత(బిఎస్ఎస్ఎస్),భారతీయ సాక్ష్య ఆధినియమం(బిఎస్ఏ) అమలులో డిజిటల్ వేదికల వినియోగం,వివిధ విభాగాల మధ్య సమన్వయం కీలకమని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆపరేష్ కుమార్ సింగ్ అన్నారు. న్యాయవ్యవస్థ,పోలీస్,జైళ్లు,ప్రాసిక్యూషన్,ఫోరెన్సిక్,వైద్య విభాగాలతోపాటు, ఎన్ఐసి,ఎన్‌సిఆర్‌బి వంటి >>2

## ఎసిబి వలలో తహసీల్దార్

ఆదాయానికి మించిన రూ. 6.66 కోట్ల ఆస్తులు గుర్తింపు



**హైదరాబాద్ (వనస్థలిపురం) ఆగస్టు 20, ప్రభాతవార్త:** ఆదాయానికి మించిన ఆస్తులు కలిగిఉన్నాడనే విశ్వసనీయ సమాచారంతో రంగారెడ్డి జిల్లా ఎ.సి.బి.డియస్పీ ఆనంద్ కుమార్ నేతృత్వంలో గురువారం ఉదయం హస్తినాపురం నార్త్‌లో నివాసముంటున్న తహశీల్దార్ కేసాని శ్రీనివాస్ రెడ్డి నివాసంలో సోదాలు నిర్వహించారు. సోదాలలో >>2



పొంగులేటిని వెంటనే

## బర్తరఫ్ చేయాలి

22 ఎ లోని భూములపై రిటైర్డ్ జడ్జితో విచారణ జరపాలి
రాహుల్‌కి లేఖ రాసిన హరీష్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు20:** తెలంగాణలో సెక్షన్ 22ఎ దుర్వినియోగం, రెవెన్యూ శాఖలో అడ్డగోలు అవినీతి ఆరోపణలపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి మాజీ మంత్రి, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు గురువారం బహిరంగ లేఖ రాశారు. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని తక్షణమే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఆ లేఖలో డిమాండ్ చేశారు. సెక్షన్ 22ఏ అనేది నిషేధిత భూముల రిజిస్ట్రేషన్ ఆపడానికి తెచ్చిన చట్టం.. ప్రైవేటు ఆస్తులపై కృత్రిమ వివాదాలు సృష్టించి వసూళ్లకు పాల్పడటానికి కాదని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్ సహా హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి జిల్లాల్లో హెచ్ఎండీఏ అనుమతులున్న వేలాది ప్రైవేటు ఆస్తులను ఏకపక్షంగా 22ఏ జాబితాలో పెడుతూ వేధింపులకు గురి చేస్తున్నారని >>2



## భద్రాచలం 5 గ్రామాలు తెలంగాణలో కలపాలి

కేంద్రానికి, ఎపి సిఎం చంద్రబాబుకు మంత్రి తుమ్మల లేఖ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు20:** రాష్ట్ర విభజన అనంతరం పెండింగ్‌లో ఉన్న తెలంగాణ ప్రయోజనాలకు సంబంధించిన కీలక అంశాలను కేంద్రం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ప్రయత్నించింది. గురువారం మహాబలిపురంలో కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్‌షా అధ్యక్షతన జరిగిన 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నాలుగు ప్రధాన అంశాలపై గురువారం కేంద్రం, ఏపి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి లేఖల ద్వారా విజ్ఞప్తి చేశారు. >>2



గురువారం శ్రీపెరంబుదూర్‌లో రాజీవ్‌గాంధీ మెమోరియల్ వద్ద నివాళులర్పిస్తున్న డి.సిఎం భట్టి

# సత్వర పరిష్కారం

>> సెంటర్‌కు వస్తున్న కాల్స్, వాటి పరిష్కారం, ఏయే సమస్యలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయి, వచ్చిన కాల్స్‌కు ఎలాంటి సమాచారం అందిస్తున్నారు తదితర అంశాలపై గురువారం అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు సమీక్షించారు. నాలుగు జిల్లాల్లో 22ఏ అంశంపై ప్రస్తుత పరిస్థితి, దరఖాస్తుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు సుమారు 400 కాల్స్ వచ్చినట్లు ఈ సందర్భంగా అధికారులు మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాల్ సెంటర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నమోదు చేసి వదిలేయకుండా, దరఖాస్తుదారుడి పూర్తి వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత తహసీల్దార్, ఆర్డీవో, సబ్‌రిజిస్ట్రార్ తదితర అధికారులకు పంపించాలని ఆదేశించారు. ఆ సమస్య పరిష్కారమయ్యే వరకు దాని పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాల్ సెంటర్ నుంచి ఆన్‌లైన్‌లో ఫిర్యాదు స్వీకరించిన అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. వచ్చిన ఫిర్యాదుపై నిజానిజాలను నిర్ధారించి, దరఖాస్తుదారు పేర్కొన్న సమస్య వాస్తవమా? భూమి 22ఏ జాబితాలోకి ఎందుకు వచ్చింది? దరఖాస్తుదారుడికి అర్హత ఉందా? అనే అంశాలను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలని సూచించారు. పరిశీలన అనంతరం స్పష్టమైన కారణాలతో నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ సమస్యను చెప్పిన తర్వాత పరిష్కారం కోసం మళ్లీ మళ్లీ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఇప్పటికే సబ్‌రిజిస్ట్రార్లు, తహసీల్దార్లు, ఆర్డీవోలు, కలెక్టర్ల స్థాయిలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతో పాటు, గడచిన రెండు మూడు రోజుల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తులను కూడా వెంటనే పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఇకపై కొత్తగా వచ్చే దరఖాస్తులు పెండింగ్‌లో పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. 22ఏ సమస్య పరిష్కారాన్ని ప్రత్యేక టాస్క్‌గా తీసుకుని అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేయాలని మంత్రి ఆదేశించారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

'రెవెన్యూ కార్యాలయానికి వచ్చిన వ్యక్తి తన సమస్య పరిష్కారమవుతుందనే నమ్మకంతో బయటకు వెళ్లాలి. వచ్చిన దరఖాస్తును మరో కార్యాలయానికి పంపించి చేతులు దులుపుకోకండి. చివరి వరకు పర్యవేక్షించండి. మీ పనితీరుతో ప్రజల అభిమానాన్ని చూరగొనండి' అని అధికారులకు సూచించారు. అధికారులు సొంత నిర్ణయాలతో ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదని, ప్రభుత్వ ఆలోచనలు, విధానాలకు అనుగుణంగా పనిచేయాలని స్పష్టం చేశారు.

# 'ఉచితాలు' ఉచితమా?

>> పెట్టడంపై కోర్టు నిలదీసింది. భూబాధితులకు పరిహారం ఇవ్వడం ప్రభుత్వ చట్టబద్ధమైన బాధ్యత కాదా? అని ప్రశ్నించింది. అలాగే, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులకు అందాల్సిన పెన్షన్లు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ సమయానికి చెల్లించలేక పోవడంతో వారు న్యాయం కోసం కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంలో జీతాలు, పెన్షన్లు రాక చాలామంది ఉద్యోగులు, పదవీ విరమణ పొందిన వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఉచిత పథకాల పేరుతో ప్రజాధనాన్ని వృథా చేయడం ఎంతవరకు సమంజసం? ప్రజల ట్యాక్స్ డబ్బును ఇలా ఉచిత పథకాలకు మళ్లించడం న్యాయమేనా? అంటూ న్యాయస్థానం ప్రశ్నించింది. ప్రభుత్వ ప్రాధాన్యాతలను తప్పుపడుతూ హైకోర్టు కీలక ప్రశ్నలు లేవనెత్తింది. వివిధ ప్రభుత్వ ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయి బాధితులకు నష్టపరిహారం చెల్లించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రశ్నించింది. అర్హులైన భూ బాధితులకు ఇవ్వడానికి డబ్బులు లేవని చెబుతూ శాసనసభ ఆమోదం లేని ఇటువంటి ఉచిత పథకాలకు వందల కోట్లు ఎలా కేటాయిస్తారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజాధనాన్ని ఈ విధంగా వాడటానికి బదులు భూబాధితులకు సకాలంలో పరిహారం ఇచ్చి, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే అసలు ఇటువంటి పథకాల అవసరమే ప్రజలకు ఉండదని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో తదుపరి పూర్తిస్థాయి విచారణను హైకోర్టు వచ్చే సోమవారానికి వాయిదా వేసింది. అప్పటి వరకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాల నిధుల విడుదలపై స్టే యథాతథంగా కొనసాగనుంది.

# రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్ కుమారుడు సంజూష్‌పై కేసు నమోదు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు20:** హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్ ఎదురుగా ఈనెల 16న కారు ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో లైఫ్‌స్టైల్ స్టోర్‌లో పనిచేస్తున్న భారతి ముఖి(26) మృతిచెందారు. రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్ కుమారుడు సంజూష్ అతివేగంగా ఆస్టన్ మార్టిన్ కారు నడిపి యువతిని ఢీకొట్టినట్లు పోలీసులు గుర్తించారు. మృతురాలి సహచరుల ఫిర్యాదుతో మాదాపూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు లింగమనేని సంజూష్‌పై భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్)లోని సెక్షన్ 106(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా,ప్రమాదం జరిగిన అనంతరం తాను ఎక్కడికీ వెళ్లిపోకుండా స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లినట్లు సంజూష్ తెలిపారు. జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసు అధికారులకు తెలియజేసినట్లు పేర్కొన్నారు. దర్యాప్తులో పోలీసులకు పూర్తిగా సహకరించానని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన భారతి ముఖిని ఆసుపత్రికి తరలించడం, అనంతరం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి అధికారులకు సమాచారం ఇవ్వడం ద్వారాతాను చట్టపరమైన దర్యాప్తుకు సహకరించానని తెలిపారు. ఘటనకు సంబంధించిన అన్ని వాస్తవాలను పోలీసులు సమగ్రంగా పరిశీలించి, ప్రమాదానికి ముందు మరియు తరువాత జరిగిన పరిణామాలను పరిగణనలోకి తీసుకొని నిబంధనల ప్రకారం పోలీసులు విచారణ జరుపుతున్నారు అన్నారు. ప్రమాదం జరిగిన సమయంలో తన శారీరక పరిస్థితిని నిర్ధారించేందుకు పోలీసులు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సంజుష్ తెలిపారు.

# ఏసిబి వలలో తహసీల్దార్

>>6.66 కోట్ల ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నట్లు గమనించారు.శ్రీనివాస్ రెడ్డి ఇబ్రహీంపట్నం ఆర్.డి. ఓ.కార్యాలయంలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీనివాస్ రెడ్డికి సంబంధించిన 15 ప్రాంతాలలో సోదాలు జరుగుతున్నట్లు డిఎస్పీ ఆనంద్ కుమార్ తెలియజేసారు.సోదాలలో వివిధ ప్రాంతాల్లో 8 ఓపెన్ ప్లాట్స్,1కేజీ బంగారు ఆభరణాలు,4.38 లక్షల నగదు,3 కార్లు, ఓ బార్‌లో 86లక్షల పార్టనర్‌గా ఉన్నట్లు తెలిపారు. యాదగిరిగుట్టలో 3 ప్లాట్‌లు, తుర్కయాంజల్ 3, కర్మన్ ఘాట్‌లో 2. ఓపెన్‌ప్లాట్స్ ఉన్నట్లు అధికారులు గుర్తించారు. శ్రీనివాస్ రెడ్డి మహేశ్వరం, బాలాపూర్, శంషాబాద్ మండలాల్లో ఎం.ఆర్.ఓ.గా పనిచేశారు.

# సుస్మిత వ్యాఖ్యలతో నాకు సంబంధం లేదు

>>అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పలుచోట్ల వేడుకలు నిర్వహించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టారని లేఖలో మంత్రి తెలిపారు. తన స్వస్థలమైన గీసుకొండతో తన కూతురు సుస్మితా పటేల్ కు వున్న ప్రత్యేక అనుబంధం కారణంగా అక్కడి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు నిర్వహించిన జన్మదిన వేడుకల్లో తన కుమార్తె కొండా సుస్మితా పటేల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారని వివరించారు. ఆ కార్యక్రమంలో తన కుమార్తె చేసిన వ్యాఖ్యలు పూర్తిగా తన వ్యక్తిగత అభిప్రాయమని మంత్రి స్పష్టం చేశారు. కుటుంబ బాంధవ్యం కారణంగా ఒకరి వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం, ఆ ప్రాతిపదికన వివరణ కోరడం సముచితం కాదని మంత్రి సురేఖ పేర్కొన్నారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తనను బాధ్యురాలిగా చేయడం సహజ న్యాయ స్ఫూర్తికి విరుద్ధమని వివరించారు.

కాంగ్రెస్ పార్టీ నాయకత్వంపై, పార్టీ క్రమశిక్షణా నియమావళిపై తనకు సంపూర్ణ గౌరవం ఉందని మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్య విలువలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ఈ విషయంలో తన ప్రమేయం లేదని గుర్తించి, తనకు జారీ చేసిన నోటీసును ఉపసంహరించుకోవాలని క్రమశిక్షణా కమిటీకి గౌరవపూర్వకంగా విజ్ఞప్తి చేశారు.

## వారం - వర్జ్యం

21-08-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.నవమి రా.11.37
న.అనూరాధ ఉ.11.53
వ.సా.6.10-రా.7.58
దు1.ఉ.8.23-ఉ.9.13
దు2. మ.12.35-మ.1.25
రాహు.ఉ.10.30-మ.12.00 శుభ లేదు

## వార్తాఫలం

**మేషం :** వృత్తి ఉద్యోగాలలో ఎక్కువ శ్రద్ధ కనబరచి అనుకూల ఫలితాలు సాధిస్తారు. ప్రయాణాలు అనుకూలిస్తాయి.

**వృషభం :** మీ క్రింది స్థాయి ఉద్యోగులు మీపై కొండెములు చెప్పడం మీకు తలనొప్పిగా మారుతుంది.

**మిథునం :** ఉత్తర ప్రత్యుత్తరములకు, ప్రకటనల వారితో సంబంధ బాంధవ్యములు పెంచుకొంటారు. శ్రమ అధికంగా ఉంటుంది.

**కర్కాటకం :** నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. క్రయ విక్రయాలలో లాభాలు.

**సింహం :** బంధువుల నుండి శుభవార్తలు అందుకుంటారు. సంగీత సాహిత్యాలపై ఆసక్తి చూపుతారు. ప్రయాణాలు సౌలభ్యం.

**కన్య :** పూర్వపు మిత్రులను కలుసుకొని ఆనందంగా గడుపుతారు. అభరణాలు కొనుగోలు చేస్తారు. వస్త్రాలు కొనుగోలు.

**తుల :** కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. ఉద్యోగావకాశాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

**వృశ్చికం :** చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తి చేసుకుంటారు. కొత్త కాంట్రాక్టులు లభిస్తాయి. ఇంటా బయటా ప్రోత్సాహం.

**ధనుస్సు :** రావలసిన బాకీలు కొంత ఆలస్యంగా అందుతాయి. జీవిత భాగస్వామి నుండి ధనం లభిస్తుంది. వస్త్ర లాభం.

**మకరం :** మీరు తీసుకునే నిర్ణయాలు నలుగురిలో శ్లాఘించబడతాయి. వాహన సౌఖ్యం. నూతన విద్యావకాశాలు లాభిస్తాయి.

**కుంభం :** నైపుణ్యతతో ప్రతిభతో మెదడుకు పదునుపెట్టి వ్యాపారంలో లాభము తెస్తారు. వివాహ, ఉద్యోగ యత్నాలు ఫలిస్తాయి.

**మీనం :** ఇతరులకు మీరు ఇచ్చే సలహాలు వారికి ఎంతో ఉపకరిస్తాయి. కాంట్రాక్టులు దక్కుతాయి. సోదరుల కలయిక.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# విదేశాలకు వెళ్లిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు20:** ముఖ్యమంత్రి ఎ.రేవంత్ తన యూకే- అమెరికా పర్యటనలో భాగంగా న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బుధవారం మధ్యరాత్రి 12.30కి లండన్‌కు బయలుదేరి వెళ్లారు. ఢిల్లీ విమానాశ్రయంలో ముఖ్యమంత్రికి నాగర్‌కర్నూల్ లోక్‌సభ సభ్యులు డా.మల్లు రవి, తెలంగాణ ప్రభుత్వ ప్రోటోకాల్, ప్రజాసంబంధాల సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి, యూకే-అమెరికా పర్యటన విజయవంతం కావాలని ఆకాంక్షించారు. సీఎం రెండు దేశాల్లో ఉన్న పలు వర్సిటీలను సందర్శించనున్నారు. అలాగే అక్కడి వర్సిటీ బృందాలతో సమావేశం కానున్నారు. లండన్‌లో పర్యటన అనంతరం రేవంత్ రెడ్డి అమెరికాకు వెళ్తారు. ఈనెల 21న లండన్‌లోని ఆక్స్‌ఫర్డ్ వర్సిటీలోని బ్లావట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నెన్స్‌ను సీఎం సందర్శించనున్నారు. అక్కడి ఎమిరేట్స్ స్టేడియంలో ఇపిఎల్ ఫుట్‌బాల్ ప్రజెంటేషన్‌లో సీఎం పాల్గొననున్నారు.

22న లండన్‌లో కేంబ్రిడ్జ్ బృందంతో సీఎం సమావేశం కానున్నారు. ఆరోజు ఉదయం 11.30 గంటలకు యూనివర్సిటీ ఆఫ్ లండన్ క్యాంపస్‌లోని సెనేట్ హౌస్‌ను సందర్శిస్తారు. ఆ తర్వాత సాయంత్రం 4 గంటలకు లండన్ బిజినెస్ స్కూల్‌కు వెళ్తారు. 23న లండన్ నుంచి అమెరికాలోని బోస్టన్‌కు బయలుదేరతారు. 24న బోస్టన్‌లో ఉదయం 10.30 గంటలకు హార్వర్డ్ యూనివర్సిటీ క్యాంపస్‌ను సందర్శిస్తారు. అనంతరం సాయంత్రం 4 గంటలకు ఎంఐటీ క్యాంపస్‌కు వెళ్తారు. 25న ఉదయం 10.30 గంటలకు బోస్టన్‌లో నార్త్ ఈస్టర్న్ క్యాంపస్‌ను సందర్శిస్తారు. ఆరోజు సాయంత్రం 4 గంటలకు వర్జీనియా టెక్ యూనివర్సిటీ బృందంతో సమావేశం అవుతారు. అలా రాత్రి 7 గంటలకు బోస్టన్ నుంచి న్యూయార్క్ సిటీకి సిఎం పయనమవుతారు.

26న న్యూయార్క్ లో రాత్రి 7 గంటలకు ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ నిర్వహించే మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పాల్గొంటారు. రెండు రోజులు అక్కడే ఉండి పలు పారిశ్రామికవేత్తలతో, పెట్టుబడిదారులతో సమావేశం అవుతారు. ఆ తర్వాత ఈనెల 29న న్యూయార్క్ నుంచి హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణం అవుతారు. 30న సీఎం హైదరాబాద్‌కు చేరుకుంటారు.

# 'కృష్ణ'ను పరిష్కరించండి

>> న్యాయబద్ధమైన పరిష్కారాన్ని కనుగొనగలగడమే అసలైన పరీక్ష అని తెలిపారు. భిన్నమైన ప్రయోజనాలను న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా, సమర్థవంతంగా సమన్వయం చేయగల సంస్థలు ఉండటమే నిజమైన సమాఖ్యవాదమని స్పష్టం చేశారు. నదులు, విద్యుత్ గ్రిడ్లు, కార్మికులు, వ్యాపారాలకు రాష్ట్ర సరిహద్దులు అడ్డంకులు కావని చెప్పారు. ఈ పరస్పర ఆధారిత పరిస్థితుల నేపథ్యంలో దక్షిణ ప్రాంతీయ మండలి వంటి సంస్థల ప్రాధాన్యత మరింత పెరుగుతోందన్నారు. నిబంధనలు స్పష్టంగా ఉండడంతో పాటుగా అన్ని రాష్ట్రాలకు ఒకే నిబంధనలు వర్తించాలని తెలంగాణ కోరుకుంటోందన్నారు. కృష్ణా జలాల విషయంలో తెలంగాణ చాలా స్పష్టంగా ఉందని చెప్పారు. దిగువ రాష్ట్రాల హక్కులకు భంగం కలిగించే ఏకపక్ష చర్యలను అడ్డుకోవాలని, కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు ఒకే సూత్రాలను వర్తింపజేయాలని సూచించారు. తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ మధ్య కృష్ణా జలాల కేటాయింపు అంశం ప్రస్తుతం కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-II పరిధిలో ఉందని, చట్టపరరంగా దీనికి త్వరితగతిన పరిష్కారం కనుగొనాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి, నక్కలగండి ఎత్తిపోతల పథకాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను పరిరక్షించాలని చెప్పారు. కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు కేంద్రం ఆర్థిక సహాయం అందించి మిగిలిన పనులను పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చేలా సహకరించాలన్నారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచినా రెండు రాష్ట్రాల మధ్య అనేక అంశాలు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని, వీటికి చట్టపరంగా తుది పరిష్కారం చూపాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. షెడ్యూల్-11లోని సంస్థల ఆస్తుల విభజనను ఆంధ్రా కోరుతోందని, అయితే చట్టంలో అందుకు స్పష్టమైన ఆధారం లేదని స్పష్టం చేశారు. సెక్షన్ 75 కింద సౌకర్యాల కొనసాగింపునకు సంబంధించిన అంశాలు మినహా ఎలాంటి ఆస్తుల విభజనకు చట్టపరమైన మద్దతు లేదని తెలిపారు. ఈ అంశం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు పరిధిలో కూడా పెండింగ్‌లో ఉన్నందున, చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా న్యాయపరమైన ప్రక్రియ ద్వారానే పరిష్కారం కనుగొనాలని కోరారు. తదుపరి 32వ దక్షిణ ప్రాంతీయ మండలి సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

# 9,10 షెడ్యూలు సంస్థల విభజన పూర్తి చేయండి

>> ఉన్న అంశాలపై కేంద్ర నిర్ణయం కోసం గడచిన 9 ఏళ్లుగా ఎదురుచూస్తున్నామని అన్నారు. విభజన చట్టంలోని సెక్షన్ 56లోని సమస్యలు, వనరుల లోటు, ఆర్థిక భారానికి సంబంధించిన అంశాలను కూడా పరిష్కరించాలని కేంద్రాన్ని కోరారు. ఎపి అభివృద్ధిలో కేంద్రం అందిస్తున్న సహకారానికి చంద్రబాబు కృతజ్ఞతలు తెలిపారు. హామీ ఇచ్చిన 11 జాతీయ సంస్థల్లో 10 ఇప్పటికే ఏర్పాటు కావడం సంతోషదాయకమని అన్నారు. పోలవరం, సౌత్ కోస్ట్ రైల్వే జోన్, అమరావతి నిర్మాణంలో కేంద్ర సహకారం కీలకమన్నారు. ఢిల్లీలోని ఎపి భవన్ అంశాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రస్తావించారు. అమరావతి రాజధానికి చట్టబద్ధత కల్పించిన కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు. నీటి వనరులు, పచ్చదనం, జీవన ప్రమాణాలు, కనెక్టివిటీ, ఆర్థిక అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నూతన రాజధాని నిర్మాణం చేస్తున్నామని సిఎం వివరించారు. చట్టంలోని షెడ్యూల్-13 కింద ఉన్న ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వాలని సిఎం కోరారు. విశాఖ- చెన్నై పారిశ్రామిక కారిడార్, మూడు విమానాశ్రయాల అభివృద్ధి, కొత్త రాజధానికి రైలు అనుసంధానం వంటి పనులు వేగంగా పూర్తి చేయాలని కోరారు. దుగరాజపట్నం పోర్టు, బిపిసిఎల్ రిఫైనరీ, విశాఖ, విజయవాడ నగరాల్లో మెట్రో రైలు ప్రాజెక్టులు, కడపలోని జిందాల్ స్టీల్‌కు రైలు అనుసంధానంపై అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**నీటి భద్రతకు 'గోదావరి-కావేరి అనుసంధానం'**

భవిష్యత్ నీటి భద్రతకు నదుల అనుసంధానమే శాశ్వత పరిష్కారమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి, కృష్ణా, వంశధార, నాగావళి, పెన్నా వంటి 40 నదులు 28 జిల్లాలకు సాగునీటిని అందిస్తున్నాయని తెలిపారు. గోదావరి-కావేరి అనుసంధానంలో భాగంగా పోలవరం, కృష్ణా, పెన్నా మీదుగా 500 టిఎంసిలకు పైగా మిగులు వరద జలాలను కావేరి బేసిన్‌కు తరలించే ప్రతిపాదనను సిఎం చంద్రబాబు కేంద్రం ముందు ఉంచారు. ఈ ప్రాజెక్టు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు ప్రయోజనం కలిగిస్తుందని అన్నారు. గంగా-కావేరి అనుసంధానాన్ని జాతీయ ప్రాజెక్టుగా చేపట్టాలని సూచించారు. గంగా నది మిగులు జలాలను దక్షిణాది ప్రాంతాలకు తరలించడం ద్వారా తమిళనాడుతో పాటు దక్షిణాది రాష్ట్రాల నీటి భద్రతకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతాల మధ్య సమన్వయానికి ప్రత్యేక దక్షిణాది నదీ బేసిన్ల సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, డీపీఆర్‌లు, అనుమతులను కాలపరిమితిలో పూర్తి చేయాలని కేంద్రాన్ని కోరారు. కేంద్ర-రాష్ట్ర సంబంధాల్లో పరస్పర విశ్వాసం, రాష్ట్రాల మధ్య సహకారం, సమష్టి అభివృద్ధి ప్రధాన లక్ష్యాలుగా సదరన్ జోనల్ కౌన్సిల్ పనిచేయాలని చంద్రబాబు ఆకాంక్షించారు. కౌన్సిల్‌లో తీసుకున్న నిర్ణయాలు త్వరితగతిన అమలు అయ్యేలా చూడాలని స్పష్టం చేశారు. సిఎం చంద్రబాబు ప్రసంగాన్ని దక్షిణాది రాష్ట్రాల సిఎంలు ప్రశంసించారు. ఈ సమావేశంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, తమిళనాడు ముఖ్యమంత్రి జోసఫ్ విజయ్, కర్ణాటక సిఎం డికె శివకుమార్, తెలంగాణా డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, కేరళ సిఎం వి.డి. సతీషన్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కె.కైలాష్ నాథన్, అండమాన్ నికోబార్ లెఫ్టినెంట్ గవర్నర్ అడ్మిరల్ డి.కె.జోషి సహా ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులు హాజరయ్యారు.



గురువారం న్యూఢిల్లీ నుండి లండన్ వెళ్తున్న సిఎం రేవంత్‌కు వీడ్కోలు పలుకుతున్న ఎంపి మల్లు రవి తదితరులు

# డిజిటల్ వేదికలతో సత్వర న్యాయం

>> సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొస్తూ తెలంగాణ రాష్ట్ర జ్యుడిషియల్ అకాడమీ,తెలంగాణ పోలీసు శాఖ సంయుక్తంగా ఈ వినూత్న సదస్సును నిర్వహించాయి. దేశంలోనే తొలిసారిగా కొత్త నేర చట్టాల డిజిటల్ అమలుకు సంబంధించిన అన్ని భాగస్వామ్య సంస్థలను ఒకే వేదికపైకి తీసుకొచ్చిన కార్యక్రమంగా ఇది నిలిచింది. తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి చొరవతో నిర్వహించిన ఈ సదస్సులో రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 1200 మంది న్యాయాధికారులు,పోలీస్,ప్రాసిక్యూషన్,జైళ్లు,ఫోరెన్సిక్,వైద్య విభాగాల అధికారులు హైబ్రిడ్ విధానంలో పాల్గొన్నారు. సదస్సును ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర హై కోర్టు చీఫ్ జస్టిస్, జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ మాట్లాడుతూ.. న్యాయం అనేది వివిధ సంస్థలు సమన్వయంతో పనిచేసినప్పుడే సాధ్యమయ్యే సామూహిక ఫలితమ్ అని పేర్కొన్నారు. నేరం నమోదైనప్పటి నుంచి దర్యాప్తు, ఫోరెన్సిక్, ప్రాసిక్యూషన్, న్యాయస్థానంలో విచారణ వరకు ప్రతి దశ కీలకమన్నారు. కొత్త నేర చట్టాల అమలులో సంస్థల మధ్య సమన్వయం, సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ప్రతి విభాగం తన బాధ్యతతో పాటు ఇతర విభాగాలు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీ అధ్యక్షురాలు జస్టిస్ మోషుమి భట్టాచార్య మాట్లాడుతూ కొత్త నేర చట్టాల సమర్థ అమలుకు భాగస్వామ్య సంస్థల మధ్య మెరుగైన సమన్వయం అవసరమన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పనిభారాన్ని పెంచకుండా ప్రక్రియలను సులభతరం చేయాలని సూచించారు. ఒకే సమాచారాన్ని పదేపదే నమోదు చేయడం, అసంపూర్తి వివరాలు ఇవ్వడం వల్ల కేసుల పరిష్కారంలో అనవసర జాప్యం జరుగుతోందన్నారు. పోలీస్ స్టేషన్ల నుంచి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో దర్యాప్తు అధికారులు తప్పులు, తప్పుడు కోడింగ్ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇలాంటి తప్పుల వల్ల ప్రాసిక్యూషన్ పరిశీలన ఆలస్యమవుతోందన్నారు. పోలీస్, ప్రాసిక్యూషన్, జైళ్ల శాఖల మధ్య సమాచార మార్పిడి మరింత వేగంగా జరగాలని తెలిపారు. కొంతమంది సిబ్బందికి డిజిటల్ వేదికలపై పూర్తి అవగాహన లేకపోవడం కూడా జాప్యానికి కారణమవుతోందని పేర్కొంటూ, సామర్థ్య పెంపు, డిజిటల్ అక్షరాస్యతపై దృష్టి పెట్టాలని సూచించారు. డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ కొత్త నేర చట్టాలు గత చట్టాల స్థానంలో కొత్త నిబంధనలు తీసుకురావడం మాత్రమే కాదని, పౌర కేంద్రిత న్యాయం, శాస్త్రీయ దర్యాప్తు, డిజిటల్ ఆధారాలు, ఎలక్ట్రానిక్ రికార్డులు, కాలపరిమితితో కూడిన ప్రక్రియలకు ప్రాధాన్యం ఇచ్చే సమగ్ర మార్పు అని వివరించారు. సదస్సులో మూడు సాంకేతిక సెషన్లు నిర్వహించారు. పాల్గొన్న వివిధ విభాగాల అధికారులు తమ అనుభవాలు, ఆచరణలో ఎదురవుతున్న సమస్యలు,పరిష్కార మార్గాలపై ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఐసిజెఎస్, ఈ-సాక్ష్య,ఆన్‌లైన్‌లో ఎఫ్ఐఆర్,చార్జిషీట్ల వినియోగం, ఈ సమన్లు, దర్యాప్తు కాలపరిమితులు,వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సాక్ష్యాల నమోదు,న్యాయ సంహిత కాల పరిమితులు,న్యాయ శృతి మాడ్యూల్,ఫోరెన్సిక్,వైద్య విభాగాల అనుసంధానం,జైళ్ల నిర్వహణ,దర్యాప్తు ప్రాసిక్యూషన్ సంస్థల మధ్య సమన్వయం వంటి అంశాలపై చర్చించారు. కొత్త నేర చట్టాల అమలు నిరంతర ప్రక్రియ కావడంతో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి అధ్యక్షతన సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రతి నెలా అమలు తీరుపై సమీక్ష నిర్వహించే అంశాన్ని పరిశీలించాలని డీజీపీ కోరారు. ఈ కార్యక్రమం మరింత సమగ్ర, సాంకేతిక ఆధారిత, పౌర కేంద్రిత న్యాయవ్యవస్థ నిర్మాణానికి తొలి అడుగుగా నిలిచింది. సదస్సుకు చొరవ చూపిన తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయమూర్తులకు, తెలంగాణ రాష్ట్ర జ్యుడీషియల్ అకాడమీకి డీజీపీ కృతజ్ఞతలు తెలిపారు. సదస్సులో తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విజయసేనారెడ్డి, జస్టిస్ మాధవీదేవి, జ్యుడీషియల్ అకాడమీ అధ్యక్షురాలు జస్టిస్ మోషుమి భట్టాచార్య, డీజీపీ సీవీ ఆనంద్, ఎన్‌సీఆర్‌బీ ప్రతినిధి ప్రశున్ గుప్తా, టీజీఎస్ఎఫ్ఎల్‌సీ డైరెక్టర్ శిఖా గోయల్, జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా, తెలంగాణ జ్యుడీషియల్ అకాడమీ ప్రిన్సిపల్ శ్రీదేవి, సీడీటీఐ డైరెక్టర్ సల్మాన్ తాజ్, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్, డీజీలు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 'గీత'దాటితే చర్యలుతప్పవు

>> గుంజా రేణుక అగ్రహంవ్యక్తం చేస్తూ ఇంకా తెలంగాణలో పటేల్ పట్వార్ వ్యవస్థ ఉంది అనుకుంటుందనీ వ్యాఖ్యనించారు.సుస్మిత కాంగ్రెస్ లో కవిత అవుదాం అనుకుంటుందా?ఇంకో సారి సుస్మిత రేవంత్ రెడ్డి గురించి మాట్లాడితే ఎక్కడ ఉన్నా పట్టుకొని కర్రు కాల్చి వాత పెడతాంసుస్మిత ముందు వార్డు మెంబర్ గా గెలువువార్డు మెంబర్ గా గెలవలేని సుస్మిత రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే స్థాయి కాదుకొండా సురేఖ ముందు కూతురును అదుపులో పెట్టుకోబ్లాక్ మెయిల్ చేస్తా అంటే ఇక్కడ నడవదు. ఇందిరా శోభన్ మాట్లాడుతూ కొండా సురేఖ దుండుకు వ్యాఖ్యలతో పాపం ఆమె తల్లి కొండా సురేఖ ఇబ్బంది పడుతున్నారని వ్యాఖ్యానించారు.సురేఖ క్షమాపణ కోరే పరిస్థితి సుస్మిత తీసుకొస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారుజ కుటుంబ సభ్యులకు ఇబ్బందులు తెచ్చే నువ్వు ఎలా లీడర్ అవుతావు? అని అడిగారు.కొండా సుష్మితపై కాల్వ సుజాత ఫైర్ అయ్యారు. నీ తండ్రికి ఎమ్మెల్సీ కావాలన్నా సురేఖ అక్క మాట్లాడాలి.నీకు టికెట్ కావాలన్నా సురేఖ అక్క మాట్లాడాలి" మధ్యలో మీరేంటి అని ప్రశ్నించారు, రేవంత్ రెడ్డిని ఏకవచనంతో సంబోధించడంపై నీ స్థాయి ఏంటీ అని అన్నారు. సుష్మిత విషయంలో ఇక ఉపేక్షించేది లేదనీ అవసరానికి, అవకాశానికి టైమ్ వస్తుంది అంటూ హెచ్చరించారు. గాంధీభవన్ మెట్లు ఎప్పుడైనా ఎక్కావా సుష్మిత? అని ఆమె అడిగారు. "మా మేనమామ రేవంత్ రెడ్డి" అని గతంలో చెప్పింది నువ్వే కదా? ఇప్పుడా మేనమామపైనే విమర్శలు ఎలా చేస్తావు అని అడిగారు. సురేఖకు నోటీసులు వెళ్లడం ఇది రెండోసారి అన్నారు.

# తెలంగాణలో కలపాలి

>> భద్రాచలం పరిసరాల్లోని ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయాలని, పెద్దవాగు ప్రాజెక్టు శాశ్వత పునరుద్ధరణకు ఏపి వాటా నిధులు విడుదల చేయాలని, ఆయిల్‌పామ్ గెలలకు టన్నుకు రూ.25 వేల కనీస హామీ ధర నిర్ణయించేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని, భద్రాచలం, ఏలూరు రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించేలా కేంద్రాన్ని కోరాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భద్రాచలం పరిసరాల్లోని యాటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీలను తెలంగాణలో తిరిగి విలీనం చేయాలని తుమ్మల కోరారు. ఈ ఐదు పంచాయతీల పరిధిలో 19 రెవెన్యూ గ్రామాలు ఉండగా, వాటి మొత్తం భౌగోళిక విస్తీర్ణం 11,122.01 ఎకరాలు అన్నారు. ఆయా ప్రాంతాల నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం సుమారు 282 కిలోమీటర్ల దూరంలో ఉండగా, తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రం కేవలం 40 కిలోమీటర్ల దూరంలోనే ఉందని వివరించారు. పరిపాలనా సేవలు, వైద్యం, విద్య, మార్కెట్లకు వెళ్లడంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వ్యవసాయ, అటవీ ఉత్పత్తుల రవాణాలో అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు సమస్యగా మారుతున్నాయని పేర్కొన్నారు.

# వెంటనే బర్తరఫ్ చేయాలి

>> ఆరోపించారు. నిషేధిత జాబితా నుంచి ఆస్తులు తొలగించుకోవడానికి దళారులు మార్కెట్ విలువలో ఏకంగా 30శాతం కమీషన్లు డిమాండ్ చేస్తున్నారన్న తీవ్ర ఆరోపణలు ఉన్నాయని,యాదాద్రి జిల్లాలో 40 వేల ఎకరాలను 22ఏ లో పెట్టారని నాలుగు నెలల క్రితమే మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్వయంగా చెప్పినా.. సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. ఓఆర్ఆర్ చుట్టుపక్కల భూములపై వివాదాలు సృష్టించి.. రాజకీయ పలుకుబడి ఉన్న బినామీ సంస్థలతో 50:50 జాయింట్ డెవలప్‌మెంట్‌కు ఇవ్వాలని యజమానులపై తీవ్ర ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. రెవెన్యూ శాఖలో ప్రైవేటు వ్యక్తుల లాభం కోసం ఇంత కుంభకోణం జరుగుతున్నా.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్యలు తీసుకోకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.2023 డిసెంబర్ నుంచి ఇప్పటి వరకు నిషేధిత జాబితాలో చేర్చిన, తొలగించిన ప్రతి భూమిపైనా రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తితో స్వతంత్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ 30 శాతం కమీషన్లు, 50:50 అగ్రిమెంట్ల వెనుక ఉన్న పెద్దలు ఎవరు? దళారులు, బినామీ సంస్థలను నడిపిస్తున్న రాజకీయ శక్తులు ఎవరు? విచారణలో నిగ్గు తేల్చాలని డిమాండ్ చేశారు. ఫోరెన్సిక్ ఆడిట్ ద్వారా ఏ ఆస్తిని ఎవరు జాబితాలో చేర్చారు. ఎందుకు తొలగించారు? మధ్యవర్తుల ప్రమేయం, ఆర్థిక లావాదేవీలపై తక్షణమే నిజాలు తేల్చాలని డిమాండ్ చేశారు..



# బంగ్లాదేశ్ కొత్త అధ్యక్షుడిగా మీర్జాఫఖ్రుల్ ఇస్లాం ఆలంగీర్ ఎన్నిక

**ఢాకా, ఆగస్టు 20:** బంగ్లాదేశ్‌లో దాదాపు 35 ఏళ్ల తర్వాత జరిగిన తొలి పోటీ అధ్యక్ష ఎన్నికల్లో బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ సీనియర్ నేత మిర్జా ఫఖ్రుల్ ఇస్లాం అలంగీర్ విజయం సాధించారు. గురువారం జరిగిన ఎన్నికల్లో ఆయన దేశ 23వ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. మిర్జా ఫఖ్రుల్‌కు 255 ఓట్లు రాగా లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్షుడు, జమాత్‌ఎఇస్లామీ నేతృత్వంలోని 11 పార్టీల ప్రతిపక్ష కూటమి అభ్యర్థి కల్నల్ ఒలి అహ్మద్‌కు 88 ఓట్లు లభించాయి. ఈ వివరాలను చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఏఎంఎం నసీర్ ఉద్దీన్ వెల్లడించారు. అధ్యక్ష ఎన్నికల్లో ఓటు వేసేందుకు మొత్తం 349 మంది పార్లమెంట్ సభ్యులు అర్హత కలిగి ఉండగా 343 మంది తమ ఓటు హక్కును వినియోగించు కున్నారు. మరో ఆరుగురు ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జాతీయ పార్లమెంట్ భవనం జాతీయ సంసద్‌లో పోలింగ్ నిర్వహించారు. బిఎన్పీలో అత్యంత సీనియర్ నేతల్లో ఒకరైన ఫఖ్రుల్ ఇస్లాం అలంగీర్ ఇప్పుడు దేశ అత్యున్నత రాజ్యాంగ పదవిని చేపట్టనున్నారు. ఆయన ఎన్నో ఏళ్లుగా ప్రతిపక్ష నేతగా కీలక పాత్ర పోషించారు. బిఎన్పీ తిరిగి అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో బంగ్లాదేశ్‌లో చోటుచేసుకున్న రాజకీయ పరివర్తనలో భాగంగానే ఫఖ్రుల్ అధ్యక్షుడిగా ఎన్నికైనట్లు అంతర్జాతీయ వార్తా సంస్థలు పేర్కొన్నాయి. మిర్జా ఫఖ్రుల్ ఇస్లాం అలంగీర్ శుక్రవారం సాయంత్రం బంగభవన్‌లో అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు సమాచారం. సాయంత్రం 7.30 గంటలకు యాక్టింగ్ స్పీకర్ కైసర్ కమాల్ ఆయనతో ప్రమాణం చేయించనున్నారు.

# పసుపు రైతుల్లో పసిడి ఆశలు

## గణనీయంగా పెరిగిన ధరలు

## రూ.8 వేల నుండి రూ.23 వేల మధ్య కొనుగోళ్లు

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** పసుపు ధరలు పెరుగుతుండటంతో రైతుల్లో పసిడి ఆశలు చిగురిస్తున్నాయి. రాష్ట్రంలో పసుపు ధరలు నాణ్యత, రకాన్ని బట్టి క్వింటాల్‌కు రూ.8 వేల నుంచి రూ.23 వేల మధ్య పలుకుతున్నాయి. కర్క్యుమిన్ శాతం, తేమ, నాణ్యత ఆధారంగా ధరల్లో వ్యత్యాసం కనిపిస్తోంది. దేశంలోనే ప్రముఖ పసుపు మార్కెట్‌గా పేరున్న నిజామాబాద్ మార్కెట్‌లో ధరలు ప్రస్తుతం గణనీయంగా పెరిగాయి. గత కొన్ని వారాల్లో గరిష్ఠ ధరలు రూ.23 వేలకుపైగా నమోదయ్యాయి. ఈ ఏడాది ప్రారంభంలో క్వింటాల్ పసుపు ధర రూ.9,500-10,500 మధ్య ఉండగా, ప్రస్తుతం దాదాపు రెట్టింపు స్థాయికి చేరడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఈ నెల 18 నాటికి నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో ఫింగర్ పసుపు కనీస ధర రూ.10,177, గరిష్ఠ ధర రూ.19,100గా నమోదైంది. సగటు ధర సుమారు రూ.15,222గా ఉంది. బల్బ్ రకానికి కనీస ధర రూ.8 వేలు, గరిష్ఠ ధర రూ.17,200 కాగా, సగటు ధర రూ.13,559గా నమోదైంది. ఈ నెల 11 నాటికి కొన్ని లావాదేవీల్లో సగటు ధర రూ.14,300 నుంచి రూ.15,555 వరకు ఉండగా, గరిష్ఠ ధర రూ.22,709 వరకు నమోదైంది. 6, 7 తేదీల మధ్య ఫింగర్ రకానికి గరిష్ఠంగా రూ.23,907 వరకు ధర పలికింది. తాజాగా ఫింగర్ రకం పసుపు క్వింటాల్‌కు గరిష్ఠంగా రూ.19,100 పలికింది. కాగా పసుపు సాగులో పెట్టుబడి ఇతర పంటలతో పోలిస్తే అధికంగానే ఉంటుంది. విత్తన దుంప, ఎరువులు, వేపపిండి, కలుపు నివారణ, నీటిపారుదల, పంట తవ్వకం, శుభ్రపరచడం, ఉడకబెట్టడం, ఎండబెట్టడం, పాలిషింగ్, రవాణా తదితర ఖర్చులు రైతుపై భారంగా ఉంటాయి. ఎకరాకు సగటు సాగు వ్యయం సుమారు రూ.1,28,900గా అంచనా వేస్తున్నారు. అంటే ఎకరాకు 24 క్వింటాళ్ల దిగుబడి, క్వింటాల్‌కు రూ.15 వేల ధర లభిస్తే సాగు వ్యయం మినహాయించిన తర్వాత సుమారు రూ.2.31 లక్షల మిగులు ఉండే అవకాశం ఉంది. అయితే భూమి కౌలు, రుణాలపై వడ్డీ, కుటుంబ శ్రమ, అదనపు పురుగుమందులు, నీటి కొరత వంటి ఖర్చులను పరిగణనలోకి తీసుకుంటే వాస్తవ లాభం తగ్గే అవకాశం ఉంది.

# అప్పనపల్లి శివారులో ఘోరప్రమాదం

## బావిలోకి దూసుకెళ్లిన కారు

## ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి(దుబ్బాక), ఆగస్టు 20, ప్రభాతవార్త :** రోడ్డు పక్కన ఉన్న బావిలోకి కారు అదుతప్పి దూసుకెళ్లడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన ఘటన బుధవారం అర్ధరాత్రి సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అప్పనపల్లిలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి ఘటనలో దుబ్బాక మండలం బలవంతపూర్‌కు చెందిన భార్య భర్తలతోపాటు ఇద్దరు పిల్లలు మృతి చెందారు. బలవంతపూర్ గ్రామానికి చెందిన రాజు(35), అతని భార్య భాగ్య(25), కుమారుడు నియాన్ (4), కుమార్తె శాన్విక(2)తో కలిసి సిద్దిపేటలో జరిగిన వేడుకల్లో పాల్గొన్ని తిరిగి రాత్రి సమ యంలో కారులో స్వగ్రామానికి వెళ్తుండగా కారు అదుపుతప్పి అప్పనపల్లి శివారు లోని రోడ్డు పక్కన ఉన్న బావిలోకి దూసుకెళ్లడంతో నలుగురు కుటుం బసభ్యులు మృతి చెందారు. ప్రమాదం జరిగిన బావిలోంచి నలుగురి మృత దేహాలను పోలీసులు క్రేన్ సహాయంతో వెలికితీశారు. బాధిత కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో మరణించిన వారి ఫొటో (ఫైల్)

# కేన్సర్ చికిత్స ఔషధ పరిశోధనల్లో ముందడుగు

## మోడెర్నా, మెర్క్ సంస్థల ట్రయల్స్‌లో సత్ఫలితాలు

**న్యూయార్కు, ఆగస్టు 20:** కేన్సర్ చికిత్సలో మరో కీలక ముందడుగు పడినట్లు తెలుస్తోంది. మోడెర్నా, మెర్క్ సంస్థలు అభివృద్ధి చేస్తున్న ఎంఆర్ఎన్ఎ క్యాన్సర్ వ్యాక్సిన్ ఇంటిస్‌మెరాన్ ఆటోజీన్ పై చివరి దశ క్లినికల్ ట్రయల్‌లో సానుకూల ఫలితాలు వచ్చినట్లు ప్రకటించాయి. మెర్క్‌కు చెందిన విస్తృతంగా ఉపయోగించే ఇమ్యూనోథెరపీ కీట్రూడాతో కలిపి ఈ వ్యక్తిగతీ కరించిన కేన్సర్ వ్యాక్సిన్‌ను ఉపయోగించి నప్పుడు, మెలనోమా తిరిగి వచ్చే ప్రమాదాన్ని తగ్గించడంలో ప్రధాన లక్ష్యాన్ని సాధించినట్లు కంపెనీలు వెల్లడించాయి. క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించే ప్రమాదానికి సంబంధించిన ద్వితీయ లక్ష్యాన్ని కూడా ఈ కాంబినేషన్ సాధించింది. ట్రయల్‌లో పూర్తిగా శస్త్రచికిత్స ద్వారా తొలగించిన స్టేజ్-2 బినుంచి నాలుగు వరకు ఉన్న మెలనోమా రోగులు మొత్తం 1,137 మంది పాల్గొన్నారు. కాంబినేషన్ చికిత్స తీసుకున్నవారిలో క్యాన్సర్ తిరిగి వచ్చే వరకు వ్యాధి లేకుండా ఉండే కాలంలో గణాంకపరంగా ముఖ్యమైన, వైద్య




పరంగా ఆశాజనకంగా మెరుగుదల కనిపించినట్లు కంపెనీలు తెలిపాయి. క్యాన్సర్ శరీరంలోని దూర ప్రాంతాలకు వ్యాపించకుండా ఉండే విష యంలో చికిత్స ప్రయోజనం చూపించింది. సాధారణ వ్యాక్సిన్లు ప్రధానంగా ఇన్ఫెక్షన్లను నివారించేందుకు రూ పొందిస్తారు. కానీ వ్యక్తి గతీకరించిన క్యాన్సర్ వ్యాక్సిన్లు ఒక్కో రోగి క్యాన్సర్‌కు ఉన్న ప్రత్యేక జన్యు లక్షణాలను ఆధారంగా చేసుకుని రూపొందిస్తారు. క్యాన్సర్ కణితిని శస్త్రచికిత్స ద్వారా తొలగించిన తర్వాత, దానిలోని జన్యు మార్పులను విశ్లేషిస్తారు. ఈ మార్పుల్లో రోగనిరోధక వ్యవస్థ క్యాన్సర్ కణాలను గుర్తించేందుకు ఉపయోగపడే లక్ష్యాలను గుర్తిస్తారు. రోగి కణితిలో కనిపించే ప్రత్యేక జన్యుమార్పుల ఆధారంగా రూపొంది స్తారు. దీని ఉద్దేశం రోగనిరోధక వ్యవస్థకు క్యాన్సర్ కణాలను గుర్తించి వాటిపై దాడి చేయడం నేర్పించడం. మెలనోమా చికిత్సలో ఇప్పటికే ప్రముఖ ఇమ్యూనోథెరపీగా ఉపయో గిస్తున్నారు. ఇప్పుడు దానికి రోగి కణితి ప్రత్యేక జన్యు లక్షణాల ఆధారంగా రూపొందించిచిన చికిత్సను జోడించడం వల్ల మరింత మెరుగైన ఫలితాలు రావచ్చనే ఆశలు కలిగాయి.

# ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు మళ్లిస్తే అధికారులపై కఠిన చర్యలు

## బాధితులకు సత్వర న్యాయం చేయాలి

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ వెంకటయ్య

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** ఎస్సీ, ఎస్టీ ఉప ప్రణాళికల కింద కేటాయించిన నిధులను దారి మళ్లించినా, లేక సంక్షేమ, అభివృద్ధికి సక్రమంగా వినియోగించకపోయినా అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. రాష్ట్రంలోని భూపాలపల్లి, వరంగల్, ములుగు తదితర జిల్లాల్లో రెండు రోజుల పాటు పర్యటిస్తూ ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ సమావేశాల్లో ఎస్సీ, ఎస్టీ అఘాయిత్యాల కేసులతో పాటు, ఎస్సీ, ఎస్టీ ఉపప్రణాళిక కింద వివిధ శాఖలు చేసిన ఖర్చులు, ఆయా వర్గాలను ప్రభావితం చేస్తున్న ఇతర సమస్యలపై పురోగతిని సమీక్షి ంచారు. అనంతరం బాధితులు మరియు కుల సంఘాల ప్రతినిధుల నుండి వారి సమస్యలకు సంబంధించి ఆయన వినతిపత్రాలు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా గురువారం ఆయా సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారిపై జరుగుతున్న అఘాయిత్యాల కేసులను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు వేగంగా న్యాయం జరిగేలా చూడటానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ఉపప్రణాళిక నిధులను ఎలాంటి మళ్లింపు లేకుండా, జనాభా ఆధారంగా ఎస్సీ, ఎస్టీ వర్గాల అభివృద్ధి, సంక్షేమం కోసమే ఖచ్చితంగా ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. ఉప ప్రణాళిక నిధుల దుర్వినియోగాన్ని నివారించడానికి కఠినమైన పర్యవేక్షణ ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీల జనాభా వాటాకు అనుగుణంగా నిధులను కేటాయించి, ఖర్చు చేయాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలను ప్రభావితం చేస్తున్న దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు. ఈ వర్గాల సమస్యలతో వ్యవహరించేటప్పుడు అధికారులు మానవతా దృక్పథాన్ని అవలంబించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారాన్ని బలోపేతం చేయడానికి, ప్రతి గ్రామంలో నిర్వహించే పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమాలను మరింత ప్రభావవంతంగా చేయాలన్నారు. ఈ కార్యక్రమాలకు కేవలం కింది స్థాయి సిబ్బందే కాకుండా తహసీల్దార్లు, సబ్ ఇన్‌స్పెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులు కూడా తప్పనిసరిగా హాజరు కావాలని చెప్పారు. గ్రామీణ నివాసితులకు ఎస్సీ, ఎస్టీ హక్కులు, చట్టపరమైన రక్షణలు, సంక్షేమ పథకాలు, ఫిర్యాదుల యంత్రాంగాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఆయా వర్గాల కాలనీలలో అభివృద్ధి పనులు పూర్తిస్థాయిలో పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్పొరేషన్లు అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ నిర్మాణ, స్వయం ఉపాధి పథకాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాల కింద అర్హులైన లబ్ధిదారులు తమకు అందాల్సిన ప్రయోజనాలను తప్పనిసరిగా పొందాలని వెల్లడించారు. అప్పీళ్లు, ఉన్నత న్యాయస్థానాలలో ఎస్సీ, ఎస్టీలకు న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలియచేశారు. ఎస్సీ, ఎస్టీలను వేధించే వారిపై కమిషన్ కఠిన చర్యలు తీసుకుంటుందని చైర్మన్ హెచ్చరించారు. ఈ వర్గాలపై దాడులను అరికట్టడానికి, నేరాలను తగ్గించడానికి పోలీసులు సమర్థవంతంగా పనిచేయాలని ఆయన కోరారు. పేదలకు సత్వర న్యాయం, ఉపశమనం అందకపోతే, కమిషన్ తగిన చర్యలను సిఫార్సు చేస్తుందని ఆయన అన్నారు.

# 23 అర్ధరాత్రి నుంచి ఆటో, క్యాబ్, వ్యాన్‌డ్రైవర్ల నిరవధిక సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న బి.వెంకటేశం

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 20, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని పది లక్షల ఆటో, క్యాబ్, వ్యాన్ డ్రైవర్ల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 23వ తేదీ అర్ధరాత్రి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిరవధికంగా సమ్మె నిర్వహిస్తున్నామని తెలంగాణ రాష్ట్ర ఆటో, యాప్ ఆధారిత సంఘాల జెఎసి తెలిపింది. ఈ మేరకు తాము సమ్మె నోటీస్‌ను రాష్ట్ర కార్మిక అధికారికి కూడా అందజేశామని గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జెఎసి నాయకులు బి.వెంకటేశం, ముకేష్‌గౌడ్, మారయ్య, అమాను ల్లాఖాన్, మల్లేష్, కోటయ్య తదితరులు తెలిపారు. తమ డిమాండ్లపై కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొని, అధికారంలోకి 33 నెలలు గడిచిన ఒక్క డిమాండ్‌ను కూడా అమలు చేయలేదని, 200 మంది ఆటో డ్రైవర్లు చనిపోవడం జరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. 23వ తేదీ అర్ధరాత్రి నుంచి నిరవధికంగా సమ్మె నిర్వహిస్తామని, 24వ తేదీన జాతీయ, రాష్ట్ర స్థాయి రహదారులను బంద్ చేస్తామని, 25వ తేదీన ప్రజా భవన్‌ను ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

తమ డిమాండ్లను అమలు చేసేంత వరకు నిరవధికంగా సమ్మెతోపాటు ప్రతిరోజు ఆందోళనా కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. ఆర్టీసీ యాజ మాన్యానికి ఇవి ఆటోలను ఇవ్వాలనే ప్రతిపాదనను వెంటనే విర మించు కోవాలని, ఆటో, రవాణా రంగ కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, పెట్రోల్, డిజీల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను పెంచాలని ఓలా, ఊబర్, ర్యాప్‌డో యాప్‌లకు బదులు ప్రభుత్వమే ఒక కొత్త యాప్‌ను తీసుకురావాలని డిమాండ్ చేశారు.

# మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీపై హత్యాయత్నం కేసు

## మేడిపల్లి ఠాణాలో జీరో ఎఫ్ఐఆర్ నమోదు, జూబ్లీహిల్స్ ఠాణాకు బదలీ

## సుమంత్‌తోపాటు మరో ఐదుగురిపై కేసులు నమోదు

**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), ఆగస్టు 20, ప్రభాతవార్త:** ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారిపై ఇనుపరాడ్లు, కర్రలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటనలో మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్‌పై మేడిపల్లి ఠాణాలో జీరో ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదైంది. గురువారం జీరో ఎఫ్ఐఆర్‌గా కేసు నమోదు చేసిన మేడిపల్లి పోలీసులు వెంటనే జూబ్లీహిల్స్ ఠాణాకు బదిలీ చేశారు. ఈ సంఘ టనలో సుమంత్‌తోపాటు మరో అయిదుగురిపై కేసులు నమోదయ్యాయి. పోలీ సుల వివరాల ప్రకారం.. బోడుప్పల్ ఆర్టీసీ కాలనీకి చెందిన గోంగిడి హరికృష్ణ(36) మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. జులై 30న సుమంత్ అనే వ్యక్తి హరికృష్ణకు ఫోన్ చేసి అత్యవసరంగా కలవాలని కోరారు. తాను సొంతూరి నుంచి అప్పుడే వచ్చానని, మరుసటి రోజు కలుస్తానని హరికృష్ణ చెప్పాడు. హరికృష్ణ స్నేహితుడైన రాము ఫోన్ చేసి అత్యవసరంగా కలవాలని చెప్పడంతో హరికృష్ణ తనతో పాటు కిరణ్ అనే వ్యక్తిని తీసుకుని జూబ్లీహిల్స్ చెక్‌పోస్టులోని రాము కార్యాలయానికి వెళ్లాడు. సుమంత్ పేరును ఉపయోగించి డబ్బులు వసూలు చేశావంటూ హరికృష్ణను ప్రశ్నించారు. తాను ఎలాంటి డబ్బులు వసూలు చేయలేదని సమాధానం చెబుతుండగానే సుమంత్ అసభ్య పదజాలంతో దూషించి ఇనుపరాడ్డుతో హరికృష్ణపై దాడి చేశాడు. సుమంత్ స్నేహితులు అక్కడికి చేరుకోగా, హరికృష్ణను చంపేయాలని వారిని ఆదేశించడంతో వారంతా కలిసి కర్రలు, ఇనుపరాడ్లతో దాడి చేశారు. విషయం ఎవరికైనా చెబితే తీవ్ర పరిణామాలు ఉంటాయని బెదిరించారు. దాడిలో హరికృష్ణ ఎడమ చేతికి ఎముక విరగడంతో తీవ్ర గాయాలవ్వడమే కాకుండా రక్తపు వాంతులు అయ్యాయి. అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఇద్దరు జూబ్లీహిల్స్ పోలీసులు హరికృష్ణను జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వైద్యం చేయించుకుని తిరిగి వస్తానని చెప్పి హరికృష్ణ పోలీస్‌స్టేషన్ నుంచి వెళ్లిపోయారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందిన హరికృష్ణ అనంతరం చెంగిచెర్లలోని ఎస్‌వీఎస్ ఆస్పత్రిలో చికిత్స తీసుకున్నారు. మెరుగైన వైద్యం కోసం ఉప్పల్‌లోని శ్రీ హెల్త్ కేర్ ఆస్పత్రికి తరలించగా ఈ నెల 10న శస్త్రచికిత్స జరిగింది. చికిత్స పొందుతున్న కారణంతోపాటు నిందితుల పట్ల భయంతో ఫిర్యాదు చేయడంలో ఆలస్యం జరిగిందని తెలిపారు. సుమంత్, ప్రశాంత్, అరుణ్‌కుమార్‌రెడ్డి, కార్తీక్, మహేందర్‌రెడ్డి, రాము తదితరులు కలిసి తనపై హత్యాయత్నానికి పాల్పడ్డారంటూ హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మేడిపల్లి పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 109, 3(5) కింద జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నేరం జరిగిన ప్రాంతం జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలోకి రావడంతో కేసు దర్యాప్తు కోసం జూబ్లీహిల్స్ ఠాణాకు బదిలీ చేశారు. జూబ్లీహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



మంత్రి కొండా సురేఖ మాజీ ఓఎస్డీ సుమంత్



# పుణెలో భీమశంకర్ జ్యోతిర్లింగాన్ని దర్శించిన గవర్నర్ శివప్రతాప్‌శుక్లా దంపతులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 20:** గవర్నర్ శివప్రతాప్ శుక్లా సతీమణి జానకిశుక్లాతో కలిసి మహారాష్ట్రలోని పుణె జిల్లా ఖేడ్ తాలూ కాలో ఉన్న ప్రముఖ భీమశంకర్ జ్యోతిర్లింగ క్షేత్రాన్ని గురువారం దర్శిం చుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, పరమశివుని ఆశీస్సులు పొందారు. అంతకుముందు గవర్నర్ దంపతులు పుణె లోని బుధ్వార్‌పేట్‌లో ఉన్న ప్రసిద్ధ శ్రీమంత్‌దగ్డూశేఠ్ హల్వాయి గణపతి మందిరాన్ని సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వ హించి, విఘ్నేశ్వరుడి దివ్య ఆశీస్సులు పొందారు. ఆలయ నిర్వాహకులు గవర్నర్ దంపతులకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేశారు.

# డిసెంబరు 11 నుంచి 22 వరకు తెలంగాణలో ఖేలో ఇండియా కార్యక్రమం

## కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయకు మంత్రి వాకిటి శ్రీహరి ఆహ్వానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు20:** రాష్ట్రంలో డిసెంబరు 11 నుంచి 22వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా కార్యక్రమంలో పాల్గొనాలని కేంద్ర ప్రభుత్వాన్ని తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానించింది. ఈ మేరకు రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీ సులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఎపి జితేందర్‌రెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ మాజీ చైర్మన్ శివసేనారెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ వీసీ ఎండీ సోనిబాలాదేవి గురువారం ఢిల్లీలో కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయాను కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని ఆహ్వానించారు. తెలంగాణలో క్రీడా రంగాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు యువ క్రీడాకారులకు జాతీయ స్థాయిలో మెరుగైన అవకా శాలు కల్పించాలనే లక్ష్యంతో ఖేలో ఇండియా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి తెలంగాణను దేశ క్రీడాపటంలో మరింత బలమైన రాష్ట్రంగా నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. ఖేలో ఇండియా కార్యక్రమ నిర్వహణ కోసం తెలంగాణను ఎంపిక చేసినందుకు మంత్రి వాకిటి కేంద్రానికి ధన్యవాదాలు తెలిపారు.

# ఫిలిప్పీన్స్ విదేశాంగ కార్యాలయాన్ని సందర్శించిన రాష్ట్ర ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీ బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు20:** ఫిలిప్పీన్స్ దేశ రాజధాని మనీలాలో ఉన్న విద్య దేశ విదేశాంగ శాఖ కార్యాలయాన్ని తెలంగాణ రాష్ట్రాలు ఉన్నారయ్య అడ్వైజరీ కమిటీ సభ్యుల బృందం గురువారం సందర్శించింది. ఫిలిప్పిన్స్ దేశ విదేశాంగ శాఖ అధికారులతో విస్తృత స్థాయిలో చర్చలు జరిపింది. ఫిలిప్పీన్స్ దేశ విదేశాంగ శాఖ అధికారులు ఆ దేశంలో అమల్లో ఉన్న ప్రపంచంలోనే అత్యుత్తమ విధానాలను తెలంగాణ బృందానికి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఎన్నారై అడ్వైజరీ కమిటీ బృందానికి సారథ్యం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్.భూపతి రెడ్డి గల్ఫ్ కార్మికులకు ఎలా అండగా ఉండాలి అన్న అంశాలపై ఫిలిప్పీన్స్ విదేశాంగ శాఖ అధికారులతో విపులంగా చర్చించారు. ఫిలిప్పీన్స్ దేశంలో అమలు చేస్తున్న వలస కార్మికుల విధానాన్ని తెలంగాణ రాష్ట్రం నుంచి గల్ఫ్ దేశాల్లో నివాసం ఉంటున్న సుమారు 15 లక్షల మంది కార్మికులకు అండగా ఉండేందుకు వసుపోతూ త్వరలో ఒక విధానపరమైన విధానాన్ని తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామని ఆది శ్రీనివాస్, డాక్టర్ ఆర్. భూపతి రెడ్డి తెలిపారు. ఫిలిప్పీన్స్ దేశ పర్యటనలో భారత విదేశాంగ శాఖ ఫస్ట్ సెక్రటరీ నీలేష్ కుమార్ రాయ్ ఈ బృందానికి సంపూర్ణ సహకారాన్ని అందించారు.

తెలంగాణ ప్రభుత్వం
పురపాలక సంఘ కార్యాలయము దుబ్బాక, జిల్లా:: సిద్దిపేట
టెండరు నోటీస్
నం. E1/2026/15th FC/2026 తేది: 20.08.2026
దుబ్బాక పురపాలక సంఘ పరిధిలో వివిధ వార్డులలో మంచినీటి వసతులు కల్పించుటకు వార్డునకు రూ.2.00 లక్షల చొప్పున, మొత్తం 20 వార్డులకు రూ: 40.00 లక్షలు మంజూరీ కాబడినవి. ఇట్టి పనులను చేపట్టుటకు ఈ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్ ఆహ్వానించనైనది. 1. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ ప్రారంభ తేది: 21.08.2026, ఉ.11.00గం. 2. బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడింగ్ చివరి తేది: 28.08.2026 సా.4.00గం. 3. బిడ్ వ్యాలిడిటీ పీరియడ్: 90 రోజులు. 4. వివరములకు సంప్రదించు ఫోన్ నెం: 9390988378, 9505507243. పైన తెలిపిన పనులకు టెండర్ ద్వారా ఆహ్వానించనైనది. తదుపరి వివరాలకు ఈ ప్రొక్యూర్‌మెంట్ వెబ్ సైట్ www.eprocurement.telangana.gov.in సంప్రదించగలరు.
సం/-. కమిషనర్, పురపాలక సంఘం దుబ్బాక.
DIPR.NO. 8295-PP/CL/ADVT/1/2026-27 తేది: 20.08.2026

hmda
హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ
4వ అంతస్తు, స్వర్ణ జయంతి కమర్షియల్ కాంప్లెక్స్, అమీర్‌పేట, హైదరాబాద్
HMDA చట్టం 2008 యొక్క 15(4) సెక్షన్ క్రింద బహిరంగ ప్రకటన
(G.O.Ms.No. 214 MA & UD Dept, తేది: 04.08.2026)
G.O.Ms.No.33, MA & UD తేది: 24.01.2013 ప్రకారం జారీ అయి ప్రకటింపబడిన మాస్టర్ ప్లాన్ MDP-2031 లో సూచించబడిన భూ వినియోగానికి హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ చట్టం, 2008 (2008 యొక్క చట్టం నం.8) యొక్క సెక్షన్ 15 యొక్క ఉప-సెక్షన్ (1) ద్వారా సంక్రమించిన అధికారాలను వినియోగించి ఇందుమూలముగా ఈ క్రింది మార్పు చేస్తోంది.
G.O.Ms.No.33, MA & UD విభాగం, తేది: 24.01.2013 ప్రకారం జారీ అయి ప్రకటింపబడిన మాస్టర్ ప్లాన్ MDP-2031 ప్రకారం రంగారెడ్డి జిల్లా మరియు ఆదిబట్ల మునిసిపాలిటీ (మం) మంగళపల్లి (గ్రా) యొక్క సర్వే నం. 463P లోని స్థలం 12965.92 చ.మీ. యొక్క విస్తీర్ణం ఏదైతే ప్రస్తుతం కొంత భాగం SDZ కొరకు, కొంత భాగం బహిరంగ స్పేస్ వినియోగానికి మరియు కొంత భాగం నీటి సంస్థ వినియోగానికి అధికారయుతంగా నిర్దేశింపబడిందో అది ఇప్పుడు నివాసిత వినియోగానికి అధికారయుతంగా నిర్దేశింపబడింది.
పై సంబంధిత వివరాలు వెబ్‌సైట్స్ http://gazette.telangana.gov.in// మరియు http://hmda.gov.in// లో అందుబాటులో ఉన్నాయి.
సం/- చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ (RR), HMDA
DIPR.No.8363-PP/CL/Advt/1/2026-27, తేది: 20.08.2026

# ఇడి చేతికి కస్టమ్ మిల్డ్ మొండి బకాయిదారుల జాబితా

## 9 మంది మిల్లర్లపై పిడి యాక్ట్‌కు ఒత్తిడి

## పెంచిన తెలంగాణ పౌర సరఫరాల శాఖ

**హైదరాబాద్, ఆగస్టు 20,ప్రభాతవార్త:** కస్టమ్ మిల్డ్ బియ్యం బకాయిలను వసూలు చేసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థతోపాటు ఇడిని కూడా రంగంలోకి దిం పేందుకు పావులు కదుపున్నట్లు తెలిసింది. తెలంగాణ వ్యాప్తంగా ఇప్పటికే గత నెల రోజులుగా 89 రైసుమిల్లులు తనిఖీచేసి 3,72,693 టన్నుల ధాన్యం గల్లంతు చేసినట్లు గుర్తిం చింది. రైసు మిల్లర్లు చీకటి బజారుకు తరలించిన ధాన్యం విలువ రూ. 927.16కోట్లు విలువ ఉంటుంది. 1057కోట్ల రూపాయలు పది రోజుల్లోనే మొత్తానికి ఎగవేత మిల్లరను నుంచి తిరిగి రాబట్టడంతో ప్రభుత్వం సఫలమైంది. కస్టమ్ రైస్ మిల్డ్ బియ్యం ఎగవేసినట్లు ఆరోపణలు ఎదుర్కొం టున్న రైస్ మిల్లర్లపై సివిల్ సప్లయ్ శాఖ చర్యలకు తీసుకొనేం దుకు కసరత్తును ప్రారంభిం చింది. ప్రభుత్వానికి భారీ మొత్తంలో బకాయిపడిన 20 మంది రైస్ మిల్లర్ల జాబితాను సివిల్ సప్లయ్ శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరె క్టరేట్‌కి తెలంగాణ ప్రభుత్వం అందించినట్లు తెలిసింది. 2022-23 రబీ, 2025-26 ఖరీఫ్ సీజన్‌కు చెందిన సిఎంఆర్ బియ్యం లేదా ధాన్యం ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిలను మిల్లర్లు ఉద్దేశపూర్వకంగా నిలిపి వేసినట్లు భావించిన ప్రభుత్వం నిఘాసంస్థలకు వారిపై ఉసిగొల్ప తున్నది. ధాన్యం లావా దేవీల్లో అక్రమ మార్గాల్లో నిధులు సమీకరించడం హవాలా రూపంలో డబ్బులు సంపాదించడం వంటి ఆరోపణలు కూడా మిల్లర్లపై మోపే అవకాశం కోసం మార్గన్వేషణ చేస్తున్నారు. మిల్లర్ల ఆస్తులు, బ్యాంకు లావా దేవీలు, ఆర్థిక వ్యవహారాలు, ధాన్యం కొనుగోళ్లు- మిల్లింగ్‌కు సంబంధించిన రికార్డులపై సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఇడి ఎన్‌ఫోర్స్‌మెర్ డైరెక్టరేట్‌ను తెలంగాణ ప్రభుత్వం కోరినట్లు పౌర సరఫరాల శాఖ వర్గాలు తెలిపాయి. ప్రభుత్వ ధాన్యం బకాయిలను చెల్లించకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు ఎదుర్కొం టున్న మిల్లర్లపై కఠిన చర్యలకు పోలీస్ శాఖ కూడా సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. మొత్తం 9 మంది రైస్ మిల్లర్లపై పిడి యాక్ట్ ప్రయోగించే దిశగా నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బకాయిల విషయంలో పలుమార్లు నోటీసులు ఇచ్చినా స్పందించక పోవడం, బకాయిలను భారీగా పెండింగ్‌లో ఉంచడం, ఆర్థిక అక్రమాలకు పాల్పడినట్లు అనుమానాలు ఉండటంతో నిఘా సంస్థలను ప్రభుత్వం వారిపై ఉసిగొల్పుతున్నది.

WONDER HOME FINANCE
వండర్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
వండర్ కార్పొ. కార్యాలయం: 620, 6వ అంతస్తు, నార్త్ బ్లాక్, వరల్డ్ ట్రేడ్ పార్క్, మాల్వియా నగర్, JLN రోడ్, జైపూర్-302017 . టెలి: 0141-4750000
సెక్యూరిటైజేషన్ 2002 చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు
రుణ ఖాతా నిరర్థకమైనందున, సెక్యూరిటీ ఇంట్రస్ట్ చట్టం 2002 యొక్క ఎన్‌ఫోర్స్‌మెంట్ మరియు ఫైనాన్షియల్ అసెట్స్ యొక్క రీకన్‌స్ట్రక్షన్ మరియు సెక్యూరిటైజేషన్ యొక్క సెక్షన్ 13(2) క్రింద అధీకృత అధికారి (AD) ఈ క్రింది పట్టికలో పేర్కొనబడిన రుణగ్రహీతకు 60 రోజుల డిమాండ్ నోటీజ్ జారీ చేసారు. ఆ నోటీస్ ప్రకారం ఆ రుణగ్రహీత 60 రోజులలో సొమ్మును డిపాజిట్ చేయకపోయినట్లయితే, క్రింద పేర్కొనబడిన విధంగా ఆ సొమ్ము సెక్యూరిటీ యొక్క వేలం నుండి రికవరీ చేయబడుతుంది. రుణగ్రహీత/హామీదారునికి పంపిన డిమాండ్ నోటీస్ సెర్వ్ చేయబడునందున క్రింద పేర్కొనబడినట్లు సెక్యూర్డ్ ఆస్తులపై డిమాండ్ నోటీస్ యొక్క కాపీ కూడా స్థిరపరచబడింది. అందువలన రుణగ్రహీత అయిన మీకు 60 రోజులలో భవిష్యత్ వడ్డీ మరియు రికవరీ ఖర్చుతోసహా రుణ మొత్తాన్ని డిపాజిట్ చేయవలసినదిగా ఇందుమూలముగా తెలియజేస్తున్నాము. లేనిపక్షంలో సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) మరియు 14 యొక్క ఏర్పాటు క్రింద క్రింద ఇవ్వబడిన సెక్యూరిటీ స్వాధీనం చేసుకోవటానికి AO స్వేచ్ఛ కలిగి ఉన్నారని తెలియజేయడమైనది.

| రుణగ్రహీత పేరు/సహ-రుణగ్రహీత/తనఖాదారు/హామీదారు/రుణ ఖాతా నం. | సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు యొక్క తేదీ మరియు మొత్తం | తనఖా పెట్టబడిన ఆస్తి యొక్క వివరణ |
|---|---|---|
| (రుణ ఖాతా నం.) LN37073HE23-24014526 శ్రీమతి నందిని మన్నె W/o శ్రీ నవీన్ మన్నె (దరఖాస్తుదారు & తనఖాదారు) శ్రీ నవీన్ మన్నె (సహ-దరఖాస్తుదారు) | 14.08.2026 రూ.6,01,723/- రూపాయలు ఆరు లక్షల ఒక వెయ్యి ఏడు వందల ఇరవై మూడు 10.08.2026 నాటికి | తెలంగాణ రాష్ట్రం-502313, మెదక్ జిల్లా, నర్సాపూర్ మండలం, గూడెంగడ్డ గ్రామం & గ్రామ పంచాయతీ వద్ద ఉన్న సర్వే నం.490/Aలో ఇంటి నం.5-51A1 వద్ద ఉన్న శ్రీమతి నందిని మన్నె W/o శ్రీ నవీన్ మన్నె యొక్క ఆస్తి యొక్క మొత్తం అదంతా, సుమారుగా కొలత 2036.70 చ.అడుగులు |

తేది : 20.08.2026
ప్రదేశం : మెదక్, తెలంగాణ
అధీకృత అధికారి
వండర్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

రాజకీయాలలో తప్పులు చేస్తే వాటి విష ఫలితాలను లక్షలు, కోట్ల మంది అనుభవించవలసి వస్తుంది.

-గోథే

# భూగర్భజల సంక్షోభం?


నీటిని నీలి బంగారం అంటారు. వాస్తవంగా చెప్పాలంటే అసలు బంగారం కన్నా నీలి బంగారమే అత్యంత విలువైనది. గొంతు తడారిపోతున్న వ్యక్తికి కావాల్సింది గుక్కెడు నీళ్లే తప్ప బండెడు బంగారం కాదు. దురదృష్టంఏమిటంటే వేసవిలోనే కాదు, వర్షాకాలంలో కూడా నీటి కష్టాలుఇబ్బడి ముబ్బడిగా ఏర్పడుతున్నాయి. ఈ యేడాది ఎల్‌నినో ప్రభావంతో తెలుగు రాష్ట్రాలతోసహా దేశంలోని అనేక ప్రాంతాల్లో నీటి సమస్య తీవ్రరూపం దాల్చబోతుందన్న సంకేతాలు వెలువడుతున్నాయి. భూగర్భమట్టాలు నానాటికీ దిగజారిపోతుండడం ఆందోళన కలిగిస్తున్నది. యేటాయేటా భూగర్భజలాల వినియోగం పెరిగిపోతుందనేందుకు ఊహించని రీతిలో పెరిగిపోతున్న బోరుబావుల సంఖ్యనే ఉదహరించవచ్చు. భూగర్భజలాల వాడకం ఎనభై శాతానికిపైగా వ్యవసాయానికి, పదిహేను శాతం పరిశ్రమలకు, తాగునీటి అవసరాలు తీర్చుకోడానికి వినియోగించుకుంటున్నారు. వినియోగం రోజురోజుకు తీవ్రస్థాయిలో పెరుగుతున్నప్పటికీ ఆ మేరకు భూగర్భజలాల భర్తీకి ప్రయత్నాలు జరగక్కపోవడంతో మట్టాలు దిగజారిపోతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోనే కాదు దేశవ్యాప్తంగా కూడా భూగర్భజలాల వినియోగం అంతకంతకు పెరుగుతున్నది. దీనిని నియంత్రించేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం ఫలించడం లేదు. మరొకపక్క గోదావరి, కృష్ణా, గంగా, యమున, కావేరి లాంటి జీవ నదుల నుండి కోట్లాది ఎకరాలకు సరిపడే సాగునీరు నిరుపయోగంగా సముద్రం పాలవుతున్నది. ఇంకొకపక్క ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా దాదాపు మూడువందల ఘనపు కిలోమీటర్ల మేర భూగర్భజలాలను భారత్ వినియోగించుకుంటున్నది. దేశంలో ఆరు వేల ఐదువందల డెబ్భైరెండు భూగర్భజలాల బ్లాకులు ఉండగా, వీటిలో మూడోవంతు బ్లాకుల్లో అవసరానికి మించి భూగర్భజలాలను తోడేస్తున్నారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే మిగతా బ్లాకులు పరిధిలోకి చేరుకొని దేశంలో భూగర్భజలాలు మరింతగా అడుగంటిపోతాయి. భారత్‌లో బోరుబావుల సంఖ్య గత అరవైయేళ్లలో దాదాపు నూట అరవై రెట్లకుపైగా పెరిగింది. ఇంకా పెరుగుతూనే ఉంది. వీటి వల్ల సన్నకారు, చిన్నకారు రైతులు లాభపడిన మాట వాస్తవం. లక్షలాది ఎకరాలు బీడుభూములు సాగుల్లోకి వచ్చిన మాట కూడా వాస్తవమే. అయితే ఇది రాను రాను పెరగడం మాత్రం అత్యంత ప్రమాదకరమంటున్నారు. నీటి సంరక్షణ పద్ధతులు పాటించకుండా వాననీటిని ఒడిసిపట్టే కార్యక్రమాలు చేపట్టకుండా బోరుబావుల మీద ఆధారపడే పరిస్థితి అనేక అనర్థాలకు దారితీస్తుందని భూగర్భశాస్త్ర నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే సమయంలో నీటివృథా కూడా బాగా పెరిగింది. పంజాబ్‌లో డెబ్భైఐదు శాతం, రాజస్థాన్‌లో అరవై శాతం, కర్ణాటక, తమిళనాడులో నలభై శాతం భూగర్భజలాలను వాడుతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే మరో రెండు దశాబ్దాలు దేశం వనరుల్లో అరవై శాతంపైగా హరించుకుపోతాయని ప్రపంచ బ్యాంకు గతంలో ఒక నివేదికలో హెచ్చరించింది. దేశ రాజధాని ఢిల్లీతోపాటు రాజస్థాన్, హర్యానా,పంజాబ్, ఉత్తరప్రదేశ్, తదితర రాష్ట్రాల్లో యేటా లక్షలాది కోట్లలీటర్ల భూగర్భజలాలను తోడేస్తుండడంతో సముద్ర మట్టాల్లో ఐదు శాతం పైగా పెరుగుదల నమోదవుతున్నది. గతంలో చేసిన అధ్యయనాల్లో వెల్లడయింది. మరొకపక్క దేశంలో అధిక శాతం జిల్లాల్లో భూగర్భజలాలు తాగుయోగ్యమైనవి కావని కేంద్రం అంగీకరించడం కలవరపరిచే పరిణామం. గతంలో పార్లమెంటులోనే ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ ప్రభుత్వం తెలిపిన వివరాల ప్రకారం రెండువందల యాభై నాలుగు జిల్లాల్లో భూగర్భజలాల్లో ఇనుము, రెండువందల ఇరవై నాలుగు జిల్లాల్లో ఫ్లోరైడ్, నూటఅరవైరెండు జిల్లాల్లో క్షారత, ముప్పైనాలుగు జిల్లాల్లో పాషాణం స్థాయికి అధిక శాతంలో ఉన్నదనే విషయం వెలుగు చూసింది. ముఖ్యంగా పాషాణం లాంటి భారీ లోహాలను భూగర్భజలాల నుంచి తొలగించడం కష్టంగా మారుతుందని అధికార వర్గాలు అంగీకరిస్తున్నాయి. ఉచిత విద్యుత్ సరఫరా కూడా బోరుబావుల సంఖ్య పెరగడానికి కారణమవుతున్నది. చట్టాలు, నిబంధనలు ఎన్ని ఉన్నా అంతగా అమలు కాకపోవడం కూడా మరొక కారణంగా చెప్పొచ్చు. కొన్ని పరిశ్రమలు ముఖ్యంగా శీతలపానీయాలు, మద్యం తయారీ కంపెనీలు భారీ స్థాయిలో భూగర్భజలాలను వినియోగించుకుంటున్నాయి. ఇక దేశవ్యాప్తంగా నగర, పట్టణ ప్రాంతాల్లో మున్సిపాలిటీల్లో వాడకం పెరిగిపోతున్నది. నీటి వృథాకు అదుపు లేకుండాపోతున్నది. పాలకుల్లో చిత్తశుద్ధి, ప్రజల్లో అవగాహనలోపం కారణంగా భూగర్భజలాల సమస్య రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తుందనే విమర్శలను కొట్టివేయలేం. భూగర్భజలాల మట్టాల పెంపునకు దేశవ్యాప్తంగా చర్యలుతీసుకోవాల్సిన తరుణం ఆసన్నమైంది. తెలంగాణ ప్రభుత్వం గతంలో మిషన్‌కాకతీయ కార్యక్రమం ద్వారా చెరువులు, కుంటల్లో పూడీకలు తీయించి మరమ్మతు చేయించడంతో చాలా ప్రాంతాల్లో భూగర్భజలాలు కొంతమేర పెరిగాయని చెప్పొచ్చు. కానీ అవి వాడుతున్న భూగర్భజలాల మట్టాలను భర్తీ చేయలేకపోతున్నాయి. అందుకే భూగర్భజలాల మట్టాలు గణనీయంగా పడిపోతున్నాయి. ఇప్పటికైనా పాలకులు ఈ విషయంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. సాగునీటి సంగతి దేవుడెరుగు. గుక్కెడు మంచినీళ్ల కోసందేశవ్యాప్తంగా కోట్లాది మంది పడరాని పాట్లు పడుతున్నారు. దాహం తీర్చుకునేందుకు అందుబాటులో ఉన్న కలుషితనీరు తాగి రకరకాల రోగాల బారినపడుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఎనిమిది దశాబ్దాలు దాటినా ఇప్పటికీ ప్రజలందరికి కనీస అవసరమైన గుక్కెడు స్వచ్ఛమైన మంచినీరు అందించలేని దురదృష్టపు పరిస్థితుల్లో ఉన్నాం.

ప్రాచీన మూఢవిశ్వాసాలను అంటిపెట్టుకోక, నవ్య సత్యాలకోసం సంసిద్ధుడవై ఉండు.



స్వామి వివేకానంద

నాలుక మనం చెప్పినట్లు వినకపోవడమే అన్ని అనర్థాలకు మూలం.



సెనెకా

## ప్రజావాక్కు

### విద్యాబోర్డులు ఏర్పాటు చేయాలి

దేశంలోపాఠశాలవిద్యకు సంబంధించి 65విద్యా బోర్డులు వేర్వేరుపాఠ్యప్రణాళికలు,మూల్యాంకన పద్ధతులు, గుర్తింపు ప్రమాణాలు,పర్యవేక్షణ వ్యవస్థలతో పనిచేస్తున్నాయి. విద్యలో వైవిధ్యం సహజమే. దేశవ్యాప్తంగా ఉన్నత విద్య, పోటీపరీక్షలు, ఉద్యోగ అవకాశాల్లో విద్యార్థులు ఒకే వేదికపై పోటీపడుతున్నప్పుడు పాఠశాల స్థాయిలోనే వేర్వేరు ప్రమాణాలుండటం విద్యార్థులకు సమాన అవకాశాల సూత్రాన్ని దెబ్బతీస్తుంది. ఈనేపథ్యంలో పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదించిన ఏకీకృత జాతీయ నియంత్రణ వ్యవస్థను సీరియస్‌గా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ఏ బోర్డుకు అనుబంధంగా పాఠశాల కొనసాగుతోందన్న దానితో సంబంధం లేకుండా, ఉపాధ్యాయుల అర్హతలు, బోధనా నాణ్యత, మూల్యాంకన ప్రమాణాలు, విద్యార్థుల భద్రత, కనీస మౌలిక వసతుల విషయంలో దేశవ్యాప్తంగా ఒకే స్థాయి ప్రమాణాలు ఉండాలి.

- హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఆహార కల్తీలను అంతం చేయాలి

మన నిత్యజీవితంలో వాడే అనేక ఆహార పదార్థాలు కల్తీకి గురవుతున్నాయి. మార్కెట్లో ఎక్కువగా కల్తీ జరిగే ముఖ్య వస్తువులనేకం. సింథటిక్ పాలు, ఎండిన బొప్పాయి గింజలు కలిపిన మిరియాలు, చౌకరకం మినరల్ ఆయిల్స్ లాంటివి కలిపిన నూనెలు, వనస్పతి (డాల్డా), జంతువుల కొవ్వు, బంగాళాదుంప గుజ్జు కలిపిన నెయ్యి, వెన్నబెల్లం పాకం,చక్కెర పాకం,కార్న్ సిరప్‌లు కలిపిన తేనె,పండ్లుత్వరగా పండడానికి కార్బైడ్,ఒకటా? రెండా? ఆర్థిక లాభాల కోసం ఆహారంలో నాణ్యతలేని, హానికరమైన లేదా పనికిరాని పై పదార్థాలను కలపడం వల్ల ఆహారం సహజగుణం కోల్పోయి,ప్రజల ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుంది.

- డా.దన్నాన అప్పలనాయుడు, విజయనగరం

### ప్రజల అవసరాలు తీర్చండి

మొరాకో వలసలకు ప్రధాన కారణం అక్కడి అభివృద్ధి నమూనాలోఉన్నది.అక్కడి యువత ఉచితఆరోగ్యంఉచిత విద్య గురించి అడుగుతుంటే అక్కడి ప్రభుత్వం 2030లో ఫుట్‌బాల్ ప్రపంచకప్ నిర్వహణకు మౌలిక సదుపాయాలు,స్టేడియంలు నిర్మిస్తున్నది. ప్రజల మౌలిక సదుపాయాలు పట్టించుకోకుండా హంగు ఆర్భాటాలకు ప్రాధాన్యత ఇవ్వబట్టే ఇలాంటి దుస్థితి దాపురించింది.

- భారత అవినాష్, జనగామ

### గురువులకు విద్యార్థుల శిక్షలా?

నల్లగొండ జిల్లా కొండపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ రూపరెడ్డిని పదవతరగతి చదివే, గంజాయిసేవించే విద్యార్థులు 27కత్తిపోట్లతో చంపడం విద్యవ్యవస్థకే తలవంపు తెస్తుంది. తల్లిదండ్రుల క్రమశిక్షణలేని విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటు పడి విద్యాబుద్ధులు చెప్పే దైవ సమానులైన గురువులను హత్య చేయడం. హింసించడం చాలా బాధాకరం. రాష్ట్రంలో ఇలాంటి విద్యార్థులను గుర్తించి తల్లిదండ్రులు, విద్యార్థులు, కౌన్సిలింగ్ నిర్వహించవలసిన అవసరం ఉంది. నేటికీ కొన్ని గురుకులాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులు, గంజాయి సేవించడం, సిగరెట్ స్మోకింగ్ చేయడం, ఫేరివల్ పార్టీ, బర్త్‌డే, పార్టీలపేరుతో మత్తుమందు పార్టీలు చేసుకుంటున్నారు.క్రమశిక్షణతో ఉండాలని మంచిగా చదవాలని చెప్పే గురువుల పైదాడులు దౌర్జన్యాలుచేస్తున్నారు. గురుకులాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు గంజాయి, స్మోకింగ్, గుట్కాలు తినడం.సిగరెట్ తాగడం వంటి చెడు అలవాటు ఉన్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### ప్రయాణికుల గోడు వినండి

మంగళగిరి బస్టాండులోకి ఎంప్లాయీస్ సచివాలయం అని కొన్ని బస్సులు వస్తున్నాయి. ఎక్కబోతే ఓన్లీ ఫర్ ఎంప్లాయీస్ అని ఎక్కనియ్యలేదు.డిపో మేనేజర్‌కు ఫిర్యాదు చేస్తే సిఆర్‌డిఏ బస్సు ఎక్కించారు. మందడం వరకు టికెట్ తీసుకున్న. మంగళగిరి నుండి హైకోర్టు, సచివాలయానికి 13 బస్సులు ఉన్నాయట.అన్నికూడా ఓన్లీ ఫర్‌ఎంప్లాయీస్ ఆట. ఇదేమిటి? ఎంప్లాయీస్‌కు బస్సులెమిటీ ? దానిలో ప్రయాణికులను ఎక్కనియ్యక పోవటం ఏమిటి?అయ్యా ఆర్టీసీ చైర్మన్ గారూ ఎంప్లాయీస్‌కు లక్షలు లక్షలు జీతాలు ఇస్తున్నారు. ఎంప్లాయీస్ వారి ఏర్పాట్లు వారు చూసుకోవాలి. సరే ఆ పేరుతో ఉన్నవాటీలో ప్రయాణికులను కూడాఎక్కించుకోవాలి.

- నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశంజిల్లా

### గడువు తేదీని చూసి తీసుకోవాలి

మనం రోజువారి కార్యక్రమాలు చేసే పనిలో పడి మనం ఏం తింటున్నామో ఏం కొంటున్నామో తెలియకుండా రోజు గడిచిపోతుంది. మనం కొంటున్న తినుబండారాలు, ఇంట్లో వాడుకునే నిత్యావసరాల సరుకులు కొన్ని దుకాణాలలో నిరంతరం నిల్వ ఉండి ఎవరు కొనకపోవడంతో ఆ నిత్యావసరాల సరుకులు వాడుకునే తేదీ గడువు ముగిసే సమయం లేదా ముగిసిపోయే అవకాశాలు కూడా లేకపోలేదు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి | ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# సప్తధారల సంగమమే వికసిత్ భారత్

**భారతదేశం ప్రపంచంలో బలమైన ఆర్థికశక్తిగా ఎదగాలని కలలు కనడం మంచిదే. కానీ ఆర్థిక పరిమాణంతోపాటు మానవ అభివృద్ధి, సామాజిక న్యాయం, ఉపాధి, విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కూడా సమానప్రాధాన్యం పొందాలి. దేశ సంపద పెరగడమే అభివృద్ధి కాదు, ప్రతి భారతీయుడి అవకాశాలు పెరగడమే అసలైన అభివృద్ధి. అందుకే సప్తధారలనుకేవలం ఏడు రంగాల జాబితాగా కాకుండా భారతదేశ భవిష్యత్తును నిర్మించే ఏడు అభివృద్ధి ప్రవాహాలుగా చూడాలి. ఈ ప్రవాహాలు సమన్వయంతో సాగితేనే భారత్ ఆర్థికంగా బలమైన, సాంకేతికంగా స్వావలంబన కలిగిన, రక్షణపరంగా సురక్షితమైన, పర్యావరణపరంగా బాధ్యతాయుతమైన, సాంస్కృతికంగా ప్రభావవంతమైన దేశంగా ఎదుగుతుంది. సప్త ధారల సంగమం సంపన్న భారతానికి మార్గం.**

తిప్పర్తి శ్రీనివాస్

భారతదేశం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకుసాగుతున్న వేళ, వికసిత్ భారత్ అనే లక్ష్యం దేశం ముందున్న అత్యంత ప్రతిష్ఠాత్మక సంకల్పంగా నిలుస్తోంది. అభివృద్ధి అంటే కేవలం ఆర్థిక వృద్ధి రేటు పెరగడం కాదు.ప్రతి కుటుంబానికి మెరుగైన జీవన ప్రమాణాలు,యువతకుఉపాధి అవకాశాలు,రైతుకు స్థిరమైన ఆదాయం, పరిశ్రమలకు అనుకూల వాతావరణం, సాంకేతికతలో స్వావలంబన, పర్యావరణ పరిరక్షణ, ప్రపంచ వేదికపై భారతదేశానికి గౌరవప్రదమైన స్థానం ఇవన్నీ కలిసిన సమగ్ర పురోగతే నిజమైన వికసిత్ భారత్. ఈ లక్ష్యాన్ని సాధించడానికి తయారీ రంగం, రైతాంగం, సాంకేతికత, గతిశక్తి, రక్షాశక్తి, గ్రీన్ ఎనర్జీ, సాఫ్ట్ పవర్ అనే ఏడు కీలక రంగాలు దేశ ప్రగతికి సప్త ధారలుగా నిలవగలవు. భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద యువ జనాభా కలిగిన దేశం. ఈ మానవ వనరులను అభివృద్ధికి వినియోగించుకోవాలంటే తయారీ రంగం బలపడాలి. కేవలం సేవారంగంపై ఆధారపడకుండా ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, రక్షణ పరికరాలు, ఔషధాలు, ఆటోమొబైల్స్, టెక్స్‌టైల్స్, యంత్ర పరికరాలు వంటి రంగాల్లో దేశీయ ఉత్పత్తి పెరగాలి. 'మేక్ ఇన్ ఇండియా' భావన ఉత్పత్తి పెంపుతోనే ఆగిపోకూడదు. 'మేడ్ ఇన్ ఇండియా' ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో విశ్వసనీయత, నాణ్యత, పోటీ సామర్థ్యం పెరగాలి. పెద్ద పరిశ్రమలతో పాటు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలను బలోపేతం చేయాలి. తయారీ రంగం విస్తరించినప్పుడే కోట్లాది యువతకుప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు లభిస్తాయి. భారత ఆర్థిక వ్యవస్థకు రైతాంగం వెన్నెముక. వ్యవసాయం లాభసాటిగా మారకుండా వికసిత్ భారత్ కల సాకారం కావడం కష్టం.రైతుకు కేవలం ఉత్పత్తి పెంచేసాంకేతికత ఇవ్వడం సరిపోదు, ఉత్పత్తికి తగిన ధర, నిల్వ సదుపాయాలు, రవాణా,ప్రాసెసింగ్, మార్కెటింగ్ వ్యవస్థలు కూడా అందుబాటులో ఉండాలి. సూక్ష్మ నీటిపారుదల, డ్రోన్ సాంకేతికత, కృత్రిమ మేధస్సు ఆధారిత వ్యవసాయ సలహాలు, మట్టి పరీక్షలు, వాతావరణ సమాచార వ్యవస్థలు రైతుకు అందుబాటులోకిరావాలి. వ్యవసాయాన్ని కేవలం పంటల సాగుగా కాకుండా 'అగ్రిబిజినెస్'గా చూడాలి.ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలను గ్రామీణ ప్రాంతాలకు తీసుకెళ్లడం ద్వారా రైతు ఆదాయాన్ని పెంచవచ్చు. రైతు బలపడితే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడితే దేశీయ మార్కెట్ విస్తరిస్తుంది. 21వ శతాబ్దపు ప్రపంచ పోటీలో సాంకేతికతే ప్రధాన శక్తి. కృత్రిమ మేధస్సు, సెమీకండక్టర్లు, క్వాంటమ్ కంప్యూటింగ్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, అంతరిక్ష సాంకేతికత వంటి రంగాల్లో భారత్ స్వయం సమృద్ధి సాధించాలి. సాంకేతికతను కేవలం పెద్ద నగరాలకు పరిమితం చేయకుండా గ్రామీణ భారతానికి తీసుకెళ్లడం అవసరం.డిజిటల్ సేవలు, ఆన్‌లైన్ విద్య, టెలీమెడిసిన్, డిజిటల్ చెల్లింపులు, ఈగవర్నెన్స్ వంటి సేవలు సామాన్యుడి జీవితాన్ని సులభతరం చేయాలి. అదే సమయంలో డిజిటల్ విభజన తగ్గాలి. సాంకేతికత కొద్దిమందికి మాత్రమే అవకాశాలు కల్పిస్తే అది సమగ్ర అభివృద్ధి కాదు. దేశ ఆర్థిక ప్రగతికి రోడ్లు, రైల్వేలు, పోర్టులు, విమానాశ్రయాలు, లాజిస్టిక్స్ వ్యవస్థలు కీలకం. ఒక ప్రాంతంలో తయారైన వస్తువు మరో ప్రాంతానికి తక్కువ సమయంలో, తక్కువ ఖర్చుతో చేరేలా మౌలిక వసతులు అభివృద్ధి చెందాలి. 'గతిశక్తి భావన కేవలం రవాణా వేగానికి సంబంధించినది కాదు.



దేశంలోని ఉత్పత్తికేంద్రాలు, మార్కెట్లు, పోర్టులు, పరిశ్రమలు, వ్యవసాయ ప్రాంతాలను సమర్థవంతంగా అనుసంధానించే సమగ్రవ్యవస్థ కావాలి. మౌలిక వసతులపై పెట్టుబడులు పెరిగితే పరిశ్రమలు వస్తాయి, ఉద్యోగాలు పెరుగుతాయి, ప్రాంతీయ అసమానతలు తగ్గుతాయి.దేశం ఆర్థికంగా ఎంత బలంగాఉన్నా,భద్రతాపరంగా బలహీనంగా ఉంటే ఆ అభివృద్ధికి స్థిరత్వం ఉండదు. అందుకే రక్షణ రంగంలో స్వావలంబన అత్యవసరం. ఆయుధాలు, డ్రోన్లు, క్షిపణులు, రాడార్లు, సైబర్ భద్రత, అంతరిక్ష రక్షణ వంటి రంగాల్లో దేశీయ సామర్థ్యాన్ని పెంచాలి. రక్షణ రంగంలో దేశీయ ఉత్పత్తి పెరగడం వల్ల ఒక వైపు జాతీయ భద్రత బలోపేతం అవుతుంది. మరోవైపు అధునాతన పరిశ్రమలకు, పరిశోధనకు, నైపుణ్య ఉపాధికి అవకాశాలు ఏర్పడతాయి. రక్షణ రంగాన్ని దిగుమతులపై ఆధారపడే వ్యవస్థనుంచి పరిశోధన, ఆవిష్కరణ, ఎగుమతుల కేంద్రంగా మార్చడం వికసిత్ భారత్‌కు కీలకం. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని ధ్వంసం చేసే నమూనా ఇకపై కొనసాగదు. భవిష్యత్తు ఆర్థిక వ్యవస్థకు సౌర,పవన, జల, గ్రీన్ హైడ్రోజన్ వంటి స్వచ్ఛమైన ఇంధన వనరులు కీలకంకానున్నాయి. గ్రీన్ ఎనర్జీపై పెట్టుబడులు పెంచడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడమే కాకుండా ఇంధన దిగుమతులపై ఆధారపడటాన్ని కూడా తగ్గించవచ్చు. విద్యుత్ వాహనాలు, బ్యాటరీ నిల్వ సాంకేతికత, గ్రీన్ హైడ్రోజన్, పునరుత్పాదక ఇంధన పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వాలి. పర్యావరణ పరిరక్షణను అభివృద్ధికి అడ్డంకిగా కాకుండా కొత్త ఆర్థిక అవకాశంగా చూడాల్సిన సమయం ఇది. భారతదేశానికి ప్రపంచ వేదికపై ప్రత్యేకమైన సాంస్కృతిక, ఆధ్యాత్మిక, మేధోసంపద ఉంది. యోగా, ఆయుర్వేదం, భారతీయ సంగీతం,నృత్యం, కళలు, సాహిత్యం, సినిమా, వంటకాలు, ప్రజాస్వామ్య విలువలు, ప్రవాస భారతీయుల ప్రభావం ఇవన్నీ భారత దేశ సాఫ్ట్ పవర్‌ను పెంచగల శక్తులు. ప్రపంచంతో సంబంధాలు కేవలం వాణిజ్యం, దౌత్యం, రక్షణ ఒప్పందాలద్వారా మాత్రమే ఏర్పడవు. సంస్కృతి, విద్య, మానవీయ విలువలు కూడా దేశాల మధ్య సాన్నిహిత్యాన్ని పెంచుతాయి. భారతీయ సంస్కృతి, విజ్ఞానం, ఆలోచనా విధానం ప్రపంచవ్యాప్తంగా మరింత విస్తరించాలి. భారతదేశాన్ని కేవలం పెద్ద మార్కెట్‌గా కాకుండా జ్ఞానం, సంస్కృతి, విలువలకు ప్రతీకగా ప్రపంచం గుర్తించేలా చేయాలి. ఈ ఏడు రంగాలను విడివిడిగా చూడటం సరైన విధానం కాదు. తయారీ రంగానికి సాంకేతికత అవసరం. తయారీకి గతిశక్తి అవసరం. రైతాంగానికి సాంకేతికత, మౌలిక వసతులు అవసరం. పరిశ్రమలకు గ్రీన్ ఎనర్జీ అవసరం. రక్షణ రంగానికి అత్యాధునిక సాంకేతికత అవసరం. ప్రపంచ మార్కెట్లలో భారత ఉత్పత్తులకు గుర్తింపు రావడానికి సాఫ్ట్‌పవర్ కూడా తోడ్పడుతుంది. అంటే ఈ సప్త ధారలుపరస్పరం అనుసంధానమైన అభివృద్ధి ప్రవాహాలు. అయితే విధానాలు రూపొందించడం మాత్రమే సరిపోదు. వాటి అమలులో పారదర్శకత, సమర్థత, జవాబుదారీతనం ఉండాలి. కేంద్రం, రాష్ట్రాలు, పరిశ్రమలు, రైతులు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థలు కలిసి పనిచేసినప్పుడే ఈ లక్ష్యం సాధ్యమవుతుంది. అభివృద్ధి ఫలాలు దేశంలోని చివరి వ్యక్తి వరకు చేరినప్పుడే వికసిత్ భారత్ అనే పదానికి నిజమైన అర్థం వస్తుంది. భారతదేశం ప్రపంచంలో బలమైన ఆర్థికశక్తిగా ఎదగాలని కలలు కనడం మంచిదే. కానీ ఆర్థిక పరిమాణంతోపాటు మానవ అభివృద్ధి, సామాజిక న్యాయం, ఉపాధి, విద్య, ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ కూడా సమానప్రాధాన్యం పొందాలి. దేశ సంపద పెరగడమే అభివృద్ధి కాదు, ప్రతి భారతీయుడి అవకాశాలు పెరగడమే అసలైన అభివృద్ధి. అందుకే సప్తధారలనుకేవలం ఏడు రంగాల జాబితాగా కాకుండా భారతదేశ భవిష్యత్తును నిర్మించే ఏడు అభివృద్ధి ప్రవాహాలుగా చూడాలి. ఈ ప్రవాహాలు సమన్వయంతో సాగితేనే భారత్ ఆర్థికంగా బలమైన, సాంకేతికంగా స్వావలంబన కలిగిన, రక్షణపరంగా సురక్షితమైన, పర్యావరణపరంగా బాధ్యతాయుతమైన, సాంస్కృతికంగా ప్రభావవంతమైన దేశంగా ఎదుగుతుంది. సప్త ధారల సంగమం సంపన్న భారతానికి మార్గం. •

# 'ఇవి' విప్లవంతో ప్రకృతిపై భారం!

నూకల దేవేందర్

ప్రపంచం ఇప్పుడు ఎలక్ట్రిక్ వాహనాల వైపు వేగంగా అడుగులు వేస్తున్నది. భారతదేశం సైతం నగరాలను కాలుష్యరహితం చేయడానికి ఈవీలకు ప్రాధాన్యత ఇస్తున్నది. తెలుగు రాష్ట్రాల్లోనూ దీనికి సంబంధించి కార్యాచరణ కొనసాగుతున్నది. హైదరాబాద్‌ను కాలుష్యం నుంచివిముక్తి చేయడానికి క్యూర్ పరిధిలో ఈవీ ఆటోలకు ప్రోత్సాహకాలు, సబ్సిడీ ఇవ్వనున్నట్లు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. అయితే ప్రపంచవ్యాప్తంగా నగరాల్లో కాలుష్య నివారణకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తున్నట్లు కనిపిస్తున్నది. అయితే ఈవీల వల్ల పట్టణాలు, నగరాల్లో కాలుష్యాన్ని కొంతమేర నివారించగలిగినా వాటి తయారీకి అవసరమయ్యే ఖనిజాల కోసం గ్రామాలు, అడవులు, పర్వతాలు, తద్వారా ప్రకృతికి ఎంత మేర నష్టం జరుగుతుందో ప్రభుత్వాలు ఒక అంచనా వేసుకోవాల్సిన సమయం ఆసన్నమైంది. సాధారణ పెట్రోల్ కారు కంటే ఈవీ కారును తయారు చేయడానికి ఆరు రెట్లు ఎక్కువ ఖనిజాలు అవసరమవుతాయని అంతర్జాతీయ ఇంధన సంస్థ (ఐఈఏ) ఇటీవల ఒక నివేదిక విడుదల చేసింది. ఎలక్ట్రిక్ కార్లలో బ్యాటరీలు, మోటార్లు, విద్యుత్ వ్యవస్థల కోసం రాగి, లిథియం, నికెల్, కోబాల్ట్, గ్రాఫైట్ వంటి ఖనిజాలు ఎక్కువగా అవసరం కావడమే దీనికి కారణమని తేల్చింది. ఈవీ మార్కెట్ పుంజుకుంటుండడంతో ఈ ఖనిజాలకు సైతం డిమాండ్ పెరుగుతున్నది. 2040 నాటికి వీటి డిమాండ్ రెట్టింపవుతుందని ఐఈఏ అంచనా వేసింది.ఈవీల తయారీకి అవసరమయ్యే ఖనిజాలు వెలికితీయాలంటే పెద్ద గనులు ఏర్పాటు చేసి మైనింగ్ చేయాల్సి ఉంటుంది. దీని కోసం అడవులను నరకడం, కొండలను తొలగించడంవంటి చర్యలు కూడా చేపట్టాల్సి ఉంటుంది. భూములను తవ్వడం, ఖనిజాలను వేరు చేయడం, శుద్ధి చేయడానికి నీరు, విద్యుత్ అవసరమవుతాయి. దీనివల్ల కూడా పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడి వేరే మార్గాల ద్వారా కాలుష్యం పెరగవచ్చు. గనుల ప్రాంతాలనుబట్టి వ్యర్థాలు, నీటి కాలుష్యం, నేలపై పడే ప్రభావం వల్ల స్థానిక జీవ వైవిధ్యానికి ముప్పు తలెత్తవచ్చు. ఎలక్ట్రిక్ వాహనాలు వంద శాతం కాలుష్యరహిత వాహనాలు కావు. పెట్రోల్ కార్లతో పోలిస్తే మన దేశంలో వీటి జీవిత కాల ఉద్గారాలు సుమారు 20 శాతం మాత్రమే తక్కువగా ఉన్నాయని అనేక నివేదికలు చెప్తున్నాయి. మరోవైపు ఈవీ తయారీకి అవసరమయ్యే ఖనిజాలు తవ్వే సమయంలో,వాటిని శుద్ధి చేసే సమయంలో, బ్యాటరీ తయారు చేసే సమయంలో పర్యావరణంపై తీవ్ర ప్రభావం ఉంటుంది. అంటే ఈవీల ద్వారా ఓ వైపు నగరాల్లో కాలుష్యాన్ని తగ్గిస్తూ గనుల తవ్వకాల పేరుతో మరో చోట పర్యావరణానికి హానీ చేస్తున్నామా? అనేది మనం నిర్ధారించుకోవాల్సి ఉన్నది.2025 నాటికి ప్రపంచ ఈవీ బ్యాటరీ వినియోగం 1.2 టెరావాట్ గంటలకు చేరింది. 2020తో పోలిస్తే ఏది ఏడు రెట్లు ఎక్కువ. భవిష్యత్తులో ఈ డిమాండ్‌ను తట్టుకోవాలంటే వాడేసిన బ్యాటరీలను రీసైక్లింగ్ చేయడం అత్యంత కీలకం. 2040 నాటికి అవసరమైన ఖనిజాల్లో 20శాతం వాటా రీసైక్లింగ్ ద్వారానే వస్తుందని అంచనా. దీంతో రీసైక్లింగ్‌పై ప్రభుత్వాలు ఇప్పటి నుంచే దృష్టి పెట్టాలి. పటిష్టమైన రీసైక్లింగ్ పాలసీని రూపొందించాలి.ఒక వాహనంలో వాడే బ్యాటరీజీవిత కాలం ఎంత? పాడైపోయాక దాన్ని ఎక్కడ రీసైక్లింగ్ చేయాలి? అనే విషయాలను పొందుపర్చాలి.ప్రతి పెట్రోల్ కారు స్థానంలో ఈవీని రోడ్డెక్కిస్తే పర్యావరణ, కాలుష్య సమస్య తీరదు. దీనివల్ల ట్రాఫిక్, పార్కింగ్ సమస్యలకు పరిష్కారం దొరకదు. ముందుగా వ్యక్తిగత వాహనాలవాడకాన్ని తగ్గించాల్సి ఉంటుంది. మెట్రో, రైళ్లు, బస్సులవైపు ప్రజలను మళ్లించాల్సి ఉంటుంది. నడిచేదూరం ఉన్నచోట నడక,సైకిల్ వాడకాన్ని ప్రోత్సహించాలి.అప్పుడే వాహనాల అవసరం తగ్గుతుంది.తద్వారా ఖనిజాలతవ్వకాలు తగ్గిప్రకృతిపై పడుతున్న భారం తగ్గుతుంది. పెట్రోల్ కారా, ఈవీ కారా అన్నదికాదు.అసలు మనకు ఎన్నికార్లు అవసరమన్న ప్రశ్నే భవిష్యత్ పర్యావరణ ప్రభావాన్ని నిర్ణయిస్తుంది. •

# పేరెంట్స్-టీచర్స్ భాగస్వామ్యమే బడులకు బలం

శ్రీ నగేష్ మల్లాడి

విద్యా విషయ విశ్లేషకులు ఒకప్రముఖ విద్యావేత్త డొరొతీ హెచ్ కొహెన్ ఏమన్నారంటే 'ఏపాఠశాల కూడా ఉపాధ్యాయుల, తలిదండ్రుల మధ్య సత్సంబంధాలు బలపరచకపోతే పిల్లల ప్రగతికి సరైన వ్యూహాలు రచించలేరు,విద్యార్థి అభిరుచులకు అనుగుణంగా అవకాశాలు ఏర్పరచలేరు' అని వక్కాణించారు. తలిదండ్రులే పిల్లలకు తొలి గురువులుగా పిల్లలను చదువు లేదా ఇతర అభివృద్ధి పథంవైపు ప్రభావితం చేసే ఒక దిక్సూచిగా చెప్పవచ్చు. చాలా సందర్భాల్లో తలిదండ్రులు బాలలకు ఒక రోల్ మోడల్‌గా నిలబడడమే కాకుండా బాలల ప్రవర్తనా నియమావళిలో, ఉత్సుకతను అందించడంలో, మంచి చెడుల బేరీజులో, జీవననైపుణ్యాల పరికల్పనలో,సామాజికభావోద్వేగ వికాసాన్ని అందించడంలో తలిదండ్రులు ప్రధాన భూమిక వహిస్తారనడంలో ఎంతమాత్రం సందేహంలేదు.పిల్లలు తమ గురించి తాము అర్థం చేసుకోవడం, తమ భావాలను మంచి భావాలను అలవరచుకోవడం, ఇతరులతో ఆరోగ్యకరమైన సంబంధాలను ఏర్పరచుకునే నైపుణ్యాలను అభివృద్ధి చేయడం తప్పనిసరి. దీనికి తోడు ఆత్మవిశ్వాసం,సామాజికస్పృహ బాధ్యతా యుతమైన నిర్ణయాలు తీసుకునే సామర్థ్యాన్ని పెంపొందించడంలో తల్లిదండ్రులు తమకర్తవ్యాన్ని నిర్వహించడం అనివార్యమనిఅనేక అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో అమ్మ, నాన్న ఇరువురూ ఉద్యోగ, ఉపాధి బాటలో, కొన్ని కుటుంబాలు తమ జీవనపోరాటంలో మునిగితేలుతూ తమ పిల్లల ఆలనా,పాలనా అజమాయిషీలో కొంచెం సమయాభావం, కొన్నిసార్లు ఏమరుపాటుగా వుంటున్నారు. డిజిటల్ మాధ్యమాల ప్రభావం, ఉమ్మడి కుటుంబాలకు దూరం, పట్టణ సంస్కృతీ, పొరుగువారితో పోలిక, సంపాదనపట్లే ఎక్కువ మక్కువ, సమయపాలనలేని ప్రయాసలు, ప్రయత్నాలు, పిల్లల బాగోగులను పర్యవేక్షించే సమయం దొరకక ఒక యాంత్రిక జీవితంలో తమ కన్నపిల్లల్ని తామే నిర్లక్ష్యం చేస్తున్న తరుణమిది. ఇదే కొనసాగితే పిల్లలు ప్రగతివైపు పయనించకుండా తీవ్రమైన మానసిక సంక్షోభంతో సరైన మార్గదర్శకత్వం లేక తొలుత తప్పటడుగులు అనిపించినా క్రమేణా చేతికందని చెడుస్నేహాలు, చెడు అలవాట్లకు, ప్రతి విషయంలోనూ విపరీతధోరణి, చదువుపట్ల నిర్లక్ష్యం, ఆలా కాదని వారిస్తే తల్లిదండ్రులపై కోపం, తాను స్వతంత్రుణ్ణి కాదనే ఆలోచన, తనను నిబంధనలతో నియంత్రిస్తున్నారే ఆరోపణలు, ఇలా పిల్లలు పెడదారిలో నడుస్తున్న ఉదాహరణలెన్నోన్నో.ఈపరిస్థితి రాకుండా బాల్యం నుండి పిల్లలను సరైనపంథాలో నడిపించడానికి తలిదండ్రులే బాధ్యతగాతమ సమయాన్ని కేటాయించడమే కాకుండా వారిని మంచి వైపు నడిపించడానికి, ప్రధాన బాధ్యత వహించాలి. కొత్త విషయాల అవగాహన కల్పించడానికి,జీవననైపుణ్యాల,కుటుంబ విలువలను బోధించడానికి,తమపిల్లలు తనకుతానే తనలక్ష్యాన్ని నిర్దేశించుకొనేలా తీర్చిదిద్దడానికి,చదువులో,సంరక్షణలో, భవిష్యత్తుకు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవడంలో తల్లిదండ్రుల



పాత్ర అత్యంతం. అంతేకాక,ముఖ్యంగా పాఠశాలలో చేరాక తన పిల్లల ప్రగతి, అంచనా, కావలసిన తోడ్పాటు వంటి విషయాలను ఉపాధ్యాయులకు కూడా విడమరచి నచ్చచెప్పే నైపుణ్యం, నేర్పరితనం చొరవ తల్లిదండ్రులకే ఉంటుంది. అందుకే ప్రతివిద్యార్థి తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాలతో తరచూ సత్సంబంధాలు కలిగి ఉండాలని, తరచూ తమ పిల్లల గురించి చర్చించాలని, తన అభిప్రాయాలను సూటిగా చెప్పి చదువులో, ప్రవర్తనలో ఏమైనా ఒడిదుడుకులు ఉంటే అప్పటికప్పుడే సరిచెయ్యాలని ఎందరో మేధావులు హెచ్చరిస్తున్నారు. బాలలు ఏవర్గమైనా, పేద,ధనిక లేదా ఏనేపథ్యంలో ఉన్నావారిని ప్రోత్సహించే లేదా తీర్చిదిద్దే తీరులోనే వారి భవిత ముడిపడి ఉంటుంది. పిల్లల బాగోగుల దర్యాప్తు లేదా చదువు పర్యవేక్షణ తనపిల్లలతో ఇంటిదగ్గర తల్లిదండ్రులు చర్చించడం సంప్రదించడమే కాకుండా మరొక చురుకైన చొరవకూడా తీసుకోవాలి. సమయం తీసుకొని తమ పిల్లలు చదువుతున్న పాఠశాలకు వెళ్లి అక్కడ జరుగుతున్న కార్యక్రమాలు, చదువుల సారాంశాలు కూడా పర్యవేక్షించాలి. తరచూ పాఠశాల ఉపాధ్యాయులను, క్లాస్ టీచర్ని కూడా కలసి తమబిడ్డల ప్రగతి గురించి దర్యాప్తు చెయ్యాలి. తల్లిదండ్రులు నిరక్షరాస్యులైనా, చదువుకున్నవారైనా ఉపాధ్యాయులను కలవడంవలన పిల్లల చదువుపట్ల తల్లిదండ్రులకున్న శ్రద్ధ, ఆసక్తిస్పష్టంగా కనిస్పిస్తుంది. పాఠశాల యాజమాన్యం పిలిచినప్పుడే కాకుండా తల్లిదండ్రులు కనీసం నెలకు ఒక్కసారైనా వెళ్లి పిల్లల గురించి తెలుసుకోవాలి. మార్కులొక్కటేకాదు ఉపాధ్యాయులతో ఎలా మెలు గుతున్నారు, తరగతిగదిలో ఎలా వ్యవహరిస్తున్నారు, పాఠం చెప్పేటప్పుడు శ్రద్ధ ఎలా ఉంది,ఎప్పుడైనా సందేహనివృత్తికై ప్రశ్నిస్తాడా లేక నిశబ్దంగానే కూర్చుంటున్నాడా, మిత్రులతో ఎలామెలుగుతున్నాడు, ఉపాధ్యాయులపట్ల, పెద్దలపట్ల గౌరవభావాలూ ఎలా ఉన్నాయి?అనే విషయాలు క్షుణంగా అడిగి తెలుసుకోవాలి. దీనితోబాటు ఆటపాటల్లో ఉత్సహం, సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారా, లేకసిగ్గు బిడియంతో ఉంటున్నారా అనే విషయాలను గమనించాలి. ఈప్రక్రియ వలన తమపిల్లల ప్రగతి లేదా వెనుకబాటు తనాన్ని అంచనా వేయడమేకాదు ఆయా అంశాలలో ఉపాధ్యాయులతో భాగస్వామ్యమై తగిన జాగ్రత్తలు తీసుకోవడానికి ఉపాధ్యాయుల సలహాలను పాటించి ఇంటి దగ్గర కుడా పర్యవేక్షించడానికి వీలు కలుగుతుంది. బాలల భవిష్యత్తు, అభివృద్ధి తరగతిగదిలోనే నిర్మించబడుతుంది గనుక దానికి సంబంధించిన వ్యూహాలను రచించడంలో ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యాలు ఎప్పటికప్పుడు చర్చిస్తూనే ఉండాలి. పేరెంట్ సమావేశాల పేరిట తల్లిదండ్రులతో నామమాత్రపు సమావేశాలే కాకుండా పిల్లల ప్రగతి, విద్యార్థి ఏదేని రంగంలో వెనుకబడి ఉంటే ఆ విషయాలను తల్లిదండ్రులతో కూడా చర్చించి ఆవిద్యార్థినేపథ్యాలను పరిగణనలోనికి తీసుకొని అనువైన వ్యూహాలను నిర్మించాలి. ఈప్రక్రియ ద్వారా విద్యార్థికి ఒక మానసిక సంబంధమైన పరిపుష్టి లభిస్తుంది. తద్వారా ఎదురైన లోపాలను సమర్థవంతంగా ఎదుర్కోగలుగుతాడు. అంతేగాక అభ్యసనలో లేదా తరగతి గదిలో ఉత్సహంగా పాల్గొనని విద్యార్థి నిర్లక్ష్యానికి గురైతే అది సమ్మిళిత విద్యా సూత్రానికే వ్యతిరేకం. అందుకే పాఠశాల యాజమాన్యాలు కూడా ఈ అంశాలను గ్రహించి విద్యార్థి ఆధారిత బోధనా వ్యూహాలను రచించి ఆచరించినప్పుడే ఏదేని రంగంలో లేదా సబ్జెక్టులో వెనుకబడిన విద్యార్థికి భరోసా కలుగుతుంది. •

# జంతర్‌మంతర్ ఘటనపై హైపవర్ కమిటీ



## జస్టిస్ సుభాష్‌రెడ్డి నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో ఏర్పాటు

### ముగ్గురు రిటైర్డ్ జడ్జిలు, సిబిఐ మాజీ డైరెక్టర్, మాజీ డిజిపి నియామకం

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** నీట్‌యుజి ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో గత నెలలో జరిగిన నిరసనల సందర్భంగా ఢిల్లీలోని జంతర్ మంతర్‌వద్ద, దేశవ్యాప్తంగా ఇతర ప్రాంతాలలో పోలీసులు, ఇతర భద్రతా సిబ్బంది మితిమీరి, అసమానంగా బలప్రయోగం చేశారన్న ఆరోపణలపై విచారణ జరిపేందుకు జస్టిస్ ఆర్. సుభాష్ రెడ్డి నేతృత్వంలో ఐదుగురు సభ్యులతో కూడిన అత్యున్నత స్థాయి విచారణ కమిటీని సుప్రీంకోర్టు గురువారం ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ రెడ్డితో పాటు, ఈ ప్యానెల్‌లోని ఇతర సభ్యులలో పంజాబ్ - హర్యానా హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి రవిశంకర్ ఝా, ఢిల్లీ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శాలిందర్ కౌర్, సిబిఐ మాజీ డైరెక్టర్ రిషి కుమార్ శుక్లా, మేఘాలయ మాజీ డిజిపి ఎల్ ఆర్ బిష్ణోయ్ ఉన్నారు. పిటిషనర్లు, ప్రతివాదులు ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్‌లు జయమాల్య బాగ్చి, వి మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం, ప్యానెల్ పరిశీలించబోయే అంశాలను నిర్దేశించింది.

**ఆందోళనకారులపై పోలీసులచర్యలను విచారించనున్న కమిటీ**

ఈ కమిటీ ప్రధానంగా రెండు కోణాల్లో సమగ్ర విచారణ చేపట్టనుంది. మొదటగా పోలీసుల చర్యలపై వచ్చిన ఆరోపణలు, నిరసనకారులపై పెల్లెట్ గన్స్, ఎలక్ట్రిక్ లాఠీలు, టియర్ గ్యాస్ ప్రయోగం, లాఠీఛార్జి వంటి తీవ్రమైన చర్యలపై విచారణ జరపనుంది.

మహిళా నిరసనకారులపై హింస, పోలీసుల నిఘా వ్యవహారాలు, అల్లర్లను నియంత్రించే క్రమంలో అవసరానికి మించి భద్రతా బలగాలు వ్యవహరించాయా అన్న కోణంలో విచారణ చేయనుంది. మరోవైపు ఆందోళనకారుల వల్ల విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందిపై జరిగిన దాడులు, హింసాత్మక ఘటనలు, నిరసనల పేరుతో జరిగిన ప్రభుత్వ, ప్రజా ఆస్తుల ధ్వంసంపైనా ఉన్నతస్థాయి కమిటీ విచారణ జరపనుంది."ఈ అత్యున్నత స్థాయి విచారణ కమిటీని ఏర్పాటు చేసేటప్పుడు సభ్యుల వ్యక్తిగత నైపుణ్యం, అనుభవం, కమిటీలోని వైవిధ్యం వంటి అనేక అంశాలను పరిగణనలోకి తీసుకున్నాం. హైపవర్ కమిటీచేసే సిఫార్సులు ఈ న్యాయస్థానానికి ఎంతో విలువైన సహాయాన్ని అందిస్తాయి. తగిన పరిశీలన అవసరమైన అన్ని అంశాలపై కమిటీ సమగ్ర అంచనాను చేపట్టగలదని మాకు నమ్మకం ఉంది. అదేవిధంగా పోలీసు అధికారులు, భద్రతా సిబ్బంది వల్ల నిరసనకారులకు తీవ్రమైన హాని, గాయాలు కలిగినట్లు వచ్చిన ఆరోపణలపై కూడా అంచనా వేయవచ్చు.

అలాగే, అటువంటి అకృత్యాలకు దారితీసిన పరిస్థితులు, అందుకు బాధ్యులైన వ్యక్తులు, బలాన్ని ప్రయోగించేటప్పుడు ఏవైనా చట్టాలు, నిబంధనలు లేదా ప్రమాణాలు ఉల్లంఘించారా? వంటి అంశాలను కూడా విచారించవచ్చు అని ధర్మాసనం పేర్కొంది. హైపవర్ చేపట్టే విచారణ ఒక్కసారి మాత్రమే చేసే ప్రక్రియగా పరిమితం కాకూడదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈ అంశాలపై నిరంతర, క్రమబద్ధమైన సమీక్షను చేపట్టాలని, అలాగే తమకు మధ్యంతర నివేదికలను ఎప్పటికప్పుడు సమర్పించాలని కమిటీని ఆదేశించింది.



# చెత్త నిర్వహణ బాధ్యత ప్రతి ఒక్కరిది

### కఠిన చర్యలు తీసుకోండి: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** చెత్త నిర్వహణ అనేది పారిశుద్ధ్య సిబ్బంది పని మాత్రమే కాదు, చెత్తను ఉత్పత్తి చేసే ప్రతి వ్యక్తి, సంస్థ బాధ్యత అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.పాఠశాలలు, కాలేజీల్లో వ్యర్థాల నిర్వహణపై అవగాహన

ఘన వ్యర్థాల నిర్వహణపై విద్యార్థుల్లో అవగాహన పెంచేందుకు పాఠశాలలు, ఉన్నత విద్యా సంస్థల పాఠ్యాంశాలు, శిక్షణ కార్యక్రమాల్లో సైద్ధాంతిక, ప్రాక్టికల్ విద్యను వెంటనే చేర్చాలని సుప్రీంకోర్టు సూచించింది. ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు, శిక్షణ పొందిన విద్యార్థులు తమ ఇళ్లలోనే వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ధర్మాసనం పేర్కొంది. దేశవ్యాప్తంగా బల్క్ వేస్ట్ జనరేటర్లను ఆరు వారాల్లో గుర్తించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. నిబంధనలను పాటించని సంస్థలు, సముదాయాలపై చర్యలు తీసుకోవాలని సూచించింది. ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను పాటించడంలో విఫలమైతే అవసరాన్ని బట్టి నీరు లేదా విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయవచ్చని ధర్మాసనం పేర్కొంది. నిబంధనలు పాటించినట్లు ధ్రువీకరణ పత్రం సమర్పించిన తర్వాతే ఆయా సదుపాయాలను పునరుద్ధరించాలని సూచించింది. మున్సిపల్ సంస్థలు ఘన వ్యర్థాల నిర్వహణ నిబంధనలను సక్రమంగా అమలు చేయాలన్న అంశంపై నేషనల్ గ్రీన్ ట్రైబ్యునల్ (ఎన్‌జిటి) ఇచ్చిన ఉత్తర్వులకు సంబంధించిన అప్పీళ్లను సుప్రీంకోర్టువిచారించింది. మొదట భోపాల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన వ్యవహారంగా ప్రారంభమైన ఈకేసు.. సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని దేశవ్యాప్తంగా ఘన వ్యర్థాల నిర్వహణపై దృష్టి సారించేలా విస్తరించింది. సమాజంలో 'చెత్తను ఉత్పత్తి చేసే హక్కు ఉంది కానీ దాని ప్రభావాన్ని నియంత్రించేందుకు సహకరించాల్సిన అవసరం లేదు' అనే ధోరణి ఉండటం విచారకరమని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఘన వ్యర్థాల నిర్వహణను పర్యవేక్షించేందుకు డిజిటల్ విధానాలను విస్తృతంగా ఉపయోగించాలని సుప్రీంకోర్టు సూచించింది. చెత్త పేరుకు పోయిన ప్రాంతాల జియోట్యాగ్‌డ్ ఫొటోలు, ప్రతి నెలా అమలు నివేదికలను ప్రత్యేక పోర్టల్ ద్వారా సమర్పించాలని ఆదేశించింది.



# కెన్యాలో హెలికాప్టర్ కూలి ఏడుగురు దుర్మరణం

**నైరోబి, ఆగస్టు 20:** కెన్యాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. సఫారీ ప్రయాణంలో ఉన్న హెలికాప్టర్ కుప్పకూలడంతో ఏడుగురు మరణించారు. మృతుల్లో ఈక్వెడార్ ఇంటెలిజెన్స్ చీఫ్ దంపతులతో పాటు ఐదుగురు అమెరికన్లుఉన్నారు. ఉత్తర కెన్యాలోని మారుమూల ప్రాంతంలో బుధవారం ఈ ప్రమాదం జరిగింది. కెన్యా పౌర విమానయాన సంస్థ తెలిపిన వివరాల ప్రకారం.. లోయిసాబా కన్జర్వెన్సీ నుంచి ఎవాసో న్యిరో ప్రాంతానికి వెళ్తుండగా ఉదయం 9.13 గంటలకు సాంబురు కౌంటీలోని పర్వత ప్రాంతంలో హెలికాప్టర్ ప్రమాదానికి గురైంది. ఘటన సమయంలో హెలికాప్టర్‌లో ఆరుగురు ప్రయాణికులు, ఒక పైలట్‌ఉన్నారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. అయితే హెలికాప్టర్‌లో ఉన్నవారంతా మృతి చెందినట్లు సాంబురు పోలీసు కమాండర్ డేవిడ్ న్యోరోయ్ వెల్లడించారు. మృతుల్లో ఐదుగురు అమెరికా పౌరులు ఉన్నట్లు అమెరికా విదేశాంగ శాఖ ధ్రువీకరించింది. ఈక్వెడార్ నేషనల్ ఇంటెలిజెన్స్ సెంటర్ డైరెక్టర్ పేరు మిచెల్ సెన్నీ-కాంటూగి.. ఆయన సతీమణి స్టెఫనీ హోలిహాన్ కూడా మృతి చెందారు. బాధిత కుటుంబాలకు సానుభూతి తెలిపిన అమెరికా రాయబార కార్యాలయం.. స్థానిక అధికారులతో కలిసి కాన్సులర్ సహాయం అందిస్తున్నట్లు పేర్కొంది.

# భార్య, సోదరిని చంపి ఆత్మహత్య చేసుకున్న ఎస్‌బిఐ ఉద్యోగి

**లక్నో, ఆగస్టు 20:** మానస్ వాజ్‌పేయి అనే ఎస్‌బిఐ బ్యాంక్‌లో ఉద్యోగి గురువారం మధ్యాహ్నం లక్నోలోని ప్రముఖ ప్రాంతమైన గోమతి నగర్‌లో ఉన్న ఐసిఐసిఐ బ్యాంక్ బయట తన భార్యను కాల్చి చంపాడు. ఈ ఘటనను చూసిన ప్రత్యక్ష సాక్షులు పోలీసులకు సమాచారం అందించారు. వారికి ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. 38 ఏండ్ల మానస్ వాజ్‌పేయి బ్యాంక్‌లో పనిచేస్తున్న తన భార్య దివ్య మిశ్రాను బయటకు పిలిచాడు. కొద్దిసేపు మాట్లాడిన తర్వాత కాల్పులు జరిపి అక్కడి నుంచి పారిపోయాడు. అక్కడ ఉన్నవారు ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయిందని డాక్టర్లు నిర్ధారించారని పోలీసులు తెలిపారు. మానస్, దివ్యలకు 12 యేండ్ల క్రితం వివాహం అయ్యింది. కొంతకాలంగా వారు విడిగా ఉంటున్నారు. దివ్య గతేడాది విడాకుల కోసం దరఖాస్తు చేసుకుందని సమాచారం. మానస్ మానసిక సమస్యలతో బాధపడుతున్న తన 28 ఏండ్ల చెల్లెలు శివ వాజ్‌పేయిని కూడా కాల్చి చంపాడు. అనంతరం తాను ఆత్మహత్య చేసుకునేముందు తన భార్యను, చెల్లెలిని చంపిన విషయాన్ని వాట్సప్ స్టేటస్‌లో పెట్టాడు. ఈ రోజు నన్ను మోసం చేసిన నా భార్యను చంపేశాను.

నా చెల్లెల్లిని చంపి, నేను చనిపోతున్నాను. ఆమె చెల్లెలు ప్రజు, అన్నీ అంతం కావాలి అని వాట్సప్ స్టేటస్‌లో రాశాడు. మానస్ 12:30కు ఇంటికి వచ్చాడని, ఆందోళన, చెమటలు పట్టిన ముఖంతో కనిపించాడని పొరుగింటివారు చెప్పారు. ఇంటిలోకి వెళ్లిన అతడు హనుమాన్ చాలీసాను ప్లే చేశాడు. తరువాత అతడి వాట్సాప్ స్టేటస్ చూసి లోనికివెళ్లి చూడగా మానస్ విగతజీవిగా కనిపించాడని వారు చెప్పారు. ఈ ఘటన గురించి దివ్య సోదరి ప్రజు మిశ్రా సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. నా సోదరిపై కాల్పులు జరిగాయని నాకు ఇప్పుడే ఫోన్ వచ్చింది. ఆమెను లోహియా ఆస్పత్రికి తరలించారు. దయచేసి ప్రార్థించండి అని ఆమె యుపి పోలీసులకు ట్యాగ్ చేశారు. మానస్ తన వాట్సప్ స్టేటస్‌లో ప్రస్తావించిన ప్రజు ఈమె అని పోలీసులు నిర్ధారణకు వచ్చారు.

# చీనాబ్ వంతెనపై 100 కిమీ వేగంతో వందేభారత్

**శ్రీనగర్, ఆగస్టు 20:** భారతీయ రైల్వే చరిత్రలో మరో సువర్ణాధ్యాయం ఆవిష్కృతమైంది. దుర్భేద్యమైన కాశ్మీర్ లోయను దేశంలోని ఇతర ప్రాంతాలతో అనుసంధానించే క్రమంలో నిర్మించిన ఇంజనీరింగ్ అద్భుతమైన చీనాబ్ రైల్వే బ్రిడ్జిపై మన ప్రతిష్టాత్మక వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు వంద కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లి సరికొత్త రికార్డు సృష్టించింది.

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన రైల్వే వంతెనపై గంటకు దాదాపు 100కి.మీ వేగంతో శరవేగంగా ప్రయాణించి, భారత్ తన రవాణా సాంకేతికతతో ప్రపంచాన్ని మరోసారి ఆశ్చర్యపరిచింది. ఉత్తర రైల్వే పరిధిలోని శ్రీమాతా వైష్ణోదేవి కత్రా నుంచి బనిహాల్ వరకు ఉన్న 111 కిలోమీటర్ల పొడవైన నూతన బ్రాడ్ గేజ్ రైలు మార్గంలో రైళ్ల వేగాన్ని గంటకు 100 కిలోమీటర్లకు పెంచేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ అధికారికంగా ఆమోదం తెలిపింది. గతంలో ఈ మార్గంలోని కత్రాసంగల్దాన్ సెక్షన్‌లో గంటకు 85 కి.మీ, సంగల్దాన్ బనిహాల్ సెక్షన్‌లో గంటకు 75 కి.మీ మాత్రమే గరిష్ట వేగానికి అనుమతి ఉండేది.

# ఇరాన్‌కు ఆర్థిక సాయం చేస్తే భారీ మూల్యం తప్పదు

## దేశాలకు ట్రంప్ 'ఎకనామిక్ డీ-డే' హెచ్చరిక



**వాషింగ్టన్, ఆగస్టు 20:** ఇరాన్‌కు ఆర్థికంగా లేదా లాజిస్టిక్స్ పరంగా సహాయం చేసే దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌కు ఎలాంటి ఆర్థిక సహాయం అందించినా 'భారీ ఆర్థిక పరిణామాలు' ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఇరాన్‌పై కొనసాగుతున్న అమెరికా సైనిక చర్యను అత్యంత తీవ్రమైన ఆర్థిక ఆపరేషన్‌గా ట్రంప్ అభివర్ణించారు. ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో చేసిన సుదీర్ఘ పోస్టులో ఇరాన్‌కు సంబంధించిన చమురు అక్రమ రవాణా, నగదు బదలీలు, ఎక్స్ఛేంజ్ హౌస్‌లు, షిప్ రిజిస్ట్రేషన్లు, నకలీ లేదా ముందస్తు కంపెనీల ద్వారా జరిగే లావాదేవీలను వెంటనే నిలిపివేయాలని కోరారు.

**'ఎకనామిక్ డీ-డే' అంటూ ట్రంప్ హెచ్చరిక**

ఇరాన్‌కు సహాయం చేస్తున్న దేశాలను ఉద్దేశించి ట్రంప్ ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అమెరికా మిత్రదేశాలన్నీ తమతో కలిసి ఇరాన్‌ను ఒంటరిగాచేసి, ఆ దేశం నుంచి ఎదురయ్యే ముప్పును ఓడించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. ఇరాన్ ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిలో ఉందని, ఆ దేశం 'ఒక దారంతో వేలాడుతున్నట్లుగా' ఉంది ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాల్ని పొందేందుకు అనుమతించబోమని కూడా మరోసారి స్పష్టం చేశారు.

**ఇరాన్‌పై మరిన్ని కఠిన ఆంక్షలకు సంకేతాలు**

ఇరాన్‌పై మరిన్ని కఠిన ఆంక్షలు విధించే అవకాశం ఉందని ట్రంప్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. ఫిబ్రవరి 28 నుంచి అమెరికా, ఇరాన్ మధ్య సైనిక ఘర్షణ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ హెచ్చరికలు వచ్చాయి. ఇరాన్‌పై ఆర్థిక ఒత్తిడిని మరింత పెంచేందుకు అమెరికా సిద్ధమవుతోందనే సంకేతాలను ట్రంప్ తాజా వ్యాఖ్యలు ఇస్తున్నారు. ఇరాన్‌పై చేపట్టిన నౌకాదళ దిగ్బంధనం విజయవంతమైందని ట్రంప్ పేర్కొన్నారు. ఈ దిగ్బంధనం '100 శాతం విజయవంతమైంది' అని అన్నారు. ఇరాన్‌పై ఆంక్షలు, సైనికచర్యలు కొనసాగుతున్నప్పటికీ అంతర్జాతీయ చమురు ధరలు పెద్దగా పెరగలేదని ట్రంప్ పేర్కొన్నారు. చమురు మార్కెట్‌లో అంతరాయాలు ఉన్నప్పటికీ ధరలు ఎక్కువగా స్థిరంగా ఉన్నాయని అన్నారు.

ఇరాన్‌పై అమెరికా చర్యల విషయంలో ట్రంప్‌పై ఒత్తిడి పెరుగుతున్నట్లు సమాచారం. నివేదిక ప్రకారం.. ఇరాన్ స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్‌నుతెరిస్తే అమెరికా తనచర్యలను నిలిపివేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రపంచ చమురు సరఫరాకు స్ట్రెయిట్ ఆఫ్ హార్ముజ్ అత్యంత కీలకమైన మార్గాల్లో ఒకటి కావడంతో, ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు అంతర్జాతీయ ఇంధన మార్కెట్లపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

# జార్ఖండ్ ప్రభుత్వం పరీక్ష, నియామకాల రద్దుపై హైకోర్టు స్టే



**రాంచి, ఆగస్టు 20:** జార్ఖండ్‌లోని హేమంత్ సోరెన్ ప్రభుత్వానికి భారీ ఎదురుదెబ్బ తగిలింది. జెపిఎస్‌సి పరీక్షల్ని రద్దు చేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై జార్ఖండ్ హైకోర్టు స్టే విధించింది. సింగిల్ బెంచ్ జడ్జి జస్టిస్ దీపక్ రోషన్ గురువారం ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో జెపిఎస్‌సి పరీక్షల ద్వారా ఇటీవల నియామకమైన ప్రభుత్వ ఉద్యోగులకు ఊరట లభించింది. జెపిఎస్‌సి (జార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్)తోపాటు జెపిఎస్‌సి (జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్) చేపట్టిన పరీక్షల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ అక్కడి విద్యార్థి సంఘాలు, యువత గత నెల నుంచి పెద్ద ఎత్తున ఆందోళన చేసిన సంగతి తెలిసిందే. కొందరు విద్యార్థులు ఆమరణ నిరాహార దీక్షలకు దిగారు. విద్యార్థి సంఘాలతోపాటు ప్రతిపక్షాలు కూడా విద్యార్థులకు మద్దతుగా నిలిచాయి. రెండేళ్లుగా ఈ రెండు సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షల్ని రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. చివరకు వారి డిమాండ్లకు తలొగ్గిన సిఎం హేమంత్ సోరెన్ ఆధ్వర్యంలోని సర్కార్ పరీక్షల్ని రద్దు చేసింది. 2024 నుంచి జెపిఎస్‌సి ఆధ్వర్యంలో నిర్వహించిన పరీక్షలు, నియామకాల్ని రద్దు చేస్తూ ఇటీవలే నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ నిర్ణయాన్ని తాజాగా ఎంపికైన ఉద్యోగులు వ్యతిరేకిస్తున్నారు. జెపిఎస్‌సిద్వారా రెండేళ్లుగా దాదాపు 39 ఉద్యోగ నియామక పరీక్షలు జరిగాయి. వాటిలో కొన్ని ఫలితాలు వెలువడి నియామకాలు కూడా పూర్తయ్యాయి. వేలాది మంది ఉద్యోగాల్లో చేరిపోయారు. జెపిఎస్‌సి ప్రక్రియద్వారా ఎన్నికై.. యేడాది, రెండేళ్ల నుంచి ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. అయితే, ప్రభుత్వం ఈ పరీక్షల్ని, నియామకాల్ని రద్దు చేయడంతో వారి ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి వచ్చింది. దీంతో వారు ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జార్ఖండ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవల ఎంపికైన ఉద్యోగుల ఆధ్వర్యంలో ఈ పిటిషన్ దాఖలైంది. ప్రభుత్వ నిర్ణయంవల్ల తమకు అన్యాయం జరుగుతుందని వారు పిటిషన్‌లో పేర్కొన్నారు. దీనిపై విచారించిన కోర్టు పరీక్షల్ని రద్దుచేస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై స్టే విధించింది. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఏనిర్ణయం తీసుకుంటుందో చూడాలి.

# కాంగ్రెస్ మాజీ ఎంపి సజ్జన్‌కుమార్ కన్నుమూత



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్ కన్నుమూశారు. 1984 నాటి సిక్కు అల్లర్ల కేసులో ఆయన జీవితకాల శిక్షను అనుభవిస్తున్నారు. ఢిల్లీలోని సఫ్దార్‌జంగ్ ఆస్పత్రిలో ఆయన ప్రాణం విడిచారు. తీహార్ జైలు నుంచి ఆయన్ను చివరి క్షణాల్లో ఆస్పత్రికి తరలించారు. ఆయన వయసు 80 ఏళ్లు. చాలా కాలంగా పలు రకాల రుగ్మతలతో ఆయన బాధపడుతున్నారు. ఢిల్లీలోని రౌజ్ అవెన్యూ కోర్టు గత ఏడాది ఫిబ్రవరి 12వ తేదీన సజ్జన్ కుమార్‌ను దోషిగా తేల్చింది. ఆ తర్వాత ఆయనకు ఆ కేసులో జీవితకాల శిక్షను విధించింది. సజ్జన్ కుమార్‌కు మరణశిక్ష విధించాలని కోరుతూ సిక్కు అల్లర్ల బాధితులు డిమాండ్ చేశారు. మూడు సార్లు ఆయన లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఔటర్ ఢిల్లీ నియోజకవర్గం నుంచి ఆయన పోటీ చేశారు. కాంగ్రెస్ పార్టీలో ప్రముఖ నేతగా గుర్తింపు ఉన్నది. 2018లో దోషిగాతేలడంతో ఆయన పార్టీకి రాజీనామా చేశారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హత్య తర్వాత ఢిల్లీలో అల్లర్లు చోటుచేసుకున్నాయి. 1984 అక్టోబర్ 31వ తేదీన ఇందిరా గాంధీ బాడీగార్డులు సత్వంత్ సింగ్, బియాంత్ సింగ్ ఆమె హత్యకు పాల్పడ్డారు. అయితే ఆ హత్య నేపథ్యంలో సిక్కులపై ఢిల్లీలో ఊచకోత జరిగింది. సిక్కుల ఇండ్లు, షాపులపై దాడి చేశారు. సుమారు 3వేల మంది సిక్కులను హతమార్చారు. జశ్వంత్ సింగ్‌తో పాటు ఆయన కుమారుడి హత్య కేసులో సజ్జన్‌కుమార్ నిందితుడిగా ఉన్నారు. ఇందిరా గాంధీ మరణం తర్వాత ఇద్దరు సిక్కులను హతమార్చిన కేసులో మరో వ్యక్తి యశ్‌పాల్ మాలిక్‌కు మరణశిక్ష వేశారు. ఇక ఇదే ఘటనతో లింకున్న కిషోరి లాల్ అనే వ్యక్తికి కూడా 1996లోనే మరణశిక్ష విధించారు. కానీ సిక్కుల మర్డర్ కేసులో సజ్జన్ కుమార్‌కు కేవలం జీవితకాల శిక్ష పడింది

# రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేతల నివాళులు

**న్యూఢిల్లీ,ఆగస్టు 14:** భారతదేశ మాజీ ప్రధాన మంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ అగ్రనేతలు గురువారం ఘన నివాళులు అర్పించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ సహ పలువురు నేతలు ఆయనకు అంజలి ఘటించారు. వారంతా రాజీవ్ గాంధీ స్మారక చిహ్నమైన వీరభూమిని సందర్శించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వీడియోను ఎక్స్ వేదికగా కాంగ్రెస్ పార్టీ షేర్‌చేసింది. ఈ సందర్భంగా ఆధునిక భారతదేశ నిర్మాణంలో రాజీవ్ గాంధీ కృషి ఎప్పటికీ స్మరించుకోతగినది అని కాంగ్రెస్ పేర్కొంది. దేశవ్యాప్తంగా ఉన్న ఆ పార్టీ శ్రేణులు నేడు మాజీప్రధాని జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నాయి. ఎక్కడికక్కడ రాజీవ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్నారు. దేశానికి ఆయన చేసిన సేవలను స్మరించుకుంటున్నారు. మరోవైపు రాజీవ్ గాంధీకి ప్రధాని నరేంద్ర మోడీ కూడా నివాళులు అర్పించారు. సద్భావనా దివస్ సందర్భంగా ఆయనను మోడీ స్మరించుకున్నారు. భారత మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులు అంటూ ఎక్స్ వేదికగా మోడీ పోస్టు చేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా నేడు సద్భావనా దివస్ (గుడ్‌విల్ డే) జరుపుకుంటారు. ఈ రోజు మాజీ ప్రధాని ప్రతిపాదించిన విలువలను స్మరించుకుంటారు.

# మోహన్ భగవత్‌కు దౌత్య మర్యాదలు వద్దు

### అమెరికా కమిషన్ సంచలన వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఆర్‌ఎస్‌ఎస్‌పై ఆంక్షలు విధించాలని అమెరికాకు చెందిన మత స్వేచ్ఛల కమిషన్ (యుఎస్సీ ఐఆర్‌ఎఫ్) డిమాండ్ చేసింది. ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ఈ నెల 29న న్యూయార్క్ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో ఈ ప్రతిపాదన రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. భగవత్‌తోపాటు ఆర్‌ఎస్‌ఎస్ నేతలకు అమెరికా ప్రభుత్వం ఉన్నతస్థాయి దౌత్య మర్యాదలు ఇవొవ్వద్దని కమిషన్ సభ్యులు కోరారు. ఆర్‌ఎస్‌ఎస్‌కు చెందిన అనుబంధ సంస్థలు భారత్‌లో మైనారిటీలపై దాడులకు పాల్పడ్డాయని యుఎస్సీ ఐఆర్‌ఎఫ్ చైర్మన్ ఆసిఫ్ మహమూద్ ఆరోపించారు.

ప్రధాని నరేంద్ర మోడీ సైతం ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడేనని పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ నేతలపై ఆంక్షలు విధించాలని కమిషనర్ జీన్ మిల్స్ సూచించారు. మత స్వేచ్ఛ ఉల్లంఘనలకు బాధ్యులైన ఆర్‌ఎస్‌ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని అమెరికా ప్రభుత్వాన్ని కోరారు. మార్చిలో విడుదల చేసిన వార్షిక నివేదికలోనూ భారత్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసిన యుఎస్సీ ఐఆర్‌ఎఫ్.. ఆర్‌ఎస్‌ఎస్, రా వంటి సంస్థలపై ఆంక్షలు విధించాలని సిఫార్సు చేసింది.

అయితే యుఎస్సీ ఐఆర్‌ఎఫ్ ఆరోపణలను భారత్ గతంలోనే ఖండించింది. భారత్‌పై వక్రీకరించిన, ఏకపక్ష చిత్రాన్ని ఆ సంస్థ చూపుతోందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది.

అనుమానాస్పద వర్గాలు, భావజాల కథనాల ఆధారంగా యుఎస్సీ ఐఆర్‌ఎఫ్ నివేదికలు తయారవుతున్నాయని విమర్శించింది. భారత బహుళత్వ సమాజంపై తప్పుడు ముద్ర వేసేందుకు ఆ సంస్థ ప్రయత్నిస్తోందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మండిపడ్డారు. అమెరికాలో హిందూ దేవాలయాలపై దాడులు, భారతీయులపై పెరుగుతున్న అసహనాన్ని ముందుగా పరిశీలించాలని సూచించారు.

# సంక్షిప్త వార్తలు

## పాక్ హైకమిషన్‌వద్ద ఢిల్లీ సర్కార్ బుల్‌డోజర్



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** పాకిస్థాన్‌కు భారత్ తగిన గుణపాఠం చెప్పింది. పాకిస్తాన్ చర్యకు ధీటుగా బదులిచ్చింది. ఇటీవల పాకిస్తాన్‌లోని భారత రాయబార కార్యాలయం వద్ద ఉన్న బారికేడ్లను పాక్ ప్రభుత్వం తొలగిస్తే ఇప్పుడు ఇండియా కూడా ఇక్కడ ఉన్న పాక్ రాయబార కార్యాలయం వద్ద బుల్డోజర్ చర్యకు దిగింది. పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్‌లో భారత రాయబార కార్యాలయం ఉంది. ఈ కార్యాలయం వద్ద ఉన్న సెక్యూరిటీ బారికేడ్లను ఇటీవల పాకిస్థాన్ ప్రభుత్వం తొలగించింది. ఇది జరిగి మూడు రోజులు అవుతోంది. దీంతో పాక్ చర్యకు భారత్ కూడా అదేరీతిలో బదులిచ్చింది.

## గ్యాంగ్‌స్టర్ వినోద్‌ను కాల్చివేసిన దుండగులు

**హిసార్, ఆగస్టు 20:** గ్యాంగ్‌స్టర్ వినోద్ పను అలియాక్ కనాను దుండగులు గురువారం కాల్చి చంపారు. హరియాణాలోని హిసార్‌లో ఉన్న కోర్టు గేటు బయట కాల్చిచంపారు. ఒక కేసు విచారణ కోసం వినోద్ కోర్టుకు వెళ్తుండగా, బైకుపై వచ్చిన దుండగులు అతడిపై గేటు బయట కాల్పులు జరిపారు. దాదాపు 12 రౌండ్ల కాల్పులు జరపడంతో అతడు అక్కడికక్కడే మరణించాడు.ముందుగా వినోద్ దగ్గరికి వచ్చిన దుండగులు సమీపం నుంచి వరుసగా కాల్పులు జరిపారు. అనంతరం రెండు రౌండ్లు గాలిలో కాల్పులు జరిపారు. కాల్పుల అనంతరం ఇద్దరు దుండగులు వేగంగా బైకుపై అక్కడినుంచి పారిపోయారు.

## రూ. 20 లంచం కేసులో 30 యేళ్లకు సుప్రీం క్లీన్ చిట్

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** 1996లో నమోదైన రూ.20 లంచం ఆరోపణల కేసులో గుజరాత్ ప్రభుత్వానికి చెందిన ఓ క్లర్క్, ప్యూన్‌కు విధించిన శిక్షను సుప్రీంకోర్టు రద్దు చేసింది. విద్యార్థికి ఆదాయ ధ్రువీకరణ పత్రం జారీ చేసేందుకు రూ.120 లంచం డిమాండ్ చేశారని ఆరోపణలు వచ్చాయి. ఎసిబి నిర్వహించిన ట్రాప్‌లో ప్యూన్ వద్ద రూ.20 స్వాధీనం చేసుకోగా.. క్లర్క్ వద్ద ఆరోపించిన రూ.100 లభించలేదు. లంచం డిమాండ్ చేసినట్లు నిర్ధారించే స్పష్టమైన ఆధారాలు లేవని సుప్రీంకోర్టు పేర్కొంది. ఫిర్యాదుదారు వాంగ్మూలంలోనూ భిన్నతలు ఉన్నాయని ధర్మాసనం గుర్తించింది.

## బాంబే హైకోర్టు తీర్పుపై సుప్రీంలో తేజ్‌పాల్ సవాల్

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** లైంగిక దాడి కేసులో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పుపై జర్నలిస్టు తరుణ్ తేజ్‌పాల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో తరుణ్ తేజ్‌పాల్‌కు పదేళ్ల జైలుశిక్ష విధించగా, ఆ తీర్పును సవాల్ చేస్తూ తరుణ్ తరుఫున అడ్వకేట్ ఆదిత్య సమద్దర్ పిటిషన్ దాఖలు చేశారు. తెహల్కా మాజీ ఎడిటర్‌కు శిక్ష విధించాలని గోవా ప్రభుత్వం అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం తెలిసిందే. తీవ్రమైన నేరానికి చాలా తక్కువశిక్ష విధించినట్లు గోవా సర్కారు అభిప్రాయపడింది.

## రెండుట్రక్కులు ఢీ...నలుగురు మృతి



**సిమ్లా, ఆగస్టు 20:** హిమాచల్ ప్రదేశ్‌లో రెండు ట్రక్కులు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో నలుగురు మరణించారు. మరో ఏడుగురు గాయపడ్డారు. ఈ ఘటన హిమాచల్ ప్రదేశ్, మండి జిల్లా, చండీగఢ్‌మనాలి నేషనల్ హైవేపై, హనోగి టన్నెల్ లోపల గురువారం ఉదయం జరిగింది. టన్నెల్ లోపల ఉదయం 7.45 గంటలకు రెండు ట్రక్కులు వేగంగా వెళ్తూ, ఎదురెదురుగా ఢీకొన్నాయి. వేగంగా ఢీకొనడంతో వాహనాల ముందుభాగం నుజ్జునుజ్జయింది. ఈ ఘటనలో ట్రక్కుల్లోని ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. మరొకరు ఆస్పత్రిలో మరణించారు.

# కృష్ణా జలాలతో సస్యశ్యామలం చేస్తా: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

### నియోజకవర్గంలో మంత్రి సుడిగాలి పర్యటన

### అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు




**హుజూర్‌నగర్(గరిడేపల్లి), ఆగస్టు 20:** హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు రాష్ట్ర పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన నియోజక వర్గంలో సుడిగాలి పర్యటన చేశారు. ఒకే రోజు పలు మండలాల్లో విస్తృతంగా పర్యటించిన మంత్రి భారీ సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించడంతో పాటు, కోట్లాది రూపాయల విలువైన రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, పలు ప్రభుత్వ భవనాల ప్రారంభోత్స వాలు నిర్వహించారు. నియోజకవర్గంలోని చింతలపాలెం మండలం పాత వెల్లటూరులో రూ.1,600 కోట్ల అంచనా వ్యయంతో 54 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్న మహాత్మా గాంధీ ఎత్తిపోతల పథకం పనులను మంత్రి పరిశీలిం చారు. అనంతరం అడ్లూరు గ్రామంలో రూ.23 కోట్లతో మేళ్లచెరువు నుంచి చింతిర్యాల వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రేబల్లెలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనం, రూ.10 లక్షలతో నిర్మించిన మహిళా శక్తి భవనాలను ప్రారంభించారు. కొత్తగూడెం, గాంధీనగర్ తండాల్లో రూ.20 లక్షల చొప్పున నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ప్రారంభించారు. దీంతోపాటు రూ.394 కోట్లతో 14,100 ఎకరాలకు సాగునీరు అందించనున్న దొండపాడు రాజీవ్‌గాంధీ ఎత్తిపోతల పథకం పనుల పురోగతిని కూడా మంత్రి పరిశీలించారు.

**రహదారుల అభివృద్ధికి భారీగా నిధులు**

మఠంపల్లి మండలం అల్లీపురంలో రూ.12 కోట్లతో అమరవరం నుంచి కొత్తతండా వరకు డబుల్ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. పాలకవీడులో రూ.1.43 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవనాన్ని ప్రారంభించారు. ఎల్లాపురంలో రూ.18 కోట్లతో గుడుగుంట్లపాలెం నుంచి ఎల్లాపురం వరకు డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గడ్డిపల్లిలో రూ.7.10 కోట్లతో గడ్డిపల్లి నుంచి కోనాయిగూడెం మీదుగా బొలిశెట్టివారి గూడెం వరకు నిర్మాణానికి శంకుస్థాపన చేయాల్సి ఉండగా చివరి క్షణంలో కార్యక్రమం రద్దయింది. దీంతోపాటు సమయం లేకపోవడంతో కొన్ని కార్యక్రమాలను అధికార యంత్రాంగం రద్దు చేసింది.

## తులసీదాస్ రచనలు తరతరాలకు స్ఫూర్తిదాయకం: గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు20:** గోస్వామి తులసీదాస్ 529వ జయంతి సందర్భంగా గవర్నర్ శివప్రతాప్ శుక్లా ఆయనకు ఘన నివాళులర్పించారు. శ్రీరామచరితమానస్ వంటి మహోన్నత రచన ద్వారా భక్తి భావనకు, భారతీయ సంస్కృతి గొప్పదనాన్ని తెలిపిన గొప్ప కవి గోస్వామి తులసీదాస్ అని గవర్నర్ పేర్కొన్నారు. తులసీదాస్ రచనలు కాలాతీ తమై నవని, తరతరాలుగా ప్రజల ఆధ్యాత్మిక, సాంస్కృతిక చైతన్యం పై అవి చెరగని ప్రభావాన్ని చూపుతున్నాయని తెలిపారు. ఆయన సాహిత్యం భక్తి, ధర్మం, భారతీయ సంస్కృతిపై ప్రజల్లో అవగాహనను మరింతగా పెంపొందించిందన్నారు. గోస్వామి తులసీదాస్ బోధనలు, రచనలు భవిష్యత్ తరాలకు సైతం స్ఫూర్తినిస్తూ, ప్రజలను శ్రీరాముని ఆదర్శాలు, ధర్మమార్గంవైపు నడిపించాలని గవర్నర్ ఆకాంక్షించారు.




ఇద్దరు ఆదివాసీ యువకులను ఎర్రవల్లిలో సన్మానించిన కెసిఆర్

## కెసిఆర్ మళ్లీ సిఎం కావాలంటూ ఆదివాసీ యువకుల పాదయాత్ర

### 300 కిలోమీటర్ల పాదయాత్ర చేసి ఎర్రవెల్లికి చేరిక, కెసిఆర్ సన్మానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు20:** బీఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కేసీఆర్ మరోసారి సీఎం కావాలని కోరుకుంటూ ఆసిఫాబాద్ జిల్లా నుంచి బయలు దేరిన ఇద్దరు అభిమానులు పాదయాత్రగా గురువారం ఎర్రవెల్లికి చేరుకున్నారు. నమ్మి మోసపోయి కాంగ్రెస్ ముసుగులో నాశనగాలాన్ని కొని తెచ్చుకున్న పాపానికి విముక్తి కలగాలంటే కేసీఆర్ పాలన కావాలే.. కేసీఆర్ మళ్లా ముఖ్యమంత్రిగా రావాలే అని నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఆకాంక్షి స్తున్నారని చెప్పడానికి ఇద్దరు ఆదివాసి యువకులే ఆదర్శం అని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆసిఫాబాద్ నియోజకవర్గం వాంకిడి నుంచి దాదాపు 300 కిలోమీటర్ల పాదయాత్ర చేసిన జాడే తిరుపతి (ఆటో డ్రైవర్) దుర్గం శంకర్ (హోటల్ కార్మికుడు) అనే ఇద్దరు గిరిజన ఆదివాసీ బిడ్డలు 11 రోజులుగా రోజుకు సగటున 25 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి సహకారంతో కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా పార్టీ అధినేత కేసీఆర్ వారిని సాదరంగా ఆహ్వానించి యోగ క్షేమాలు తెలుసుకుని, వారి నిస్వార్థ సంకల్పానికి భుజం తట్టి అభినందించారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలనే అంకితభావంతోనే సుదీర్ఘ ప్రయాణం చేసినట్లు వారు వెల్లడించారు. మళ్లా మన ప్రభుత్వం వస్తున్నది. అప్పుడు తప్పకుండా నన్ను వచ్చి కలవండి అంటూ వారి భుజం తట్టారు. అనంతరం వారికి వీడ్కోలు పలికిన కేసీఆర్ వారి కోసం ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేయడంతో సొంత ఊరికి బయలుదేరారు.

## అసెంబ్లీ సమావేశంలో తేల్చుకొందాం.. మీరు ఏమిటో, మేం ఏమిటో ?

### బిజెపి, బిఆర్ఎస్ నేతలకు ప్రభుత్వ విప్ విజయరమణరావు సవాల్

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** మహేశ్వర్ రెడ్డి నీది బ్లాక్‌మెయిల్ బతుకు రెండు వారాల్లో అసెంబ్లీ సమావేశాలు ఉంటాయి అప్పుడు తేల్చుకుందాం.. మీరు ఏమిటో, మేం ఏమిటో అని ప్రభుత్వ విప్ విజయ రమణరావు ఆరోపించారు. గురువారం సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ మా ముఖ్యమంత్రి పైన తప్పుడు ప్రచారం చేసి మీరు సాధించేది ఏమీ లేదనీ,తెలంగాణ ప్రజలకు అన్ని విషయాలు తెలుసు అని ధీమా వ్యక్తంచేశారు.మూలకు పడుకునే బిజెపి ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి ఇప్పుడు తెగ హడావుడి చేస్తున్నాడనీ విమర్శించారు. రాష్ట్రంలో ఆందోళనలు రెచ్చగొట్టి అశాంతి క్రియేట్ చేయడమే ప్రతిపక్షాల పనిగా మారిందనీ ఆవేదన చెందారు.ప్రజలను గందరగోళపరిచి రాజకీయ లబ్ధి పొందాలని బిఆర్ఎస్, బిజెపి ఆరాటపడుతున్నాయనీ తెలిపారు. అధికారం కోసం అడ్డదారులు తొక్కడానికైనా సిద్ధమవుతున్నారనీ అన్నారు.తెలంగాణ భవన్ జనతా గ్యారేజ్ అయిందని బిఆర్ఎస్ నాయకులు గొప్పలు పోతున్నారనీ,అధికారం పోయాక జనతా గ్యారేజ్ అయిందా..?జనతా గ్యారేజ్ కాదు అదీ, 'పొలిటికల్ గార్బేజ్'గా మారిందనీ విమర్శించారు.. పదేళ్లపాటు అధికారంలో ఉన్నప్పుడు తెలంగాణభవన్ గేట్లు ఎందుకు మూతపడ్డాయి? అని నిలదీశారు. ప్రగతి భవన్ చుట్టూ ఇనుప కంచెలు, ఉక్కు గేట్లు ఎందుకు వచ్చాయి? అని అడిగారు. తెలంగాణభవన్ నిత్యం విషం చిమ్మడానికి వేదికగా మారిందనీ ఆవేదన చెందారు. నీచం వెదజల్లడానికి నిలయంగా తయారైందనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈర్ష్య, ద్వేషం, అక్కసు కక్కడానికి కేంద్రంగా మారిందనీ అన్నారు. బిఆర్ఎస్ నాయకులు ఉచ్చనీచాలు మరిచిపోయారనీ, 22ఎ పైన ప్రభుత్వం చాలా స్పష్టమైన సమాచారం ఇచ్చిందనీ చెప్పారు.తప్పులు ఉంటే సరిదిద్ది రిజిస్ట్రేషన్లు కూడా జరుగుతున్నాయనీ.అయినా కూడా బిఆర్ఎస్ నీచ రాజకీయాన్ని మానలేదని ఆగ్రహం చెందారు. ప్రజలను రెచ్చగొట్టి వాళ్ల కన్నీళ్లపై రాజకీయ దాహం తీర్చుకుంటున్నారనీ అన్నారు. మీ లేఖల వెనుక ఉన్న ఫేక్ బతుకులు అందరికీ తెలుసని అన్నారు.

## సద్భావనా దినోత్సవం ప్రజలందరికీ గొప్పస్ఫూర్తి

### రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి నివాళులు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు20:** మాజీ ప్రధానమంత్రి, భారతరత్న, ఆధునిక భారత నిర్మాత స్వర్గీయ రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆ మహానేతకు ఘన నివాళులర్పించారు. దేశంలో శాంతి, సౌభ్రాతృత్వం, మత సామరస్యం, ఐక్యతను పెంపొందించాలనే సందేశంతో జరుపుకునే సద్భావనా దినోత్సవం ప్రజలందరికీ ఒక గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుంది. సమైక్యతే మన శక్తి - సద్భావనే మన ప్రగతి అనే స్ఫూర్తితో రాజీవ్ గాంధీఆశయాలను ఆదర్శంగా తీసుకొని, శాంతి, సౌభ్రాతృత్వం, సమానత్వంతో కూడిన బలమైన భారతదేశ నిర్మాణానికి మన వంతు కృషి చేద్దాం అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

## రూ.10 కోట్ల ధాన్యం నిల్వలేని సాయి రైస్ యజమానిపై ఎఫ్ఐఆర్ నమోదు

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** ప్రభుత్వం కస్టమ్ మిల్లింగ్ కోసం అందించిన ధాన్యం స్టాకు సుమారు 2369.12 మెట్రిక్ టన్నుల ధాన్యం లోకేశ్వరం మండలం సాథ్‌గాంలోని శ్రీ సాయి రైస్ మిల్‌లో లేకపోవడతో సదరు యజమానిపై కేసు నమోదుచేశారు. సివిల్ సప్లయ్ ఎన్‌ఫోర్సుమెంట్ తనిఖీ బృందాలు గురువారం తనిచేయగా రూ.10,61,73,616 విలువ కలిగిన ధాన్యం గిడ్డంగుల్లో లేదని గుర్తించారు. యజమానులు వాలేగాం సరస్వతీబాయి,దొడ్ల సాయికుమార్, ముచ్చిండ్ల సంతోష్‌లను అరెస్టు చేసి ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

## సచివాలయాన్ని సందర్శించిన రిటైర్డ్ ఐఎఎస్ అధికారుల బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు20:**రిటైర్డ్ ఐఎఎస్ అధికారులు నేడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయాన్ని సందర్శించారు. గురువారం దాదాపు 50 మంది రిటైర్డ్ అధికారులు తమ కుటుంబాలతో సహా సచివాలయాన్ని సందర్శించారు. తెలంగాణ తల్లి విగ్రహం ముందు అందరూ గ్రూప్ ఫొటో దిగారు.



సమావేశంలో మాట్లాడుతున్న పి.విల్సన్. చిత్రంలో చిరంజీవులు, పూర్ణచంద్రరావు, శ్రీనివాస్‌గౌడ్, కిరణ్‌కుమార్‌గౌడ్

## కేంద్రం జనగణనలో ఒబిసి కులగణన చేపట్టాలి: విల్సన్ డిమాండ్

**హైదరాబాద్ (సైఫాబాద్), ఆగస్టు 20, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చేపడుతున్న జనగణనలో ఓబిసిలకు ప్రత్యేకంగా కాలమ్ లేకపోవడం బిసిలను మరోకసారి మోసం చేయడమేనని డిఎంకె రాజ్యసభ సభ్యుడు పి.విల్సన్ విమర్శించారు. జనగణనలో ఓబిసిల పేర్లు నమోదు చేస్తే కేంద్ర ప్రభుత్వం ఏలాంటి నష్టం లేదని, ఓబిసిల లెక్కలు తెలితేనే వారికి రిజర్వేషన్‌లు పెంపు, ఆర్థిక తదితర కార్యక్రమాల్లో అభివృద్ధి చేయడానికి మార్గం ఏర్పడుతుందన్నారు. ఆలిండియా ఓబిసి స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి.కిరణ్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో విల్సన్ మాట్లాడుతూ ఓబిసి కులగణన ప్రతి కులానికి ప్రత్యేకమైన యూనిక్ కోడ్ కేటాయించాలని, యూనిక్ కాస్ట్‌కోడ్ లేకుండా కులగణన చేపట్టరాదని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఐఎస్ అధికారి టి.చిరంజీవులు మాట్లాడుతూ కులగణన విషయంలో గతంలో కా ంగ్రెస్ పార్టీ మోసం చేస్తే, ప్రస్తుతం బిజెపి నమ్మించి మోసం చేస్తున్నదని ఆరోపించారు. రిటైర్డ్ డిజిపి పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల కులాల పేరు ్లను భర్తీ చేస్తున్నప్పుడు బిసిల కులాలను ఎందుకు లెక్కించరని ప్రశ్నించారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ దేశాన్ని ఆరు దశాబ్దాలపాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ, 12 ఏళ్ళుగా దేశాన్ని పాలిస్తున్న బిజెపి బిసిలను మోసం చేస్తున్నాయని ఆరోపించారు.

# నేటి నుంచి జిల్లాల వారీగా రెవెన్యూ సమీక్షలు

### క్షేత్రస్థాయిలోనే సమస్యలకు పరిష్కారం చూపే దిశగా అడుగులు

### షెడ్యూల్ ఖరారు చేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు20:** ప్రజలకు రెవెన్యూ సేవలను మరింత చేరువ చేయడం, భూ సంబంధిత సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కారం చూపడమే లక్ష్యంగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి జిల్లాల వారీగా సమీక్షలకు శ్రీకారం చుడుతున్నారు. శుక్రవారం నుంచి ప్రారంభమయ్యే ఈ సమీక్షలు కేవలం అధికారిక సమావేశాలకే పరిమితం కాకుండా.. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటికి పరిష్కార మార్గాలను నిర్దేశించే విధంగా కొనసాగనున్నాయి. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల సమీక్షలను హైదరాబాద్ కేంద్రంగా నిర్వహించడంతో పాటు, దూర ప్రాంత జిల్లాలకు మంత్రి స్వయంగా వెళ్లి అక్కడే సమీక్షలు నిర్వహించనున్నారు. కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు, సబ్ రిజిస్ట్రార్లతో సహా సంబంధిత శాఖల అధికారులందరూ ఈ సమీక్షల్లో పాల్గొంటారు. ఆయా ప్రాంతాలకు సంబంధించిన ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలను కూడా సమీక్షల్లో భాగస్వాములను చేసి.. ప్రజల నుంచి వస్తున్న సమస్యలు, స్థానిక అవసరాలు, పరిష్కరించాల్సిన అంశాలను నేరుగా తెలుసుకునే విధంగా మంత్రి ఈ సమీక్షలను నిర్వహించనున్నారు. రెవెన్యూ అంశాలతోపాటు ఇందిరమ్మ ఇళ్లు, హౌసింగ్ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక, ఇళ్ల నిర్మాణ పురోగతి, స్థలాల సమస్యలు తదితర అంశాలను కూడా జిల్లా సమీక్షల్లో మంత్రి పరిశీలించనున్నారు. జిల్లాల వారీగా చేపట్టనున్న సమీక్షల్లో భాగంగా శుక్రవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా సమీక్షను జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. శనివారం ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సమీక్ష జిల్లాకేంద్రంలో నిర్వహించనున్నారు.

# రైల్వే అభివృద్ధిలో మరింత వేగం

### రైల్ నిలయంలో ఎంపిలతో దక్షిణ మధ్య రైల్వే ఉన్నతస్థాయి సమావేశం

### రూ.24,210 కోట్లతో 1,481 కి.మీ. ప్రాజెక్టులు.. తెలంగాణలో 40 స్టేషన్లకు పునరాభివృద్ధి

**హైదరాబాద్ (తార్నాక), ఆగస్టు 20, ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రైల్వే మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రయాణికుల సౌకర్యాల విస్తరణకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని పార్లమెంట్ సభ్యులు సూచించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన ఎంపీలతో దక్షిణ మధ్య రైల్వే గురువారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహించింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డితో పాటు 15 మంది పార్లమెంట్ సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ, అదనపు జనరల్ మేనేజర్ సత్యప్రకాశ్, వివిధ శాఖల ప్రధానాధిపతులు, డివిజనల్ రైల్వే మేనేజర్లు, ఇతర ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు. రైల్వేలో జరుగుతున్న అభివృద్ధి పనులు, కొత్త ప్రాజెక్టులు, ప్రయాణికుల సౌకర్యాల కల్పన, స్టేషన్ల పునరాభివృద్ధి తదితర అంశాలపై ఎంపీలకు అధికారులు వివరించారు.రూ.24,210 కోట్లతో అభివృద్ధి పనులు తెలంగాణలోని 40 రైల్వే స్టేషన్లను రూ.2,000 కోట్లకు పైగా వ్యయంతో పునరాభివృద్ధి చేస్తున్నట్లు జనరల్ మేనేజర్ తెలిపారు. హైటెక్ సిటీ, బేగంపేట, కరీంనగర్, వరంగల్ స్టేషన్లతో పాటు పలు స్టేషన్లలో అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ఇప్పటికే నాలుగు అమృత్ స్టేషన్లను ప్రారంభించగా, మిగిలిన స్టేషన్లలో పనులను వేగవంతం చేసినట్లు పేర్కొన్నారు.దక్షిణ మధ్య రైల్వే పరిధిలో రూ.24,210.179 కోట్ల అంచనా వ్యయంతో 1,481 కిలోమీటర్ల మేర కొత్త రైల్వే లైన్లు, డబ్లింగ్, ట్రిప్లింగ్ పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. జూన్ 2026 నుంచి సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్లు మాత్రమే దక్షిణ మధ్య రైల్వే పరిధిలో కొనసాగుతున్నప్పటికీ, పనుల వేగంలో ఎలాంటి తగ్గుదల లేకుండా నిర్దేశిత లక్ష్యాలను సాధిస్తున్నామని వివరించారు.కొత్త రైళ్లు.. అదనపు స్టాపేజీలు 2025 ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు నాలుగు జతల కొత్త రైళ్లు, ఐదు జతల అమృత్ భారత్ రైళ్లను ప్రవేశపెట్టినట్లు సమావేశంలో వెల్లడించారు. 14 రైళ్లను వివిధ టెర్మినళ్ల వరకు పొడిగించడంతో పాటు 56 రైళ్లకు అదనపు స్టాపేజీలు కల్పించినట్లు తెలిపారు. 2026లో 30 జతల రైళ్లను రెగ్యులర్ సర్వీసులుగా క్రమ బద్ధీకరించినట్లు జనరల్ మేనేజర్ వివరించారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, మండాడి అనిల్‌కుమార్ యాదవ్, వేం నరేందర్‌రెడ్డి, లోక్‌సభ సభ్యులు ఈటల రాజేందర్, రఘునందన్‌రావు మాధవనేని, డా. కడియం కావ్య, వంశీకృష్ణ గడ్డం, కుందూరు రఘువీర్, ఆర్.రఘురామ్‌రెడ్డి, సురేష్‌కుమార్ షెట్కర్, పోరిక బలరాంనాయక్, జి.నగేష్, డి.కె.అరుణ, బస్తిపాటి నాగ రాజు, కేశినేని శివనాథ్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో ఎంపిలతో సమస్యలను తెలుసుకుంటున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, చిత్రంలో ఎంపిలు, రాజ్యసభ సభ్యులు, అధికారులు

# పాలిటెక్నిక్‌ల బలోపేతానికే పునర్వ్యవస్థీకరణ

### విద్యార్థులు, ఉద్యోగుల ప్రయోజనాలకు పూర్తి రక్షణ

### మూడేళ్ల డిప్లొమాలో మార్పులేదు

### పాలిటెక్నిక్ విద్యను శక్తి పరిధిలోకి తీసుకురావడంపై జెఎసితో చర్చ: మంత్రి వివేక్ వెంకటస్వామి





**హైదరాబాద్,ఆగస్టు20,ప్రభాతవార్త:** పాలిటెక్నిక్ విద్యను మరింత బలోపేతం చేయడం, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులకు నైపుణ్య శిక్షణ అందించడం, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పరిపాలనా పునర్వ్యవస్థీకరణ చేపట్టిందని శక్తి కార్మిక, ఉపాధి, శిక్షణ ఫ్యాక్టరీస్ గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. బిఆర్ అంబెద్కర్ సచివాలయంలో గురువారం వివేక్ వెంకటస్వామి మీడియాతో మాటాడుతూ పాలిటెక్నిక్‌లను కమిషనరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ పరిధి నుంచి కమిషనరేట్ ఆఫ్ ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రైనింగ్ పరిధిలోకి తీసుకువస్తూ ప్రభుత్వం జూన్ 16, 2026న జివో 97 జారీ చేసిందని మంత్రి తెలిపారు. ఈ నిర్ణయం పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేయడానికి, దాని గుర్తింపును మార్చడానికి కాదని.. కేవలం పరిపాలనా పునర్వ్యవస్థీకరణ మాత్రమేనని స్పష్టం చేశారు.ఎ ాలిటెక్నిక్‌లు, ఐటిఐలు/అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ లను పరిధిలోకి తీసుకురావడం ద్వారా సాంకేతిక విద్య, నైపుణ్యాభివృద్ధి, పరిశ్రమల అవసరాలను ఒకే సమగ్ర వ్యవస్థలోకి తీసుకురావడం జరుగుతుందని చెప్పారు. పాలిటెక్నిక్‌ల పునర్వ్యవస్థీకరణకు సంబంధించి జెఎసి ప్రతినిధులతో ప్రభుత్వం చర్చలు జరిపిందని మంత్రి తెలిపారు. జెఎసి ఛైర్మన్ నాగరాజు, కన్వీనర్ సురేశ్ తదితరులతో జరిగిన చర్చల్లో వారి అభిప్రాయాలు, సందేహాలు, ఆందోళనలను ప్రభుత్వం వివరంగా తెలుసుకుందని చెప్పారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు ప్రస్తుతం అమల్లో ఉన్న మూడేళ్ల ఎఐసిటిఇ గుర్తింపు పొందిన డిప్లొమా కోర్సు యథావిధిగా కొనసాగుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఎటిసిల్లో ప్రస్తుతం ఇడబ్ల్యుఎస్ విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న రూ.2,000 స్టైపెండ్‌ను పాలిటెక్నిక్ విద్యార్థులకు కూడా వర్తింపజేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు ఇది అదనపు ప్రయోజనం కల్పిస్తుందని తెలిపారు. అదేవిధంగా సిఐటి పరిధిలో అమలవుతున్న సిఎం ఓవర్సీస్ ఎంప్లాయ్‌మెంట్ స్కీమ్‌కు పాలిటెక్నిక్ విద్యార్థులు కూడా అర్హత పొందనున్నారని చెప్పారు.పాలిటెక్నిక్ ప్రవేశాలు, పరీక్షలు, డిప్లొమా పరీక్షల నిర్వహణ, సంబంధిత విద్యా వ్యవహారాలను ఈ విభాగమే కొనసాగిస్తుందన్నారు. పాలిటెక్నిక్‌లకు సంబంధించిన భూములు, భవనాలు, ఇతర ఆస్తులను వైఐఎస్‌యుకు బదిలీ చేయబోమని మంత్రి స్పష్టం చేశారు. పాలిటెక్నిక్ ఉద్యోగుల సర్వీస్ కండిషన్ల విష యంలో ప్రభుత్వం పూర్తి భరోసా ఇస్తోందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగ హోదా, పే స్కేళ్లు, డీఏ, ఇంక్రిమెంట్లు, సీనియారిటీ, పదోన్నతులు, జిపిఎఫ్, పిఆర్ఎఎన్, గ్రాట్యుటీ తదితర పెన్షన్ ప్రయోజనాలు యథాతథంగా కొనసాగుతాయని చెప్పారు. భవిష్యత్తు నియామకాలు టిజిఎస్‌పి ద్వారానే కొనసాగుతాయని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వమే ఉద్యోగుల యజమానిగా ఉంటుందని స్పష్టం చేశారు. విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని, పాలిటెక్నిక్ ప్లేస్‌మెంట్ సెల్ ఏర్పాటు చేస్తామని హామీఇచ్చారు.

# రూ.1,001 కోట్ల వేలం ధాన్యం రాబట్టాం

### చురుకుగా విజిలెన్స్ బృందాలు.. డిఫాల్టర్ల ఆస్తుల జప్తు, బ్యాంకు ఖాతాలు సీజ్

### పౌర సరఫరాల కమిషనర్ ఎం స్టీఫెన్‌రవీంద్ర

**హైదరాబాద్, ఆగస్టు 20,ప్రభాతవార్త:** విజిలెన్స్ బృందాలు చురుగ్గా క్షేత్రస్థాయి లో తనిఖీలు చేస్తూ, బకాయిలు చెల్లించని వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తూ ఇప్పటివరకు మొత్తం వేలం వేసిన ధాన్యం రూ. 1,000.57 కోట్లు రైసు మిల్లర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సినది రాబట్టు కొన్నామని పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఎం స్టీఫెన్ రవీంద్ర తెలిపారు.సివిల్ సప్లైస్ భవన్‌లో కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర అధ్యక్షతన గురువారం జరిగినసమావేశంలో, అన్ని జిల్లాల్లోని వారపు డెలివరీ రేట్లు, అధికారుల సన్నద్ధతను సమీక్షించారు. ప్రభుత్వ ప్రయోజనాలను కాపాడేందుకు, రెవెన్యూ రికవరీ చట్టాన్ని కఠినంగా అమలు చేస్తున్నారు. దీని ద్వారా డిఫాల్టర్ల ఆస్తులను జప్తు చేయడం, వారి బ్యాంక్ ఖాతాలను సీజ్ చేయడం చేస్తున్నారు. ప్రస్తుత పనులకు ఆటంకం కలగకుండా పాత బకాయిలు రాబట్టడానికి, ప్రభుత్వం జివో9 తీసుకొచ్చిందనీ వివరించారు. దీని ద్వారా రబీ 2022-23లో వేలం వేసిన ధాన్యం బకాయిలను చెల్లించడానికి మిల్లర్లకు చివరి అవకాశం ఇచ్చామని తెలిపారు.. అక్టోబర్ 31, 2026 నాటికి మూడు వాయిదాలలో ఈ బకాయిలు చెల్లించాలనీ, ఈ గడువు దాటితే వారిని "డిఫాల్టర్"గా ప్రకటించి, 25 శాతం జరిమానాతో పాటు 12 శాతం వడ్డీ కూడా వసూలు చేస్తామని పౌర సరఫరాల శాఖ తీవ్రంగా రవీంద్రహెచ్చరించారు. సివిల్ సప్లయి కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర జిల్లాల్లోని వారపు డెలివరీ రేట్లు, అధికారుల సన్నద్ధతను ప్రశంసించారు.




సివిల్‌సప్లయ్ భవన్‌లో సమీక్ష చేస్తున్న కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర

## యూరియా బుకింగ్ యాప్ ఎత్తివేయాలి

### తెలంగాణ రైతు ఐక్య వేదిక డిమాండ్

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన యూరియా బుకింగ్ యాప్ విధానాన్ని వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక డిమాండ్ చేసింది. యూరియా పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన ఎఫ్ఎఫ్ఎస్ యాప్ విధానం రైతులకు తీవ్ర ఇబ్బందులను తెచ్చిపెడుతోం ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సా రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. స్మార్ట్ ఫోన్లు లేనివారు, పట్టాదారు పాస్ పుస్తకాలు రాని, డిజిటల్ పరిజ్ఞానం కాని రైతులు ఈ యాప్ ద్వారా ఎరువులు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సాంకేతిక సమస్యలు, సర్వర్ డౌన్ సమస్యల వల్ల ఎరువులు సకాలంలో అందడం లేదని, వెంటనే యాప్ విధానాన్ని ఎత్తివేయాలని కోరారు. పాత మాన్యువల్ విధానం ద్వారా ఎరువుల దుకాణాల వద్దే నేరుగా పాత పద్ధతిలో యూరియా కాంప్లెక్స్ ఎరు వులు అందజేయాలని తెలిపారు. అలాగే పట్టాదారు పాస్ బుక్ నిబంధనలను సడలింపు చేసి వ్యవసాయ సాగు రైతులందరికీ యూరియా, కాంప్లెక్స్ ఎరువులను అందజేయాలని విజ్ఞప్తి చేశారు.



కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సిఎండి జితేష్‌విపాటిల్, డైరెక్టర్ శివాజీ

## విద్యుత్‌రంగ మార్పులను ప్రజలకు చేర్చేందుకే 'పవర్ ఎగ్జిబిషన్'

### రేపటి నుంచి మూడురోజులపాటు నెక్లెస్‌రోడ్‌లో నిర్వహణ

### టిజిఎస్పీడిసిఎల్ సిఎండి జితేష్ వి.పాటిల్

**హైదరాబాద్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** రాష్ట్ర విద్యుత్ రంగంలో జరుగుతున్న సాంకేతిక, పరిపాలనా మరియు వినియోగదారుల సేవల విప్లవాత్మక మార్పులను ప్రజలకు ప్రత్యక్షంగా పరిచయం చేయడమే పవర్ ఎగ్జిబిషన్ ప్రధాన ఉద్దేశమని టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల తెలిపారు.ఈ నెల 22, 23, 24 తేదీలలో హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో మూడు రోజుల ఈఎగ్జిబిషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈమేరకు గురువారం టిజిఎస్పిడిసిఎల్ ప్రధాన కార్యాలయంలోని సమావేశమందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డైరెక్టర్ శివాజీతో కలిసి సిఎండీ మాట్లాడారు.పవర్ ఎగ్జిబిషన్‌లో తెలంగాణ విద్యుత్ రంగం గత దశాబ్దంలో సాధించిన ప్రగతి, ప్రస్తుతం అమలు చేస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాలు, భవిష్యత్ ప్రణాళికలను ప్రజలకు అందుబాటులో ఉంచనున్నట్లు తెలిపారు. స్మార్ట్ మీటరింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత సేవలు, డిజిటల్ నెట్‌వర్క్ మ్యాపింగ్, వినియోగదారుల సేవల ఆధునీకరణ వంటి అంశాలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించనున్నట్లు వెల్లడించారు. సరఫరాలో ఎక్కడైనా అంతరాయం ఏర్పడితే వెంటనే గుర్తించి స్పందించేందుకు రూపొందించిన ఆధునిక వ్యవస్థలు, పవర్ అంబులెన్స్ సేవలు, ఫాల్ట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, రియల్ టైమ్ మానిటరింగ్ విధానాలు ప్రజలకు ప్రత్యక్షంగా చూపించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన నెట్‌వర్క్ మ్యాపింగ్ కార్యక్రమం ద్వారా ఏ ఫీడర్‌పై ఏ ట్రాన్స్‌ఫార్మర్ ఉందో, ఆ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో ఏయే వినియోగదారులు ఉన్నారో కచ్చితంగా గుర్తించే సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేశామని తెలిపారు.ముఖ్యంగా విద్యార్థులు, యువత విద్యుత్ రంగంలోని సాంకేతిక అంశాలను సులభంగా అర్థం చేసుకునేలా వర్కింగ్ మోడల్స్, ఇంటరాక్టివ్, సైన్స్ ఆధారిత ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ ప్రదర్శనలు భవిష్యత్‌లో విద్యుత్, ఇంధన రంగాలపై ఆసక్తి పెంచేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు.



## జాఫ్నాలో బయటపడిన సామూహిక సమాధి

### 582 అస్థిపంజరాలు వెలుగులోకి

**కొలంబో, ఆగస్టు 20:** శ్రీలంకలోని జాఫ్నాలో సామూహిక సమాధి బయటపడింది. పిల్లలతో సహా 582 అస్థిపంజరాలు వెలుగులోకి వచ్చాయి. స్వతంత్ర తమిళ రాజ్యం కోసం పోరాడిన తమిళ టైగర్స్ అయిన ఎల్టీటీఈ, ప్రభుత్వ దళాల మధ్య జరిగిన భీకర అంతర్యుద్ధం సమయంలో అదృశ్యమైన తమిళ పౌరులకు చెందిన అవశేషాలుగా భావిస్తున్నారు. జాఫ్నా సమీపంలోని చెమ్మని వద్ద జరిగిన తవ్వకాలలో ఇవి బయటపడ్డాయి. పిల్లల బొమ్మలు, పాల సీసాలు, స్కూల్ బ్యాగులు, బూట్లు, గాజుల వంటి వస్తువులు కూడా లభించాయి. ఛాతికి అడ్డంగా రెండు చేతులు కట్టివేసిన స్థితిలో ఉన్న ఒక మానవ అస్థిపంజరం కూడా అక్కడ లభించింది. అంతర్యుద్ధ సమయంలో తమిళ పౌరులను శ్రీలంక సైన్యం కాల్చి చంపి చెమ్మని ప్రాంతంలో సామూహిక ఖననాలు చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. గత ఏడాది ఇదే సామూహిక సమాధి ప్రదేశంలో 240 మానవ అస్థిపంజరాలు బయటపడ్డాయి. నిజానికి 1998 నుంచే చెమ్మని ప్రాంతం ఒక సామూహిక సమాధి ప్రదేశంగా అనుమానించారు. ఒక పాఠశాల విద్యార్థినిపై అత్యాచారం, హత్య కేసులో అప్పట్లో విచారణ ఎదుర్కొన్న ఒక శ్రీలంక సైనికుడు ఈ విషయాన్ని బయటపెట్టాడు. అదుపులో ఉన్న సుమారు 400 మంది తమిళులను సైన్యం చంపి చెమ్మనిలో పాతిపెట్టినట్లు దర్యాప్తు అధికారులకు వెల్లడించాడు.



## మక్తల్ అభివృద్ధికి రూ.178.84 కోట్లు

### మంత్రులు సీతక్క, శ్రీహరి శంకుస్థాపన

### అభివృద్ధి నివేదికతో ప్రజల్లోకి వెళ్లండి : కాంగ్రెస్ శ్రేణులకు మంత్రి సీతక్క పిలుపు

**మక్తల్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** ప్రజా సమస్యల పరిష్కారం, గ్రామాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, మహిళా సంక్షేమం వంటి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని 25 గ్రామాలలో రూ.178 కోట్ల 84 లక్షల నిధులతో చేపట్టనున్న బీటీ రోడ్లు, పలు అభివృద్ధి పనులకు మక్తల్ లోని ఓ ఫంక్షన్ హాల్ లో జిల్లా మంత్రి డా. వాకిటి శ్రీహరి తో కలిసి మంత్రి సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. సరిగ్గా 25 సంవత్సరాల క్రితం అంటే 2001 ఆగస్టు 20న మక్తల్ సర్పంచ్ గా తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన మంత్రి వాకిటి శ్రీహరి 25 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా మంత్రి సీతక్క శ్రీహరి లలిత దంపతులను శాలువాతో ఘనంగా సత్కరించారు.

**శ్రీహరి ప్రస్థానం స్ఫూర్తిదాయకం సీతక్క ప్రశంస**

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మక్తల్ సర్పంచ్ గా మొదలై నేడు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా ఎదిగిన వాకిటి శ్రీహరి 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు. ఇది క్రమశిక్షణ, అంకితభావం, నిరంతర ప్రజాసేవకు నిదర్శనమని కొనియాడారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి రోజే శ్రీహరి తన రాజకీయ జీవితం ప్రారంభించడం యాదృచ్ఛికం కాదని, రాజీవ్‌గాంధీ పంచాయతీలకు అధికార వికేంద్రీకరణ, స్థానిక సంస్థల బలోపేతానికి పాటుపడ్డారని, ఆయన ఆశయాలకు అనుగుణంగానే శ్రీహరి గ్రామస్థాయి నుంచి సేవ మొదలుపెట్టారని అన్నారు.

**అభివృద్ధిపై ప్రగతి నివేదిక ఐక్యంగా పనిచేయాలని పిలుపు**

మక్తల్ నియోజకవర్గంలో రెండున్నరేళ్లలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించేందుకు ప్రత్యేకంగా అభివృద్ధి ప్రగతి నివేదిక రూపొందించాలని సీతక్క సూచించారు. ప్రతి గ్రామంలో చేపట్టిన రోడ్లు, భవనాలు, పాఠశాలలు, అంగన్ వాడీలు, వంతెనల వివరాలను అందులో పొందుపరచాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రూపులు, వర్గాలకు అతీతంగా ఐక్యంగా పనిచేయాలని, మంచి నాయకత్వం అంటే అందరినీ కలుపుకొని పోవడమేనని సూచించారు. ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాలను వాస్తవాలతో తిప్పికొట్టాలని, సోషల్ మీడియా ఆరోపణలకు అదే స్థాయిలో కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు.

# నాన్నతో అమ్మను కలిసి చూసి 35 యేళ్లు

### రాజీవ్ జయంతి సందర్భంగా ఆవేదనను వ్యక్తం చేసిన రాహుల్‌గాంధీ

### అమ్మ ఆత్మకథలో ఎన్నో మరువలేని అంశాలున్నాయి..

### నవంబరులో రిలీజ్ కానున్న సోనియాగాంధీ ఆత్మకథపై రాహుల్ వ్యాఖ్య



**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు, కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ జీవిత ప్రయాణంపై రాబోతున్న ఆత్మకథ బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్‌పై ఆమె కుమారుడు, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉద్వేగంగా స్పందించారు. తన తల్లి జీవితంలో పడన కష్టాలు, జరిగిన విషాదాలు, ధైర్యాన్ని గుర్తు చేసుకుంటూ సోషల్ మీడియాలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. తన తండ్రి, మాజీ ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా రాహుల్ గాంధీ ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. తన తల్లిదండ్రులు సోనియా గాంధీ, రాజీవ్ గాంధీ కలిసి ఉండడాన్ని తాను చివరిసారిగా 35 ఏళ్ల క్రితం చూశానని రాహుల్ గాంధీ గుర్తుచేసుకున్నారు. రాజీవ్ గాంధీ మరణం తర్వాత తన తల్లి ఎదుర్కొన్న పరిస్థితులను తాను, తన సోదరి ప్రియాంక గాంధీ మాత్రమే పూర్తిగా అర్థం చేసుకోగలమని పేర్కొన్నారు. తన తండ్రి చనిపోయిన రోజు నుంచి ఎదురైన ప్రతీ సవాలును సోనియా గాంధీ ఎంతో ధైర్యం, గౌరవంతో ఎదుర్కొన్నారు అని రాహుల్ గాంధీ తన పోస్టులో వ్యక్తం చేశారు. తల్లి జీవిత కథను ప్రపంచంతో పంచుకోవడానికి ఆమె ముందుకు రావడం తనకు ఎంతో గర్వంగా ఉందని తెలిపారు.

సోనియా గాంధీ జీవితకథపై రానున్న పుస్తకంను ప్రస్తావించిన రాహుల్ గాంధీ ఆమె కథను ప్రేమించే కోట్లాది మంది చదవబోతున్నందుకు సంతోషంగా ఉందని చెప్పారు. వ్యక్తిగత జీవితాన్ని బయటికి చెప్పడానికి ఇష్టపడని సోనియా గాంధీ తన కథను ప్రపంచానికి చెప్పేందుకు అంగీకరించడం అంత సులభమైన విషయం కాదని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. తన తండ్రి రాజీవ్ గాంధీ.. ఈ రోజు ఉంటే తన తల్లిని చూసి గర్వపడేవారని రాహుల్ గాంధీ ఎమోషనల్ అయ్యారు.

ఇవాళ ఆయన పుట్టినరోజు అని నాన్న తన అందమైన సోనియాను గర్వంగా చూస్తూ చిరునవ్వుతో ఉన్నట్లు నాకు అనిపిస్తోంది అంటూ రాహుల్ గాంధీ తన ట్వీట్‌ను ముగించారు. ఇక పుస్తక పబ్లిషర్ ఆల్ఫ్రెడ్ ఏ నాఫ్ ప్రకటించిన వివరాల ప్రకారం సోనియా గాంధీ జ్ఞాపకాలకు సంబంధించిన పుస్తకాన్ని నవంబర్ 10వ తేదీన రిలీజ్ చేయనున్నారు. ఈ పుస్తకంలో సోనియాగాంధీ ఇటలీలోని బాల్యం నుంచి భారత్‌కు వచ్చిన ప్రయాణం, రాజీవ్ గాంధీతో పరిచయం, ప్రేమ, వివాహం, భారత రాజకీయ కుటుంబంలోకి అడుగుపెట్టిన తీరు వంటి అంశాలను వివరించనున్నారు. అంతేకాకుండా అత్త ఇందిరా గాంధీ, భర్త రాజీవ్ గాంధీల హత్యలు ఆమె జీవితాన్ని ఎలా మార్చాయి అనే విషయాలను కూడా సోనియాగాంధీ ఈ ఆత్మకథలో ప్రస్తావించినట్లు పబ్లిషర్ వివరించారు.

# కొండా సుస్మిత వ్యాఖ్యలు బాధాకరం

### ఆమె సిఎంపై చేసిన కామెంట్లు అనుచితం: పార్టీ నేతలు

**ఉమ్మడి వరంగల్ బ్యూరో, ఆగస్టు 20, ప్రభాతవార్త:** తెలంగాణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ చేసిన వ్యాఖ్యలు బాధాకరమని టీపీసీసీ మహిళా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డిని ఏకవచనంతో సంబోధించడం కాంగ్రెస్ పార్టీ సంస్కృతి, సంప్రదాయం కాదని పేర్కొన్నారు. గురువారం హన్మకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వారాజు సారయ్య, డీసీసీ అధ్యక్షుడు ఇనగాల వెంకట్రామ్ రెడ్డితో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి స్వర్ణ మాట్లాడుతూ.. పెద్దలను గౌరవించడం, సభ్యతగా మాట్లాడడం సంస్కారం అని స్పష్టం చేశారు.



గతంలో ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే క్షమించి వదిలేశామని గుర్తు చేశారు. ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే క్షమించబోమని కుండ బద్దలుకొట్టారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల త్యాగాలను మరిచి సీఎం రేవంత్‌పై విమర్శలు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. పదవులు ఇచ్చిన వారినే ఆ తర్వాత విమర్శించడం కొందరికి అలవాటుగా మారిందని మండిపడ్డారు. ఇలాంటి రాజకీయాలకు ఇక అడ్డుకట్ట వేయాల్సి ఉందని స్పష్టం చేశారు.

**సుస్మిత వ్యాఖ్యలు ఖండిస్తున్నాం: మాజీ మేయర్**

కొండా సుస్మిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని వరంగల్ మాజీ మేయర్ గుండు సుధారాణి తెలిపారు. అందరి మనోభావాలను దెబ్బతీసేలా ఆమె వ్యాఖ్యలు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్ పార్టీతో బాగుపడిన వారు ఈ విధంగా మాట్లాడటం సరికాదని అన్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్ పార్టీ సంయమనం పాటించిందని చెప్పుకొచ్చారు.

తల్లిదండ్రులు.. తమ పిల్లలకు సభ్యత, సంస్కారం నేర్పాలని స్పష్టం చేశారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు బాధ్యత వహించాల్సి ఉంటుందని మంత్రి కొండా సురేఖ దంపతులకు పరోక్షంగా సూచించారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఈ సందర్భంగా గుండు సుధారాణి గుర్తు చేశారు. సోషల్ మీడియా వ్యూస్ కోసం ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదంటూ కొండా సురేఖ కుమార్తెకు మాజీ మేయర్ హితవు పలికారు.

**అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

కొండా సుస్మిత వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగ రాజు స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని కొండా సుస్మితకు వార్నింగ్ ఇచ్చారు. పార్టీ నాయకుల గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలను ఏమాత్రం సహించబోమని అన్నారు. కాంగ్రెస్‌పై ఆ పార్టీ నాయకులపై బాధ్యతారహిత వ్యాఖ్యలు చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు.

**వారిని పార్టీ భూస్థాపితం చేస్తుంది: ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య**

కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య వెల్లడించారు. అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పించిన పార్టీ.. కాంగ్రెస్ అని గుర్తు చేశారు. క్రమశిక్షణారాహిత్యంగా వ్యవహరించే వారిని పార్టీ భూస్థాపితం చేస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అధిష్ఠానానికి విజ్ఞప్తి చేశారు.

## రైల్వే అభివృద్ధి పనుల వేగం పెంచండి

### కొవిడ్ సమయంలో తొలగించిన రైల్ స్టాప్‌లను పునరుద్ధరించాలి : ఎంపి డికె అరుణ

### ఎంపి విజ్ఞప్తి మేరకు మలక్‌పేట్‌లో హైదరాబాద్ డెక్కన్ రైలు ఆపేందుకు అంగీకారం

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 20, ప్రభాతవార్త :** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రైల్వే అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అధికారులను కోరారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలో తెలంగాణ పార్లమెంట్ సభ్యులతో రైల్వే ఉన్నతాధికారుల సమావేశంలో నిర్వహించారు. సమావేశంలో ఎంపీ డీకే అరుణ మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాలోని రైల్వే అభివృద్ధి పనుల పురోగతి పై ఒక్కొక్కటిగా అడిగి తీసుకున్నారు. గత సమావేశంలో ఇచ్చిన ప్రపోజల్ లలో ఎన్ని మంజూరు అయ్యాయి, మిగిలిన ప్రపోజల్ ఏ స్టేజ్ లో ఉన్నాయని, వాటిని త్వరిత గతిన ముందుకు తీసుకువెళ్లేందుకు అధికారులు వేగవంతం కృషి చేయాలని అన్నారు. ఇప్పటివరకు సెంట్రల్ రైల్వే బోర్డుకు పంపిన ప్రతిపాదనలు ఏ స్టేజ్ లో ఉన్నాయని ఎంపీ డీకే అరుణ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో అమృత భారత్ స్టేషన్ షాద్ నగర్,జడ్చర్ల, మహబూబ్ నగర్,గద్వాల జోగులాంబ స్టేషన్ లలో వందే భారత్ అమృత్ స్టేషన్ పథకంలో భాగంగా అభివృద్ధి పనులు,మౌలిక సదుపాయాల కల్పన పనులు సాగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. జోగులాంబ గద్వాల స్టేషన్ లో పనులు పూర్తయ్యాయని, ప్రారంభానికి సిద్ధంగా ఉందని తెలిపారు. వందే భారత్ అమృత్ స్టేషన్ పథకంలో భాగంగా షాద్ నగర్ జడ్చర్ల స్టేషన్ లు మార్చి 2027, మహబూబ్ నగర్ రైల్వే స్టేషన్ జూన్ 2027 నాటికి,గద్వాల రైల్వే స్టేషన్ ఏప్రిల్ 2027 నాటికి పూర్తి చేస్తామని సమీక్షలో వెల్లడించారు.

## బాచుపల్లి లేఔట్ నివాస ప్లాట్ల ఇ-వేలం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,ఆగస్టు20:** బాచుపల్లి లే ఔట్‌లోని 35 నివాస ప్లాట్ల ఈవేలం నిర్వహణలో భాగంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండిఏ) ఆధ్వర్యంలో బాచుపల్లిలో గురువారం ప్రీబిడ్ సమావేశం నిర్వహించారు. ఆసక్తి గల బిడ్డర్లకు ఈవేలం ప్రక్రియకు సంబంధించిన వివిధ అంశాలపై అధికారులు స్పష్టత ఇచ్చారు. ఈ సమావేశానికి హెచ్ఎండిఏకు చెందిన సీనియర్ అధికారులు సత్యప్రసాద్, వైటి వెంకటేశ్వర్లు, డి. శ్రీకాంత్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సమావేశానికి భారీ సంఖ్యలో బిడ్డర్లు హాజరయ్యారు. ఈ సమావేశంలో భాగంగా హెచ్ఎండిఏకు చెందిన ఇంజనీరింగ్, ప్లానింగ్ ఎస్టేట్స్ విభాగాల అధికారులు ఆసక్తి గల బిడ్డర్లతో నేరుగా మాట్లాడి నివాస ప్లాట్లు, లే ఔట్ వివరాలు, అభివృద్ధి, మౌలిక వసతులు, ఈవేలం నిబంధనలు ఇతర సంబంధిత అంశాలకు సంబంధించి వారు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు.

## కల్తీ మద్యం సేవించి ఏడుగురు మృతి

### 30 మంది ఆసుపత్రికి తరలింపు

**గాంధీనగర్, ఆగస్టు 20:** మిథనాల్ కలిపిన కల్తీ మద్యం తాగి ఏడుగురు వ్యక్తులు మరణించారు. మరో 30 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈక్రమంలోనే 12 మంది కల్తీ మద్యం వ్యాపారులను పోలీసులు అరెస్ట్ చేశారు. 21 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మద్యపాన నిషేధం అమలులో ఉన్న గుజరాత్‌లో ఈ సంఘటన జరిగింది. భావనగర్ జిల్లాలోని ఒక గ్రామంలో మద్యం పార్టీ చేసుకున్న ఐదుగురు స్నేహితులు అస్వస్థతకు గురయ్యారు. పలు గ్రామాల ప్రజలతో పాటు భావ్‌నగర్ నగరంలోని పలు ప్రాంతాల వారు కూడా నకిలీ మద్యం కారణంగా ఆసుపత్రిపాలయ్యారు. మిథనాల్ కలిపిన కల్తీ మద్యం తాగి ఏడుగురు వ్యక్తులు మరణించగా, మరో 30 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు, జిల్లా అధికారులు అలెర్ట్ అయ్యారు. ఇండియన్‌మేడ్ ఫారిన్ లిక్కర్ పేరుతో విక్రయించిన కల్తీ మద్యంపై దర్యాప్తు చేశారు.

# పాలిటెక్నిక్ విద్యార్థుల రాస్తారోకో

### జిఒ నంబర్ 97 రద్దు చేయాలని

### విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారి దిగ్బంధం

### పోలీసుల లాఠీచార్జి.. పలువురు విద్యార్థులకు గాయాలు

### కిలోమీటర్ల మేర ట్రాఫిక్‌జాం

**హైదరాబాద్ (అబ్దుల్లాపూర్ మెట్), ఆగస్టు 20, ప్రభాతవార్త :** పాలిటెక్నికల్ విద్యార్థుల పాలిట శాపంగా మారిన జీవో నెంబరు 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాల నాయకుల ఆధ్వర్యంలో పలు కళాశాలల పాలిటెక్నిక్ విద్యార్థులు, గురువారం అబ్దుల్లాపూర్ మెట్ వద్ద జాతీయ రహదారి పై రాస్తారోకోతో ఆందోళన చేపట్టారు. విద్యార్థులు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ జాతీయ రహదారిని రెండు వైపుల దిగ్భందించారు. దీంతో విజయవాడ హైదరాబాద్ జాతీయ రహదారిపై 2 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. విద్యార్థుల ఆందోళనను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో పోలీసులు విద్యార్థులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటుచేసుకుంది. ఇరువురు తోపులాట చేసుకోవడంతో పరిస్థితి అదుపు తప్పింది. మరోవైపు అత్యవసర సేవలకు తీవ్ర విఘాతం కలగటంతో పోలీసులు లాఠీచార్జి చేసి విద్యార్థులను చదరగొట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులకు గాయాలయ్యాయి. ఆందోళనలో పాల్గొన్న కొంతమంది విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించారు.



ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే జీవో నంబర్ 97ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించకపోతే విద్యార్థుల పక్షాన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలి: సిపిఎం నేతల డిమాండ్

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఆగస్టు 20, ప్రభాతవార్త:** కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగ ఖాళీలు భర్తీ చేయాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యురాలు టి.జ్యోతి డిమాండ్ చేశారు. గురువారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ నాయకులు ఆర్.వెంకటేశ్వర్లు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ శాఖల్లో పది లక్షలకు పైగా ఖాళీగా ఉన్న పోస్టులను తక్షణమే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేంత వరకు నెలకు 5వేల రూపాయలు నిరుద్యోగ భృతి ఇవ్వాలని, వివాదాస్పదమైన జీవోలను తొలగించి, ఉద్యోగనియామకాలు చేపట్టాలని, రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్ హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు.

## విద్యార్థుల భవిష్యత్‌పై సిఎం రేవంత్‌రెడ్డికి శ్రద్ధ లేదు

### బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,ఆగస్టు20:** విద్యార్థుల భవిష్యత్‌ను సిఎం రేవంత్ రెడ్డి పాతాళంలోకి తొక్కారని బిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. విద్యార్థుల భవిష్యత్ పై రేవంత్ కు శ్రద్ధ లేదని, డబ్బు సంపాదించుకోవడంపైనే రేవంత్ శ్రద్ధ అని అన్నారు. గురువారం తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో మాట్లాడారు. సిఎం పాలిటెక్నిక్ చేసి..పాలిటెక్నిక్స్ లోకి వచ్చారని, పాలిటెక్నిక్ విద్యార్థులు ఈసెట్ చేసి ఇంజనీరింగ్ లోకి పోతే తప్పు ఏంటి? అని విద్యార్థులతో రేవంత్ ఒక్క రోజైనా మాట్లాడారా? అని ప్రవీణ్ కుమార్ ప్రశ్నించారు. పాలిటెక్నిక్ విద్యార్థులకు మద్దతు తెలిపిన బిఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తున్నారని మండిపడ్డారు. ఇంజనీర్లను క్రిమినల్ వేస్ట్ అని సిఎం మాట్లాడుతున్నారని, పిల్లలను సిఎం దగ్గరకు తీసుకెళ్లి మాట్లాడించాలని అన్నారు. తరగతి గదుల్లో ఉండాల్సిన బిడ్డలు రోడ్లపై ఉన్నారని, విద్యార్థులు రోడ్లపై సమ్మె చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.

# నిధుల పంపకం, రాష్ట్రాల హక్కులపై ఎలుగెత్తిన దక్షిణాది రాష్ట్రాల నేతలు

### కేంద్ర హోంమంత్రి అమిత్‌షా అధ్యక్షతన మహాబలిపురంలో సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశం

**చెన్నై, ఆగస్టు 20:** దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి మండలి సమావేశం ఈసారి కీలక రాజకీయ, ఆర్థిక అంశాలకు వేదికగా మారింది. డీలిమిటేషన్, కేంద్ర నిధుల పంపకం, రాష్ట్రాల హక్కులు, నదుల అనుసంధానం, అభివృద్ధి, కనెక్టివిటీ వంటి అంశాలపై దక్షిణాది రాష్ట్రాల నేతలు తమ అభిప్రాయాలను బలంగా వినిపించారు. రాష్ట్రాల ప్రత్యేక ప్రయోజనాలతో పాటు కేంద్రం ముందు సమిష్టిగా తమ డిమాండ్లను ఉంచే వేదికగా ఈ సమావేశం కనిపించింది. మొత్తంగా సీట్లు తగ్గొద్దు నిధులు తగ్గొద్దు రాష్ట్రాల హక్కులు క్షీణించవద్దు అన్న



సందేశం బలంగా వినిపించింది. జనాభా నియంత్రణలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ కారణంగా రాజకీయంగా నష్టం జరగకూడదన్న అభిప్రాయం సమావేశంలో ప్రధానంగా వ్యక్తమైంది. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ 1971 జనాభా లెక్కలను ప్రాతిపదికగా కొనసాగించాలని కోరారు. ప్రస్తుత లోక్‌సభలోని 543 స్థానాలను యథాతథంగా కొనసాగిస్తూ, అదే స్థానాల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదించారు. జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన రాష్ట్రాల పార్లమెంటరీ ప్రాతినిధ్యం తగ్గితే అన్యాయం జరుగుతుందని డీకే శివకుమార్ పేర్కొన్నారు. ఆర్థిక ప్రాధాన్యానికి తగ్గట్టుగానే రాజకీయ ప్రాతినిధ్యం ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. తమిళనాడు రాజకీయ నేత విజయ్ కూడా పార్లమెంటులో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గకుండా చట్ట బద్ధమైన హామీ అవసరమని డిమాండ్ చేశారు. ఆర్థిక సంఘం నిధుల పంపకంలో దక్షిణాది రాష్ట్రాలకు న్యాయం చేయాలన్న డిమాండ్ కూడా సమావేశంలో ప్రధానంగా వినిపించింది. 15వ ఆర్థిక సంఘం సమయంలో కర్ణాటక వాటా 4.7 శాతం నుంచి 3.6 శాతానికి తగ్గిందని డీకే శివకుమార్ వెల్లడించారు. దీంతో ఆరేళ్లలో రాష్ట్రానికి సుమారు రూ.65 వేల కోట్ల నష్టం జరిగిందని ఆయన ఆరోపించారు. కర్ణాటకకు సిఫారసు చేసిన రూ.5,495 కోట్ల ప్రత్యేక గ్రాంటు విడుదల కాలేదని, మరో రూ.6 వేల కోట్ల రాష్ట్ర ప్రత్యేక గ్రాంటు కూడా అందలేదని డీకే పేర్కొన్నారు. 16వ ఆర్థిక సంఘంలో కర్ణాటక వాటా 4.131 శాతానికి పెరిగినప్పటికీ, తమ వాటాను తిరిగి 4.7 శాతానికి పెంచాలని రాష్ట్రం కోరుతోంది. నీటి సమస్యలపై దక్షిణాది రాష్ట్రాల మధ్య భిన్న అభిప్రాయాలు కూడా సమావేశంలో స్పష్టమయ్యాయి. నీటి పంపకాల వివాదాల నుంచి నీటి సహకారం వైపు వెళ్లాల్సిన అవసరం ఉందని డీకే శివకుమార్ అన్నారు. సమానత్వం, పారదర్శకత, పరస్పర సహకారంతో నీటి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కావేరి, కృష్ణా, తుంగభద్ర, పెన్నా, పాలార్ వంటి నదులు దక్షిణాది ప్రజల జీవనాడులని పేర్కొన్న ఆయన కృష్ణా, అప్పర్ భద్ర, నదుల అనుసంధానం వంటి అంశాలపై కర్ణాటక తన వైఖరిని స్పష్టం చేస్తుందని తెలిపారు. మరోవైపు కావేరి జలాల విషయంలో సుప్రీంకోర్టు తీర్పులు, సంబంధిత అథారిటీల నిర్ణయాలను అమలు చేయాలని తమిళనాడు సీఎం విజయ్ డిమాండ్ చేశారు. ముల్లైపెరియార్ జలాశయం నీటిమట్టాన్ని 152 అడుగులకు పెంచే విషయంలోనూ కోర్టు తీర్పులకు కట్టుబడి ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం దక్షిణాది అభివృద్ధి, మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, నదుల అనుసంధానంపై ప్రధానంగా దృష్టి పెట్టారు. ఏపీ-కర్ణాటక-తమిళనాడు రాష్ట్రాలను అనుసంధానించే బుల్లెట్ ట్రైన్ ప్రతిపాదనను ఆయన ముందుకు తెచ్చారు. కుప్పం మీదుగా అమరావతి-బెంగళూరు-చెన్నై రవాణా కారిడార్ అభివృద్ధి చేయాలని సూచించారు. దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి లాజిస్టిక్స్ నెట్‌వర్క్, డ్రైపోర్టుల ఏర్పాటు, దక్షిణాది విద్యుత్ గ్రిడ్‌ను జాతీయ గ్రిడ్‌తో అనుసంధానం చేయడం వంటి ప్రతిపాదనలు చేశారు. కేరళ కూడా కేంద్ర నిధుల పంపకం, తీర రక్షణ, ఆఫ్‌షోర్ మైనింగ్ అంశాలను సమావేశంలో ప్రస్తావించింది. ఆయుష్మాన్ భారత్ పథకం కింద రాష్ట్రం భారీగా ఖర్చు చేస్తున్నప్పటికీ కేంద్రం నుంచి తగినంత నిధులు రావడం లేదని కేరళ అసంతృప్తి వ్యక్తం చేసింది. రూ.1,493 కోట్లు ఖర్చు చేస్తే కేంద్రం కేవలం రూ.151 కోట్లు మాత్రమే ఇచ్చిందని ఆ రాష్ట్రం పేర్కొంది. కేరళ తీర ప్రాంతంలో 63 శాతం మేర కోతకు గురవుతోందని ఆందోళన వ్యక్తం చేసింది. తీర రక్షణ కోసం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ నిధులను వినియోగించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరింది. శాస్త్రీయ అధ్యయనాలు, సరైన స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ లేకుండా ఆఫ్‌షోర్ మైనింగ్ బ్లాకుల వేలం నిర్వహించవద్దని డిమాండ్ చేసింది. మైనింగ్ వల్ల తీర ప్రాంత పర్యావరణానికి ముప్పు ఏర్పడే అవకాశం ఉందని హెచ్చరించింది. డీలిమిటేషన్, ఆర్థిక సంఘం నిధులు, నీటి పంపకాలు, రాష్ట్రాల హక్కులు వంటి అంశాల్లో రాష్ట్రాల మధ్య అభిప్రాయ భేదాలు ఉన్నప్పటికీ కేంద్రంతో సంబంధించి తమ ప్రయోజనాల విషయంలో దక్షిణాది రాష్ట్రాలు సమిష్టిగా గళం వినిపించాయి. మరోవైపు డ్రగ్స్, అంతర్రాష్ట్ర నేరాల నియంత్రణకు రియల్‌టైమ్ ఇంటెలిజెన్స్ షేరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలన్న సూచన కూడా వచ్చింది. మొత్తంగా చెన్నైలో జరిగిన దక్షిణ మండలి సమావేశం కేవలం రాష్ట్రాల సమస్యల చర్చకే పరిమితం కాకుండా దక్షిణాది రాజకీయ ప్రాతినిధ్యం, ఆర్థిక హక్కులు, అభివృద్ధి, నీటి వనరులు, కనెక్టివిటీ వంటి అంశాలపై భవిష్యత్‌లో సమిష్టి వ్యూహానికి వేదికగా మారే సంకేతాలను ఇచ్చింది.




# గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు శరవేగంగా శాశ్వత భవన నిర్మాణాలు

- 4500కు పైగా విలేజ్ హెల్త్ క్లినిక్‌ల భవన నిర్మాణాలు
- శాసనసభలో రాష్ట్ర వైద్య,ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

**సచివాలయం,ఆగస్టు 20,ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రాధమిక ఆరోగ్య సేవలను మరింత బలోపేతం చేసేందుకు పిహెచ్‌సీలు,అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు,విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు సొంత భవనాల నిర్మాణాల పనులను ప్రభుత్వం వేగవంతం చేస్తుందని రాష్ట్ర వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.గ్రామీణ ప్రాంతాల్లో ఆరోగ్య సేవలకు తొలి కేంద్రాలుగా ఉన్న విలేజ్ హెల్త్ క్లినిక్స్,ఆయుష్మాన్ ఆరోగ్య మంది రాలను పటిష్టం చేయడంతోపాటు పట్టణ ప్రాంతాల్లో అర్బన్ పిహెచ్‌సిలకు శాశ్వత భవనాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. శాసనసభలో గురు వారం జరిగిన ప్రశ్నోత్తరాల సమ యంలోపలువురు సభ్యుల ప్రశ్నలకు మంత్రి సత్యకుమార్ జవాబిచ్చారు.

**పిహెచ్‌సీల్లో వైద్యుల పోస్టుల ఖాళీలు 57మాత్రమే:** రాష్ట్రంలో పిహెచ్‌సిలకు సంబంధించి భవనాల నిర్మాణం,మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి సారించామని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో మొత్తం 1231పిహెచ్‌సీలు ఉండగా...1143పి హెచ్‌సీలు సొంత భవనాల్లో కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.కొత్తగా మంజూరైన 88పిహెచ్ సీభవనాల్లో 13పూర్తయ్యాయి. శిథిలావస్థకు చేరిన 140పిహెచ్‌సీ భవనాల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి చేపట్టగా.. వాటిలో 118పూర్తయ్యాయి.


అసెంబ్లీలో వివరాలు తెలియజేస్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్

మరో 22నిర్మాణంలో ఉన్నాయి.పిహెచ్‌సి భవనాల బలోపేతానికి చేపట్టిన 948పనులు పూర్తయ్యాయి. 15వ ఆర్థిక సంఘం నిధులతో మరో 100పిహెచ్‌సీ భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టారు.ఆర్ అండ్ బి శాఖ ద్వారా చేపట్టిన 43పనుల్లో 14పూర్తికాగా, 29నిర్మాణంలో ఉన్నాయి, మరో 57భవనాల పనులు టెండర్ దశలో ఉన్నాయి. గత రెండేళ్ళలో పిహెచ్‌సీల్లో 600కి పైగా నియామకాలు చేపట్టాం. మొత్తం 1200పిహెచ్‌సీలు ఉండగా ప్రస్తుతం 57వైద్యుల పోస్టులు మాత్రమే ఖాళీగా ఉన్నాయని, వాటిని కూడా త్వరలో భర్తీ చేస్తాం అని మంత్రి వెల్లడించారు.

**502పట్టణ ఆరోగ్య కేంద్రాలకు సొంత భవనాలు:** పట్టణ ప్రాంతాల్లో 560అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఉండగా 175 ఇప్పటికే ప్రభుత్వ భవనాల్లో కొనసాగుతున్నాయి.కొత్త భవనాల నిర్మాణానికి మరో 385కి అనుమతులు మంజూరయ్యాయి.వీటిలో 327భవనాలు నిర్మించి అప్పగించారు.మరో55 భవనాల నిర్మాణం కొనసాగుతోంది.మూడు భవనాల అంశం కోర్టులో ఉంది.మొత్తంగా 502యూపి హెచ్‌సిలకు సొంత భవనాలు అందుబాటులో ఉన్నాయి.మరో 55కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి అని మంత్రి తెలిపారు.

**విలేజ్ హెల్త్ క్లినిక్స్ భవన నిర్మాణాల్లోనూ పురోగతి:** గ్రామీణ ప్రాంతాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్స్, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలు,హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లపై మంత్రి మాట్లాడుతూ ఇవి జాతీయ ఆరోగ్యమిషన్ పరిధిలో కొనసాగుతు న్నాయని చెప్పారు. గత ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులు అందుబాటులో ఉన్నప్పటికీ 15వ ఆర్థిక సంఘం,ఎన్‌హెచ్‌ఎం,పిఎం అభీమ్ తదితర పథకాల కింద 3105సంఖ్యలోనే సొంత భవనాలు నిర్మించారని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వ సహకా రంతో కేవలం రెండేళ్ళలోనే 4500కు పైగా భవనాల నిర్మాణాలు పురోగతిలోఉన్నాయన్నారు. పంచాయితీరాజ్ శాఖ ఆధ్వర్యంలో ఈ పనులు జరుగుతున్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో ఇవే ప్రజలకు తొలి ఆరోగ్య సేవా కేంద్రాలు కావడంతోవాటిని పటిష్టం చేస్తున్నామని వివరించారు. అవసరమైన చోట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (ఎంఎల్‌హెచ్‌పిలు) నియామకాలు కూడా చేపడుతున్నామనితెలిపారు.

**ఉచితంగా 41రకాల పరీక్షలు:** ముఖ్యమంత్రి దార్శనికత మేరకు వ్యక్తి కేంద్రంగా వైద్యసేవలు అందించేందుకు సంజీవని డిజిటల్ హెల్త్ ఫ్లాట్‌ఫామ్‌ను తీసుకొచ్చామని మంత్రి చెప్పారు. ఇందులో ఇంటివద్దే 41రకాల పరీక్షలు నిర్వహించి ఆరోగ్య ప్రొఫైల్ రూపొందించడ ంతోపాటు అవసరమైన వారికి తదుపరి వైద్యం, అపాయింట్‌మెంట్లు, మందులు, డిజిటల్ హెల్త్ రికార్డు నిర్వహణ వంటి సేవలు అందించేలా వ్యవస్థను రూపొందించినట్లు తెలిపారు.

# కేంద్ర జల కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం

- 2024ను రాష్ట్రంలో అమలుపర్చే తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించిన శాసనసభ....
- తీర్మానాన్ని అసెంబ్లీ ప్రవేశపెట్టిన మంత్రి నాదెండ్ల మనోహార్

**విజయవాడ,ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జల (కాలుష్య నివారణ మరియు నియంత్రణ) సవరణ చట్టం-2024ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలుపర్చే తీర్మానాన్ని రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తరఫున రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టగా, శాసనసభ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2024 ఫిబ్రవరి 15న నోటిఫై చేసిన ఈ సవరణ చట్టం, తొలుత హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలతో పాటు కేంద్ర పాలిత ప్రాంతాలకు వర్తించేలా రూపొందించబడిందన్నారు. అదే విధంగా, ఇతర రాష్ట్రాలు తమ శాసనసభలు, అవసరమైతే శాసన మండళ్లలో తీర్మానం ఆమోదించడం ద్వారా తమ రాష్ట్రాల్లో ఈ చట్టాన్ని అమలు చేయవచ్చన్నారు. ఆయా రాష్ట్రాలు తీర్మానాన్ని ఆమోదించిన తేదీ నుంచి ఆ రాష్ట్రాల్లో ఈ సవరణ చట్టం అమల్లోకి వస్తుంది. ఈ చట్టం ప్రధాన ఉద్దేశ్యం కాలుష్య నియంత్రణ వ్యవస్థను మరింత సమర్థవంతంగా మార్చడం, నిబంధనలను సరళీకరించడం, వ్యాపార నిర్వహణను సులభతరం చేయడం మరియు పర్యావరణ పరిరక్షణకు అవసరమైన నియంత్రణలను కొనసాగిస్తూ, కొన్ని ఉల్లంఘనలకు సంబంధించి జైలు శిక్షలకు బదులుగా ద్రవ్యపరమైన జరిమానాల విధానాన్ని ప్రవేశపెట్టడం ముఖ్యమైన అంశం అన్నారు. అలాగే రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఛైర్మన్ నియామక ప్రక్రియను సరళీకరించడం, చట్టంలోని ఉల్లంఘనలపై విచారణ జరిపి జరిమానాలు విధించేందుకు అడ్జుడికేటింగ్ అధికారిని నియమించడం వంటి కీలక మార్పులు ఈ చట్టం ద్వారా అమల్లోకి వస్తాయన్నారు. ఈ సవరణ చట్టం అమలుతో పర్యావరణ పరిరక్షణకు మరింత ప్రాధాన్యతనిస్తూ, కాలుష్య నియంత్రణ వ్యవస్థలో పారదర్శకత, సమర్థత, బాధ్యతాయుతమైన పరిపాలనను బలోపేతం చేయడంతో పాటు పరిశ్రమలు, వ్యాపార సంస్థలకు అనుకూలమైన సరళమైన విధానాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో జల వనరుల పరిరక్షణ, కాలుష్య నియంత్రణ చర్యలు మరింత సమర్థవంతంగా అమలు చేయడానికి ఈ చట్టం దోహదపడనుందని మంత్రి తెలిపారు. ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తరఫున రాష్ట్ర పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహార్ సభలో ప్రవేశపెట్టిన జల (కాలుష్య నివారణ మరియు నియంత్రణ) సవరణ చట్టం-2024ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలుపర్చే తీర్మానాన్ని రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది.

# వ్యవసాయభూముల నీటితీరువా రద్దుచేయాలి

**గన్నవరం(కృష్ణా), ఆగస్టు 20, ప్రభాతవార్త :** ప్రస్తుత ఎల్‌నినో కారణంగా తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో పంటలు పండించేందుకు సాగునీరులేక ఇబ్బందులు పడుతున్న రైతులను ఆదుకునేందుకురాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయభూముల నీటితీరువాలనురద్దుచేయాలని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసారు. శాసనసభ వర్షాకాల సమావేశాల్లో గురువారం పలు సమస్యలను యార్లగడ్డ అసె ంబ్లీలో ప్రస్తావించారు. గన్నవరం నియోజకవర్గంలోని పోలవరం కాలువ పరివాహక ప్రాంతాల్లోని గ్రామాల్లో చెరువులను పోలవరం నీటితో నింపి ప్రజలు, మూగజీవాలకు తాగునీటి ఇబ్బందులు తొలగించాలని కోరారు. మైనింగ్ అక్రమాలకు పాల్పడిన వారిపై మైనింగ్‌శాఖ ఉమ్మడి కృష్ణా జిల్లావ్యాప్తంగా రూ.87కోట్ల జరిమానాలు విధించిందని, ఇందులో ఒక్క


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంక ట్రావ్

గన ్నవరం నియోజకవర్గంలోనే రూ.52కోట్లు జరిమానా విధించిందని ఈమొత్తాన్ని అక్రమార్కుల నుండి వసూలు చేయాల్సి ఉందని, ఇదే అంశంపై సామాజికకార్యకర్త హైకోర్టులో పిల్‌వేసినట్లు యార్లగడ్డ వివరించారు. గన్నవరం విమానాశ్రయ విస్తరణ కోసం భూములు ఇచ్చిన నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. గన్నవరం నియోజకవర్గం నిడమానూరు గ్రామంలోని శ్రీరాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన 12.42ఎకరాల భూమి గత 20ఎళ్ళుగా ఇతరుల ఆధీనంలో ఉందని, తక్షణమే అన్యాక్రాంతం అయిన భూమిని స్వాధీనం చేసుకోవాలని దేవాదాయశాఖా మంత్రికి యార్లగడ్డ విజ్ఞప్తి చేసారు. పాతపాడులోని చెన్నకేశ్వరస్వామి ఆలయానికి చెందిన భూమిని బైపాస్ రోడ్డునిర్మాణం కోసం సేకరించి పరిహారం రూ. 38.98లక్షలు మంజురు చేయగా, ఆనిధులు జతీయరహదారులసంస్థ, కలెక్టర్ ల్యాండ్ ఎక్విజేషన్‌ఖాతాలో ఉన్నాయని వాటిని దేవాదాయశాఖలోకి మళ్ళించి వీటితో ఆలయ పునర్నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని యార్లగడ్డ శాసనసభలో విజ్ఞప్తి చేసారు.

# రూ.11,285 కోట్లతో 51.56 లక్షల కాపులకు లబ్ధి

**విజయవాడ.ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** కూటమి ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్ల కాలంలో కాపు కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాల ద్వారా రూ.11,285.72 కోట్లతో 51,56,172 లక్షల మందికి లబ్ధి చేకూర్చినట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం శాసనమండలిలో కాపు కార్పొరేషన్ ద్వారా కాపు సామాజిక వర్గీయులకు కూటమి ప్రభుత్వం ఎంతమేర నిధులు కేటాయించారు.. ఎంతమంది లబ్దిదారులకు ప్రయోజనం కల్పించారన్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తుల ప్రశ్నపై మంత్రి పైవిధంగా సమాధానమిచ్చారు. కాపు కార్పొరేషన్ కు ఛైర్మన్ ను నియమించామన్నారు. కాపుల అభివృద్ధికి కాపు



కార్పొరేషన్ కు ఏటా నిధులు కేటాస్తున్నామన్నారు. కాపుల అభివృద్ధికి కాపు కార్పొరేషన్ ద్వారా వెచ్చించిన వివరాలను బడ్జెట్ల వారీగా వివరించారు. 2024-25లో రూ.4,646.99 కోట్లుకేటాయించగా రూ.4.440.25 కోట్లు వెచ్చించి 9,55,144 మంది లబ్దిదారులకు ప్రయోజనం చేకూర్చామన్నారు. 2025- 26లో రూ.4,924.28 కోట్లు కేటాయించగా, రూ.4,360.28 కోట్లతో 20,63,907 మందికి లబ్ధి చేకూర్చామన్నారు. 202627లో రూ.5,012.10 కోట్లుకేటాయించగా, నేటి వరకూ రూ.2,485.19 కోట్లతో 21,37,121 మంది కాపులకు ప్రయోజనం చేకూర్చామని మంత్రి సవిత సవిత తెలిపారు.

# కాంట్రాక్టు ఉద్యోగుల (సవరణ) బిల్లు, ఆమోదించిన శాసన సభ.

- బిల్లును సభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

**విజయవాడ,ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణ (సవరణ) బిల్లు, 2026ను రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టగా, శాసనసభ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ చట్టం-2023 పరిధిలో సెకండరీ హెల్త్ డైరెక్టరేట్‌ను చేర్చేందుకు ఆంధ్రప్రదేశ్ కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ (సవరణ) బిల్లు-2026ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. చట్టపరమైన కాలక్రమ వ్యత్యాసం కారణంగా ఈ డైరెక్టరేట్‌లో పనిచేస్తున్న సుమారు 157 మంది అర్హతగల కాంట్రాక్టు ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణకు అవకాశం లేకుండా పోయింది. ఈ సమస్యను పరిష్కరించేందుకు చట్టం అనుసూచిని సవరించే బిల్లుకు శాసన సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

# పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు ఆమోదం

**విజయవాడ,ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** పంచాయతీ రాజ్ వ్యవస్థలో రెండో వైస్ ప్రెసిడెంట్, వైస్ ఛైర్‌పర్సన్ పదవులను తొలగించేందుకు ప్రతిపాదించబడిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ (రెండో సవరణ) బిల్లు2026 ను రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తరఫున రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్ సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టగా, శాసనసభ సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం, 1994లో చేసిన 2021 నాటి సవరణల ద్వారా మండల ప్రజా పరిషత్‌లలో రెండో వైస్ ప్రెసిడెంట్, జిల్లా ప్రజా పరిషత్‌లలో రెండో వైస్ ఛైర్‌పర్సన్ పదవులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ విధానం వల్ల ఆశించిన పరిపాలనా ప్రయోజనం చేకూరలేదని ప్రభుత్వం సమీక్షలో గుర్తించడం జరిగిందన్నారు.బహుళ నాయకత్వం కారణంగా స్థానిక పరిపాలనలో స్పష్టత తగ్గడంతో పాటు, పరిపాలనా సామర్థ్యాన్ని పెంచడంలో రెండో వైస్ ప్రెసిడెంట్, రెండో వైస్ ఛైర్‌పర్సన్ పదవుల వల్ల అదనంగా ఎటు వంటి ప్రయోజనం ఒనగూరడం లేదనే విషయాన్ని ప్రభుత్వం గుర్తించిదన్నారు. ఈ నేపథ్యంలో ఈ రెండు పదవులను తొలగించి, గతంలో అమలులో ఉన్న విధానాన్ని పునరుద్ధరించాలని నిర్ణయించడం జరిగిందని మంత్రి తెలిపారు. దీని ప్రకారం ప్రతి మండల ప్రజా పరిషత్‌కు ఒక వైస్ ప్రెసిడెంట్, ప్రతి జిల్లా ప్రజా పరిషత్‌కు ఒక వైస్ ఛైర్‌పర్సన్ మాత్రమే ఉండేలా ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టంలో అవసరమైన సవరణలు చేయడానికి ప్రభుత్వ బిల్లును సభలో ప్రమేశపెట్టడం జరిగిందన్నారు. ఈ సవరణ ద్వారా స్థానిక సంస్థల్లో స్పష్టమైన నాయకత్వం, సమర్థవంతమైన పరిపాలన, బాధ్యతల విభజన మరింత మెరుగుపడటంతో పాటు, మండల మరియు జిల్లా ప్రజా పరిషత్‌ల పరిపాలనలో సరళత, సమన్వయం పెంపొందించేందుకు మార్గం సుగమం కానుందని మంత్రి తెలిపారు...ఉప ముఖ్యమంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ తరఫున రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహార్ ఈ ప్రభుత్వ బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టగా, సభ్యులందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు

# పేద విద్యార్థులకు ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్..

## మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి..

**విజయవాడ, ఆగస్టు 20, ప్రభాతవార్తప్రతినిధి:** ఐఐటీ, నీట్ ఎక్సలెన్సీ సెంటర్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు, అత్యాధునిక సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయంలో గుంటూరు జిల్లా తాడికొండలోని ఐఐటి నీట్ ఎక్సలెన్సీ సెంటర్ లో అదనపు భవనాల నిర్మాణం, విద్యార్థులకు సౌకర్యాల కల్పనపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఐటీ, నీట్ క్యాంపస్ నిర్మాణ నమూనాను మంత్రి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ... క్యాంపస్ లో అదనపు భవనాల నిర్మాణం, అంతర్గత రోడ్లతోపాటు వాకింగ్ ట్రాక్,బ్యాడ్మింటన్ కోర్టు, కోకో కోర్టు, మల్టీపర్పస్ కోర్టు ఏర్పాటు చేయాలన్నారు. విద్యార్థులకు ప్రశాంతమైన వాతావరణం ఉండేలా నిర్మాణాలు, ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు. పేద విద్యార్థులు సమాజంలో ఉన్నత స్థాయిలో ఉండాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆకాంక్ష అని మంత్రి తెలిపారు.

# విద్యార్థులకు అసెంబ్లీ సమావేశాలు

## లేని రోజుల్లోనూ సందర్శించే అవకాశం

**విజయవాడ,ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** సమావేశాలు లేని రోజుల్లోనూ విద్యార్థులకు అసెంబ్లీ ప్రాంగణం సందర్శించే అవకాశం కల్పిస్తామని స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తెలిపారు. భావి భారత పౌరులకు చట్టసభల పనితీరు, ప్రజాస్వామ్య వ్యవస్థ విశిష్టతను చేరువ చేసేందుకే "అసెంబ్లీ విజ్ఞాన యాత్ర"కు శ్రీకారం చుట్టామని వెల్లడించారు. అసెంబ్లీ సమావేశాల చివరి రోజు 741 మంది విద్యార్థులు గ్యాలరీ నుంచి అసెంబ్లీ సమావేశాలను ప్రత్యక్షంగా వీక్షించగా, గత నాలుగు రోజుల్లో 23 విద్యాసంస్థలకు చెందిన 2,716 మంది విద్యార్థులు శాసనసభను సందర్శించారు. "స్లేట్ స్కూల్"కు చెందిన 180 మంది విద్యార్థులతో స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఆప్యాయంగా ముచ్చటిస్తూ అసెంబ్లీ వ్యవహారాలు, బిల్లుల రూపకల్పనపై వారి సందేహాలను నివృత్తి చేశారు.

# పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా స్థానిక ఎన్నికల్లో పోటీ

**విజయవాడ,ఆగస్టు 20,ప్రభాతవార్తప్రతినిధి:** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం సిద్ధంగా ఉండాలని జనసేన శ్రేణులకు పార్టీ అధినేత పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. అమరావతిలో పవన్ కల్యాణ్ అధ్యక్షతన జరిగిన శాసనసభాపక్ష సమావేశంలో ఎన్నికల వ్యూహంపై కీలక చర్చ జరిగింది. శాసనసభ ఎన్నికల సమయంలో పొత్తు ధర్మాన్ని పాటిస్తూ.. పార్టీ కోసం నిలబడిన జనసేన కార్యకర్తల ఆత్మగౌరవాన్ని కాపాడే విధంగా స్థానిక ఎన్నికల్లో బరిలోకి దిగాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. కార్యకర్తల అభిప్రాయాలు, మనోభావాలను గౌరవించేలా ఎన్నికలకు సిద్ధం కావాలని నేతలు భావించారు. రాష్ట్రంలోని 21 జనసేన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై పవన్ కల్యాణ్ ఆరా తీశారు. అలాగే ఆయా నియోజకవర్గాలతో పాటు పార్టీకి బలమున్న ఇతర ప్రాంతాలను గుర్తించి స్థానిక ఎన్నికలకు వ్యూహం సిద్ధం చేయాలని నేతలు నిర్ణయించారు. సమావేశం వివరాలను పవన్ కల్యాణ్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలపై లోతుగా చర్చించినట్లు పవన్ తెలిపారు. జన సైనికుల పోరాట స్ఫూర్తిని కొనసాగించేలా ఎన్నికల్లో పోటీ చేస్తామన్నారు. జనసేన పార్టీ ఎన్ని స్థానాల్లో పోటీ చేస్తుందనే అంశంపై చర్చలు జరుగుతున్న తరుణంలో కార్యకర్తల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా ముందుకు వెళ్తామని పవన్



ప్రకటించారు. సాధారణ ఎన్నికల్లో కూటమి విజయం కోసం జనసేన పార్టీ 21 ఎమ్మెల్యే, రెండు ఎంపీ సీట్లతో సరిపెట్టుకుంది. ఇప్పుడు ఎక్కవ సీట్లలో పోటీ చేయాలని పార్టీ శ్రేణులు భావిస్తున్న తరుణంలో పవన్ కల్యాణ్ ప్రకటన వారిలో ఉత్సాహాన్ని నింపింది.మున్సిపాలిటీలు, కార్పొరేషన్లకు ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు నిర్వహించడం మంచిదేనని సమావేశంలో ఎమ్మెల్యేలు అభిప్రాయపడ్డారు. నియోజకవర్గాల్లో పార్టీ బలాబలాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని పవన్ కల్యాణ్ సూచించారు. కొత్త రేషన్ కార్డులు, పెన్షన్లకు సంబంధించి నియోజకవర్గాల్లో ప్రజల నుంచి వస్తున్న విజ్ఞప్తులపై కూడా సమావేశంలో చర్చించారు. కార్యకర్తలు చెబుతున్న సమస్యలను ఎమ్మెల్యేలు స్వయంగా విని.. వాటి పరిష్కారానికి కృషి చేయాలని పవన్ సూచించారు. జనసేన యంత్రాంగం స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిస్తూ.. పొత్తుల అంశాన్ని తాను చూసుకుంటానని స్పష్టం చేశారు. ఎవరూ పార్టీ లైన్ దాటి మాట్లాడవద్దని నేతలకు.. కార్యకర్తలకు పవన్ కల్యాణ్ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. పొత్తు ధర్మాన్ని పాటిస్తూనే కార్యకర్తల మనోభావాలకు ప్రాధాన్యం ఇచ్చేలా స్థానిక ఎన్నికల్లో పార్టీ బలాన్ని చూపించాలని జనసేన భావిస్తోంది.పవన్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి మంత్రులు మనోహార్, దుర్గేశ్‌తో పాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరయ్యారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్ల అమలు చరిత్రాత్మక నిర్ణయం

- బీసీలను దగా చేసింది వైసిపి
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం వెల్లడి

**తిరుపతి హెల్త్, ఆగస్టు 20, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలు చరిత్రాత్మక నిర్ణయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రివర్గం సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలలో 34 శాతం రిజర్వేషన్లు అమలకు నిర్ణయం తీసుకున్న సందర్భంగా తిరుపతి చంద్రశేఖర్ రెడ్డి కాలనీలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ కార్యాలయంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంలో 1986లో అప్పటి ముఖ్యమంత్రి గౌరవ ఎన్టీ రామారావు స్థానిక సంస్థ ఎన్నికల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేయడం జరిగిందని అన్నారు. ఆ తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 34 శాతానికి పెంచారని చెప్పారు. 2020లో స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్లను వైయస్ జగన్మోహన్ రెడ్డి 34 నుంచి 24 శాతానికి తగ్గించారని తెలిపారు. ఇందువల్ల 16,800 మంది బీసీలు స్థానిక సంస్థల ఎన్నికలకు దూరమై తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో తెలుగుదేశం పార్టీ స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చి దానికి కట్టుబడి ఇప్పుడు అమలు చేయడం జరిగిందన్నారు. తాజాగా గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక సంస్థ లలో 34 శాతం పట్టణ ప్రాంతాల్లో 33.3 శాతం రిజర్వేషన్ల అమలు చేయాలని నిర్ణయించడం జరిగిందన్నారు. ఇది ఒక చరిత్రాత్మక నిర్ణయం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో బీసీ సబ్ ప్లాన్ అమలు, కార్పొరేషన్ల వ్యవస్థ తొలిసారిగా అమలు చేయడం జరిగిందని వివరించారు. కూటమి ప్రభుత్వం బీసీల సామాజిక న్యాయానికి, వెనుకబడిన వర్గాల గౌరవం కోసమే టిడిపి పుట్టిందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. వైయస్ జగన్మోహన్ రెడ్డి సుమారు 2730 కోట్లు ఉపాధి హామీ నిధులు విడుదల చేయకుండా అడ్డుకున్నారని ఇందువల్ల నష్టపోయింది బీసీ నేతలేనని చెప్పారు. చివరికి ఆదరణ పథకాన్ని నిర్వీర్యం చేసి బీసీలకు ఉపాధి హామీ అవకాశాలు లేకుండా చేశారన్నారు. స్టడీ సర్కిల్స్, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, విదేశీ విద్యాధరణ, స్కిల్ డెవలప్మెంట్ వంటి పథకాలను రద్దుచేసి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బీసీలను తీవ్రంగా దెబ్బతీశారన్నారు. ఈ కార్యక్రమంలో కె. సుధాకర్, అక్కినపల్లి లక్ష్మయ్య, గాండ్ల జగన్నాథం, ఆముదాల తులసీదాస్, వడ్డెర శ్రీరాములు, దేవల్ల శ్రీనివాసులు, రాఘవులు యాదవ్, టి మోహన్ రమణయ్య, ఎల్లయ్య, అంజి, సిద్దయ్య, వి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# పంటల బీమా విషయంలో రైతులు త్వరపడాలి

- బీమా నమోదుకు ఈ నెలాఖరు వరకే గడువు
- ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ప్రతి రైతు బీమా రక్షణ పొందాలి
- రైతు చెల్లించాల్సిన ప్రీమియం వాటా స్వల్పమే
- ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో రైతులకు అవగాహన కల్పించాలి
- అసెంబ్లీ వేదికగా రైతులకు మంత్రి అచ్చెన్నాయుడు పిలుపు

**విజయవాడ, ఆగస్టు 20 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావం, అనిశ్చిత వర్షపాతం పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల బీమా విషయంలో అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. పంటల బీమా నమోదు చేసుకునేందుకు ఈ నెలాఖరు వరకే గడువు ఉన్నందున రైతులు ఆలస్యం చేయకుండా పథకాన్ని సద్వినియోగం



చేసుకోవాలని శాసనసభ వేదికగా పిలుపునిచ్చారు. వాతావరణ పరిస్థితులు ఎప్పుడు ఎలా మారతాయో అంచనా వేయలేమని, ప్రకృతి వైపరీత్యాలు, వర్షాభావం వంటి పరిస్థితుల్లో రైతుకు ఆర్థిక రక్షణ కల్పించడంలో పంటల బీమా అత్యంత కీలకమని మంత్రి పేర్కొన్నారు. రైతులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా ముందుగానే నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని కోరారు.రైతుపై ప్రీమియం భారం చాలా స్వల్పమే..పంటల బీమా కోసం రైతులు చెల్లించాల్సిన ప్రీమియం వాటా చాలా తక్కువగా ఉంటుందని అచ్చెన్నాయుడు తెలిపారు. ప్రాంతం, పంటను బట్టి రైతు వాటా మారుతుందని, కొన్ని ప్రాంతాల్లో రైతు చెల్లించాల్సిన మొత్తం అత్యంత స్వల్పంగా ఉందన్నారు. మిగిలిన ప్రీమియం భారాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తున్నాయని వివరించారు. స్వల్ప మొత్తాన్ని చెల్లించడం ద్వారా పంట నష్టం సంభవించినప్పుడు బీమా రక్షణ పొందే అవకాశం ఉన్నందున రైతులు దీనిని నిరక్ష ్యం చేయవద్దని సూచించారు. మ్మెల్యేలు ప్రత్యేక చొరవ తీసుకోవాలి..పంటల బీమా నమోదును కేవలం వ్యవసాయ ప్రతి ఎమ్మెల్యే తన నియోజకవర్గంలో రైతులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, పంటల బీమా వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు, రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్హులైన రైతులందరూ బీమా నమోదు చేసుకునేలా ఎమ్మెల్యేలు చొరవ చూపాలని కోరారు. ఎల్‌నినో ప్రభావం ఉన్న నేపథ్యంలో రైతులు పంటల బీమాను తేలికగా తీసుకోవద్దు. ఈ నెలాఖరు వరకే అవకాశం ఉంది. చివరి రోజు వరకు వేచి చూడకుండా ప్రతి రైతు వెంటనే నమోదు చేసుకోవాలి. స్వల్ప ప్రీమియంతో లభించే బీమా రక్షణను ప్రతి రైతు సద్వినియోగం చేసుకోవాలి అని మంత్రి అచ్చెన్నాయుడు పిలుపునిచ్చారు.

# కావలిలో పలు కేసులపై సమీక్ష నిర్వహించిన ఐజి

**కావలి, (నెల్లూరు) ఆగష్టు20ప్రభాతవార్త** :కావలి సబ్ డివిజన్‌లోని పలు కేసులపై స్థానిక కమాండ్ కంట్రోల్ రూమ్ నందు గుంటూరు రేంజ్ ఐజి సర్వే శ్రేష్ట త్రిపాఠి కావలి డివిజన్ పోలీస్ అధికారులతో గురువారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు డివిజన్ పరిధిలోని ముఖ్యమైన కేసుల గురించి సమీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. అందులో భాగంగా కొన్ని పోలీస్ స్టేషన్‌లను కూడా తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటివరకు ఏమేమి కేసులు ఉన్నాయి వాటి గురించి వివరాలు తెలుసుకోవడం జరిగిందన్నారు. ఓవరాల్‌గా లాండ్ ఆర్డర్ పరిస్థితి బాగుందన్నారు. నెల్లూరు జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల పనితీరు బాగుందన్నారు. పబ్లిక్‌కు సహకారం అందించే విధంగా పోలీసుల పనితీరు ఉండాలన్నారు. కావలి డివిజన్ పోలీసుల పనితీరు కూడా బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు జిల్లా ఏఎస్పి సిహెచ్. సౌజన్య, కావలి డిఎస్పి వివి.రమణ కుమార్, కావలి డివిజన్లోని సిఐలు, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆఫీసులో ఐకమత్యం ఉందా !

ఐక మత్యమే మహా బలం.. చిన్నప్పుడు ఈ మాట చాలాసార్లే వినుంటాం కదా! పిల్లలకీ కథలుగానూ చెప్పుంటాం. మరి ఆఫీసులో ఈ సూత్రాన్ని పాటిస్తున్నారా? కొందరి తీరు నచ్చదు. ఇంకొన్ని సార్లన మనం బాధపడుతోంటే చూసి ఆనందించేవారూ కనిపిస్తారు. స్నేహితులున్నా.. కనిపించని పోటీ. నేను మెప్పు పొందాలనే తత్వం.. తరచి చూస్తే పనిచేసే చోట ఎన్నో రకాల మనస్తత్వాల వారు కనిపిస్తారు. ఎలాగున్నా పని ముఖ్యం అనుకుంటేనే విజయం. అందుకు ఎద్దులు, సింహాల కథే రుజువు. నాలుగు ఎద్దులూ కల్గి ఉన్నప్పుడు సింహాన్నే ఎదిరిస్తాయి. వాటి మధ్య పొరపొచ్చాలు వచ్చి వేటికవే అయిపోయినప్పుడు అన్నీ అదే సింహానికి ఆహారవుతాయి. ఆఫీసులోనూ అంతే! కలిసి పనిచేయడం, ఒకరిపై మరొకరికి నమ్మకం తప్పనిసరి. అప్పుడే ఎంతటి కష్టమైన పనైనా సులువుగా పూర్తవుతుంది. పైఎత్తులు వేస్తూ, నేను, నా పని అన్నట్లుగా సాగితే ఆపద వేల తోడుండేవారీ ఉండరు. ఇంట్లో ఒకతాటిపై నడిచేలా చేసేవాళ్లం మనం. పనిచేసే చోటూ అలాగే భావించి చూడండి. సమష్టి విజయాల్లో



# గర్భిణుల వ్యాయామం



స్టూలు మీద పాదాలు నేలకూర్చి రిలాక్స్‌డ్‌గా కూర్చోండి. చిన్న నాపికిన్ లేదా టవల్‌ను అరచేతులకు వత్తిడిలేకుండా పెట్టి చేతు లను గుండెల దగ్గరకు తీసుకు రావాలి. టవల్ అరచేతుల మధ్య ఉంచి మెల్లగా ఐదులెక్కపెడుతూ ఊపిరి బిగబెట్టండి. నెమ్మదిగా శ్వాస వదలండి రిలాక్స వండి. తిరిగి ఎక్స‌ర్‌సైజులు మొదలుపెట్టండి. ఈ విధంగా 10సార్లు రిపీట్ చేయండి. ఇదే పొజిషన్‌లో కూర్చుని అరచేతులను ఎడమవక్షోజం దగ్గరకు తీసుకురండి. ఊపిరి ఐదులెక్కపెట్టేదాక బిగపట్టి మెల్లగా ఊపిరి వదలండి. రిలాక్స వండి. ఇదే విధంగా కుడివైపుకూడా చేయండి. □

# పేదవాడి యాపిల్‌గా..



దోరదోర జామకాయలను చూడగానే చట్టుకున్న కొరుక్కుని తినేయాలనిపిస్తుంది. పచ్చగా, చూడచక్కగా ఉండే వీటిలో పోషకాలూ ఎక్కువే. పేదవాడి యాపిల్‌గా పిలిచే వీటిల్లో ఉండే ఆరోగ్య ప్రయోజనాలెన్నో..

✦ వీటిల్లో విటమిన్–సి ఎక్కువగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచి.. తరచూ అనారోగ్యాల బారినపడకుండా కాపాడుతుంది. అంతేకాదు ఈ విటమిన్ తెల్లరక్తకణాలఉత్పత్తికీ తోడ్పడుతుంది. వీటిల్లోని యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్ బారి నుంచి శరీరాన్ని కాపాడతాయి. క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. వీటిల్లో ఉండే అధిక పొటాషియం గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. గుండెపోటుకు గురికాకుండా సాయపడుతుంది. ఇది రక్తపోటును నియంత్రించడానికీ తోడ్పడుతుంది. జామ కాయల్లో ఉండే పోషకాలు రక్తంలోని చక్కెర స్థాయులను నియంత్రించడానికి సాయపడతాయి. ఎక్కువగా ఉండే పీచు పదార్థం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అంతేకాదు మలబద్ధకాన్నీ పోగొడుతుంది.పీచు ఎక్కువగా ఉండటం వల్ల త్వరగా కడుపు నిండిన భావన కలుగుతుంది. అందువల్ల బరువు తగ్గాలనుకునేవారికి ఇవి సరైన ఎంపికకాగలవు. వీటిల్లో పుష్కలంగా ఉండే యాంటీఆక్సిడెంట్లు వృద్ధాప్య లక్షణాలను ఆలస్యం చేస్తాయి. □

# సకల సౌభాగ్య ప్రదాయిని శ్రీ వరలక్ష్మీ వ్రతం



భారతీయ సనాతన ధర్మంలో పండుగలు, నోములు, వ్రతాలకు ఎంతో విశిష్టమైన స్థానం ఉంది. హిందూ కేలండర్ ప్రకారం ప్రతి నెలా ఎన్నో పండుగలు వచ్చినప్పటికీ, ఆధ్యాత్మిక శోభతో, పవిత్రతతో పరిమళించే మాసం ఏదైనా ఉందంటే అది నిస్సందేహంగా 'శ్రావణ మాసం' అనే చెప్పాలి. శ్రావణ మాసం అనగానే మనకు టక్కున గుర్తుకు వచ్చేవి పవిత్ర నదీస్నానాలు, నోములు, పూజలు మరియు పండుగ వాతావరణం. వర్షాకాలం ఆరంభంలో ప్రకృతి అంతా పచ్చదనంతో కళకళలాడుతూ ఉంటే, మరోవైపు ఇళ్లన్నీ ఆధ్యాత్మిక శోభతో వెలిగిపోతుం టాయి. శివాలయాలు శివనామ స్మరణతో, వైష్ణవాలయాలు లక్ష్మీనారాయణుల పూజలతో పులకించిపోతాయి. ఈ పవిత్ర శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఆ రోజే మహిళలు అత్యంత భక్తిశ్రద్ధలతో, నిష్ఠతో ఆచరించే అద్భుతమైన వ్రతం 'శ్రీ వరలక్ష్మీ వ్రతం' అష్టలక్ష్మలలో కొలువైన వరలక్ష్మీ దేవిని ఈ రోజున ప్రత్యే కంగా పూజిస్తారు. "వర" అనగా భక్తులు కోరిన కోర్కెలను, వరాలను ప్రసా దించే తల్లి అని అర్థం. కేవలం పూజ చేయడం మాత్రమే కాకుండా, ఈ వ్రతాన్ని ఆచరించడం ద్వారా ఇంటా బయటా సిరి సంపదలు వర్ధిల్లుతాయని, సకల అరిష్టాలు తొలగి పోతాయని మహిళల గాఢమైన విశ్వాసం. నిత్య జీవితంలో ఎదురయ్యే ఆర్థిక ఇబ్బంది లను, మనో వేదనలను తొలగించి, కుటుంబానికి రక్షణ కవ చంలా నిలిచే ఈ వరలక్ష్మీ వ్రతం యొక్క సమగ్ర పూజా విధానం, కలశ స్థాపన వంటి పూర్తి విశేషాలు తెలుసుకుందాం. శ్రావణ మాసంలో శుక్రవారం రోజున అష్టలక్ష్మలలో ఒకరైన వరలక్ష్మీ దేవిని పూజిస్తారు. ఆదిలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, గజలక్ష్మి, సంతాన లక్ష్మి, విద్యలక్ష్మి, విజయలక్ష్మి, ధనలక్ష్మి అనే అష్టలక్ష్మల రూపమే శ్రీ వరలక్ష్మి. ఈ వ్రత ప్రాశస్త్యాన్ని గురించి శివుడుపార్వతీ దేవికి వివరించినట్లు పద్మ పురాణంలో చెప్పబడింది. మగధ దేశంలో చారుమతి అనే సద్గుణవతి అయిన ఇల్లాలికి స్వయంగా మహాలక్ష్మి కలలో సాక్షాత్కరించి ఈ వ్రతాన్ని ఆచరించమని చెప్పినట్లు ఐతిహాస్యం. అప్పటి నుండి ఈ వ్రతాన్ని మహిళలు ఎంతో భక్తితో ఆచరిస్తూ వస్తున్నారు. ఈ పవిత్రమైన వ్రతాన్ని ఆచరించడానికి క్రింది పూజా సామాగ్రిని సిద్ధం చేసుకోవాలి. అమ్మవారి ప్రతిమ లేదా రాగి/వెండి చెంబు, పసుపు, కుంకుమ, గంధం. అమ్మవారికి నూతన వస్త్రం (రవికె గుడ్డ), అక్షతలు, పూలు (తామర పువ్వులు, చామంతులు, గులాబీలు), మల్లెపూలు. ఇంకా పసుపు దారాలు (తొమ్మిది ముడులు వేసిన నోము దారాలు), గాజులు, అమ్మ వారికి తలగడ, అద్దం, దువ్వెన, కాటుక మొదలైన సౌభాగ్య ద్రవ్యాలు. నైవేద్యాలు పరమాన్నం, అప్పాలు, పులిహోర, పూర్ణాలు, పాయసం, వడలు, పండ్లు (అరటిపండ్లు మొదలైనవి), తాంబూలం



(ఆకులు, వక్కలు, దక్షిణ).అలాగే అగర వత్తులు, కర్పూరం, ఆవు నెయ్యి, దీపారాధ న కుందులు, వత్తులు, పూజా గంట, హారతి పళ్లెం సిద్ధం చేసుకోవాలి. శుక్రవారం తెల్లవారు జామునే లేచి ఇల్లంతా శుభ్రం చేసి, తలస్నానం ఆచరించి శుభ్రమైన నూతన వస్త్రాలు ధరించాలి.పూజా మందిరంలో లేదా ఇంటికి తూర్పు లేదా ఉత్తర దిశలో పీటను ఏర్పాటు చేసి, దానిపై బియ్యం పోసి దానిపై కలశ స్థాపన చేయాలి. ఆపై రాగి చెంబులో నీరు నింపి, పసుపు, కుంకుమ, గంధం రాసి, మామిడి ఆకులు ఉంచి, దానిపై పసుపు రాసిన కొబ్బరికాయను ఉంచాలి. కలశానికి అష్టదళ పద్మం లేదా లక్ష్మీ దేవి రూపాన్ని అలం కరించాలి. భక్తిశ్రద్ధలతో షోడశోపచార పూజలను నిర్వహించాలి. 'ఓం శ్రీ మహాలక్ష్మ నమః' లేదా అష్టలక్ష్మి నామాలను పఠిస్తూ అమ్మవారికి కుంకుమ పూజ, అక్షతలతో అర్చన చేయాలి. పూజ పూర్త యిన తర్వాత తొమ్మిది ముడులు వేసిన పసుపు దారాన్ని కుడి చేతికి కట్టుకోవాలి (నోము దారం). ముత్తైదువు లకు తాంబూలం, రవికె గుడ్డ, పండ్లు ఇచ్చి వాయనం ఇచ్చుకోవాలి. వరలక్ష్మీ దేవి పూజ చేయడం వల్ల ఇంట నిరంతరం అష్టైశ్వ ర్యాలు వర్ధిల్లుతాయి. ఆర్థిక ఇబ్బందులు తొలగిపోయి లక్ష్మీదేవి నివాసం ఉంటుంది. కుటుంబంలో అందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు చేకూరు తాయి. భర్త దీర్ఘాయుష్షు కోసం, పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం మహిళలు ఈ వ్రతం ఆచరిస్తారు. ముత్తైదువులకు అఖండ సౌభాగ్యం, ధైర్యం, శాంతి లభిస్తాయి. భక్తి భావంతో అమ్మవారిని కొలవడం ద్వారా మనసులో ఉన్న భయాలు తొలగి పోయి సానుకూల శక్తి ప్రసరిస్తుంది. వరలక్ష్మీ వ్రతం కేవలం ఒక పూజ మాత్రమే కాదు ఇది మన సంస్కృతిలో మహిళల గొప్పతనాన్ని, కుటుంబ ఐక్యతను చాటిచెప్పే ఒక సుందరమైన సంప్రదాయం. ఆధ్యాత్మిక భావనతో ప్రతి మహిళ ఎంతో ఉత్సాహంగా జరుపుకునే ఈ పండుగ సమాజం లో శాంతి, ధర్మం, సమృద్ధులను పెంపొంది స్తుంది. శ్రావణ మాసంలో వెల్లివిరిసే ఈ లక్ష్మీ కటాక్షం ప్రతి ఒక్కరి ఇంట్లో సిరిసంపదలను, వెలుగులను నింపాలని ఆశిద్దాం.

-పింగళి భాగ్యలక్ష్మి

# 'రసబలీ' స్వీట్



ఒడియా ప్రసిద్ధ పిండివంటల్లో 'రసబలీ' మిఠాయి ఒకటి. దీన్నెలా చేయాలంటే.. అడుగు భాగం మందంగా ఉన్న పాత్రలో రెండు కప్పుల పాటు పోసి, కాస్త కుంకుమ పువ్వు వేయాలి. సన్న సెగ మీద పాలు సగం అయ్యేవరకూ మరిగించాలి. అందులో అర కప్పు పంచదార వేసి.. అది కరిగాక, పావు చెంచా యాలకుల పొడి వేసి.. కలియ తిప్పి దించేయాలి. మరో పాత్రలో కప్పు పంచదార వేసి.. అది కరిగాక, పావు చెంచా యాలకుల పొడి వేసి.. కలియ తిప్పి దించేయాలి. మరోపాత్రలో కప్పు తురిమిన పనీర్. చెంచా చొప్పున ఉప్మా రవ్వ, గోధుమ పిండి వేసి బాగా కలిపితే.. మెత్తటి పిండిలా తయారవుతుంది. దాన్ని నిమ్మకాయంత భాగాలుగా చేసి, టిక్కీలుగా ఒత్తుకవోఆలి. సైజు, మందం అన్నీ సమానంగా ఉండేట్లు చేసి, కాగుతున్న నూనెలో బంగారు రంగు వచ్చేవరకూ వేయించాలి. వీటిని టిష్యూ పేపర్ మీదికి తీస్తే.. అదనంగా ఉన్న నూనె పీల్చేసుకుంటాయి. ఈ టిక్కీస్‌ను మరిగించిన పాలలో వేయాలి. అరగంట నానితే సరి. తియ్యటి రసబలీ మిఠాయి సిద్ధమైపోతుంది. సులువైన ఈ స్వీటు సూపర్ టేస్టీగా ఉంటుంది. తిని ఆనందించడమే తరువాయి. □

# 'రంభ ఊర్వశి మేనక' ఫుల్‌లెంగ్త్ ఎంటర్‌టైనర్: చంద్ర మోహన్ చింతాడ



**ఈ టైటిల్ వెనుక ఉన్న కథ ఏమిటి?**
సక్సెస్ కోసం ప్రతి ఒక్కరం చాలా ఆత్రుతగా ఉంటాం. దాని కోసం ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటాం. ఏదో ఒక సందర్భంలో దేవతలు ప్రత్యక్షమై మన కోరిక తీర్చేస్తే బాగుంటుంది కదా అనే ఫీలింగ్ ప్రతి ఒక్కరికీ ఎప్పుడో ఒకసారి కలుగుతుంది.

**మీ నేపథ్యం గురించి చెప్పండి?**
మాది వైజాగ్. మా నాన్నబీఎస్ఎన్ఎల్‌లో ఎంప్లాయ్. నాకు సినిమాలంటే ఆసక్తి. దర్శకుడు కరుణాకరన్ గారి దగ్గర ఉల్లాసంగా ఉత్సాహంగా, డార్లింగ్‌కు పనిచేశాను.

**ఈ కథ నేపథ్యం ఏమిటి?**
ఒక వ్యక్తి తనకు అనుకున్నది జీవితంలో సాధించాలను కుంటాడు. హీరో కావాలనేది అతని కోరిక. అందుకోసం హైదరాబాద్, చెన్నై వెళ్లి ప్రయత్నించాలి. కానీ తాను ఉన్న ఊర్లోనే ఉండి హీరో అవ్వాలని అనుకుంటాడు.

**అల్లరి నరేష్‌కి కథ చెప్పినప్పుడు ఆయన ఎలా ఫీలయ్యారు?**
నరేష్‌కి ఈ కథ చాలా నచ్చింది. అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైన్‌మెంట్‌గా ఫీలయ్యారు. ఇందులో అన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ ఉంటాయి. కాకపోతే ఈ సినిమాలో దాదాపు 25 నిమిషాల ఎపిసోడ్‌ను నేను ఇప్పటివరకు ఎక్కడా రివిల్ చేయలేదు. అది ఆడియన్స్‌కు బోనస్‌గా ఉంటుంది.నరేష్ నుంచి ప్రేక్షకులు కోరుకునే అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయి. ఆయన క్యారెక్టర్‌పై ఫుల్ లెంగ్త్ ఎంటర్‌టైన్‌మెంట్ ఉంటుంది.

**వెన్నెలకిషోర్ క్యారెక్టర్ ఎలా ఉండబోతుంది?**
వెన్నెల కిషోర్ గారి క్యారెక్టర్ చాలా ఎంటర్‌టైనింగ్‌గా ఉంటుంది. అలాగే సీనియర్ నరేష్ గారు, శ్రీనివాస్ రెడ్డి గారు వంటి చాలా అనుభవం ఉన్న నటులు ఇందులో ఉన్నారు. అందరూ అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు.

**హీరోయిన్స్ గురించి?**
సురభి, రాశి సింగ్, ప్రిషా, విష్ణుప్రియ అందరూ తమ పాత్రలకు చాలా బాగా సరిపోయారు. వాళ్ల స్క్రీన్ ప్రజెన్స్ చాలా బాగుంటుంది.

**మ్యూజిక్ గురించి?**
చేతన్ భరద్వాజ్ నాలుగు అద్భుతమైన ట్యూన్స్ ఇచ్చారు. ఇందులో హీరోయిన్స్, నరేష్ గారి మీద వచ్చే ఒక పాట ఉంటుంది. అది థియేటర్‌లో బద్దలైపోతుంది.

**దర్శకుడిగా మీకు బలమైన జోనర్ ఏమిటి?**నా బలం కామెడీ. నా తొలి సినిమా ఫాంటసీ కామెడీ కావడం చాలా హ్యాపీగా ఉంది.

# తెర

## 'జనవరి 12 విడుదల' సంక్రాంతికి రిలీజ్



విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. వెంకటేష్, కళ్యాణ్‌రామ్ ఫస్ట్ లుక్స్ ఇప్పటికే సినిమాపై క్యూరియాసిటీ పెంచగా, తాజాగా మేకర్స్ టైటిల్‌ను రివీల్ చేశారు. టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియోను లెజెండరీ దర్శకుడు ఈవీవీ సత్యనారాయణకు ట్రిబ్యూట్ ఇస్తూ, ఆయన తెరకెక్కించిన"అప్పుల అప్పారావు"లోని ఓ పాపులర్ కామెడీ సీక్వెన్స్‌ను గుర్తు చేసేలా మొదలుపెట్టారు. ఈవీవీ సత్యనారాయణ అనిల్ రావిపూడికి ఎంతటి ఇన్‌స్పిరేషన్ అనేది తెలిసిందే.వెంకటేష్, కళ్యాణ్ రామ్, కీర్తి సురేష్, కృతి శెట్టి కలిసి అనిల్ రావిపూడి దగ్గరకు వెళ్లి సినిమా టైటిల్ ఏంటని అడుగుతారు. వెంటనే అనిల్ రావిపూడి"జనవరి 12 విడుదల" అని చెప్పడంతో వాళ్లంతా కన్ఫ్యూజ్ అవుతారు. తాము రిలీజ్ డేట్ గురించి కాదు.. సినిమా టైటిల్ గురించి అడుగుతున్నామని క్లారిటీ గా చెప్తారు. మొత్తం వీడియోలో అనిల్ రావిపూడి మార్క్ కామెడీ, టైమింగ్ స్పష్టంగా కనిపిస్తుంది. అదే సమయంలో ఈ మల్టీస్టారర్ ఎలా ఉండబోతుందో కూడా ఓ ఫన్‌ఫుల్ గ్లింప్స్ ఇచ్చింది. మరో ఆసక్తికరమైన విషయమేంటంటే.. టైటిల్‌తో పాటు సినిమా రిలీజ్ డేట్‌ను కూడా మేకర్స్ ఖరారు చేశారు. 2027 జనవరి 12న సంక్రాంతి కానుకగా ఈ చిత్రం థియేటర్లలోకి రానుంది. సంక్రాంతి సీజన్ అనిల్ రావిపూడికి బాగా కలిసొచ్చిన సీజన్. పండుగ సీజన్‌లో ఆయన సినిమాలు మంచి కమర్షియల్ సక్సెస్ అందుకున్నాయి.ఈ చిత్రానికి జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ బాధ్యతలు నిర్వహి స్తున్నారు.

# 'విశ్వనాథ్ సన్స్'కు అద్భుత స్పందన: వెంకీ అట్లూరి



**విశ్వనాథ్ సన్స్ సినిమాకి ఈ స్థాయి స్పందన రావడం ఎలా అనిపిస్తుంది?**
చాలా చాలా సంతోషంగా ఉంది. మేము ఊహించిన దానికంటే అద్భుతమైన స్పందన లభిస్తోంది.

**ఈ కథ వినగానే సూర్య రియాక్షన్ ఏంటి?**
కథ వినగానే సూర్య గారికి చాలా నచ్చేసింది. నిజానికి ఆయన ఒక ఫ్యామిలీ స్టోరీ కోసం చూస్తున్నారు. అదే విషయం నాకు చెప్పారు. ఈ కథ నా దగ్గర అప్పటికే సిద్ధంగా ఉండటంతో, ఆయనకు వినిపించాను. సూర్య కి కథ చాలా నచ్చింది.

**త్రివిక్రమ్‌రచనలో ఉండే బలం, మీ రచనలో కనిపిస్తుంది అనే ప్రశంసలు రావడం ఎలా ఉంది?**
నేను సినీ పరిశ్రమలోకి రావడానికి స్ఫూర్తి నింపినది మణిరత్నం, త్రివిక్రమ్. అలాంటిది త్రివిక్రమ్‌తో నన్ను పోల్చడం అనేది గౌరవంగా భావిస్తున్నాను.

**అసలు విశ్వనాథ్ సన్స్ కథ ఎలా పుట్టింది?**
వయసు వ్యత్యాసం ఉన్న బంధంపై కథ రాయాలని మొదట అనుకున్నాను. 40 ఏళ్ళు వచ్చినా పెళ్లి చేసుకోకపోవడానికి బలమైన కారణం ఉండాలి. దాని చుట్టు అల్లుకున్న కథ ఇది. నా దృష్టిలో మనుషులు చెడ్డవారు కాదు. పరిస్థితుల వల్ల ఒక్కోలా ప్రవర్తిస్తూ ఉంటారు. అదే విషయాన్ని సినిమాలో చెప్పడం జరిగింది.

**విశ్వనాథ్ సన్స్ చూసి త్రివిక్రమ్ గారి రియాక్షన్ ఏంటి?**
త్రివిక్రమ్‌కి సినిమా చాలా నచ్చింది. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో రూపొందే సినిమాల నిర్మాణంలో ఆయన భాగస్వామిగా ఉన్నారు కాబట్టి, దాదాపు అన్ని సినిమాలు చూస్తుంటారు. అయితే త్రివిక్రమ్ సినిమా చూసిన తర్వాత చిన్న చిన్న మార్పులు చేర్పులు సూచిస్తూ ఉంటారు.

**ఈ సినిమా విషయంలో ఎడిటింగ్ ప్రభావం ఎంత ఉంది?**
నా దృష్టిలో ఏ సినిమా అయినా ఎడిట్ టేబుల్ మీద బెటర్ అవుతుంది.

**తమిళ వెర్షన్ లో షూట్ చేశారు కానీ, తెలుగులోనే ఎక్కువ వసూళ్లు వస్తుండటంపై మీ అభిప్రాయం?**
సూర్య మార్కెట్ ను దృష్టిలో ఉంచుకొని తమిళంలో చిత్రీకరించాము. తెలుగు రాష్ట్రాలతో పోలిస్తే తమిళనాడులో థియేటర్ల సంఖ్య తక్కువ. టికెట్ ధరలలో కూడా వ్యత్యాసం ఉంది. అందుకే అక్కడ వసూళ్లు తక్కువ వచ్చాయని అనిపిస్తుంది. కానీ, మన దగ్గరతో పోలిస్తే అక్కడ లాంగ్ రన్ ఉంటుంది.

# 'EPIC – FIRST SEMESTER' నుంచి హృదయాలను హత్తుకునే మూడో గీతం 'మనసా వాచా'



ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న"నిశిది – నుంచి మధురమైన మూడో పాట విడుదల యువతను ఆకట్టుకునే యూత్‌ఫుల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న 'EPIC – FIRST SEMESTER' నుంచి మూడో పాట 'మనసా వాచా' విడుదలైంది. ప్రేమ, విరహం, అనురాగం వంటి సున్నితమైన భావోద్వేగాలను హృదయాన్ని హత్తుకునేలా ఆవిష్కరించే ఈ గీతం శ్రోతలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రముఖ సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ స్వరపరిచిన ఈ పాటకు దిగ్గజ గాయనీమణి కె. ఎస్. చిత్ర, ప్రముఖ గాయకుడు ఎస్. పి. చరణ్ తన గాత్రంతో ప్రాణం పోశారు. హేషమ్ అబ్దుల్ వహాబ్ మధురమైన స్వరకల్పనకు చిత్ర, చరణ్‌ల భావోద్వేగభరితమైన గానం తోడవడంతో మనసా వాచా ఓ అద్భుతమైన సంగీత అనుభూతిగా నిలిచింది.శ్రీ హర్ష ఈమని సాహిత్యం అందించిన ఈ పాటలో కథానాయకులు ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య పోషించిన పాత్రల మధ్య ప్రేమ, అనుబంధం, వారి మనసుల్లో చోటుచేసుకునే భావోద్వేగాలను ఎంతో అందంగా ఆవిష్కరించారు. పాటకు అనుగుణంగా తెరకెక్కించిన విజువల్స్ కూడా ఆ భావోద్వేగాలకు మరింత బలాన్ని చేకూరుస్తూ, వారి ప్రేమ ప్రయాణంలోని సున్నితమైన కోణాలను ఆవిష్కరిస్తున్నాయి.

# 'అమీర్ లోగ్' లాంటి చిత్రం ఇప్పటి వరకు రాలేదు: రమణా రెడ్డి సోమ



'అవ్వల్ నంబర్ ప్రొడక్షన్స్' బ్యానర్‌పై మాధవి రెడ్డి సోమ నిర్మించిన తొలి చిత్రం"అమీర్ లోగ్". ఈ మూవీకి రమణా రెడ్డి సోమ దర్శకత్వం వహించారు. ఈ సినిమాకి మనోహర్ రెడ్డి మంచురి సహ నిర్మాతగా వ్యవహరించారు. ఈ చిత్రంలో లీది హరి, మనోజ్, శశిధర్ ప్రధాన పాత్రల్లో నటించగా.. వేధా జలంధర్, రావణ్ నిట్టూరు, విశ్వేందర్ రెడ్డి, సాయోగి కీలక పాత్రలు పోషించారు. రానా దగ్గుబాటి సంస్థ 'స్పిరిట్ మీడియా' ఈ మూవీని తెలుగులో ఆగస్ట్ 21న గ్రాండ్ గా రిలీజ్ చేయబోతోంది. దర్శకుడు రమణా రెడ్డి సోమ మాట్లాడుతూ.. .. అమీర్ లోగ్ సినిమాని ఇప్పటికి చాలా సార్లు చూశాం. కచ్చితంగా హిట్టు బొమ్మ. ఇప్పటి వరకు ఇలాంటి చిత్రం రాలేదు. అలాంటి ఓ గొప్ప అటెంప్ట్ నేను చేశాను. ప్రీమియర్లకు వచ్చిన రెస్పాన్స్ చూస్తే మేం హిట్ కొట్టేశాం, మేం అనుకున్నది సాధించేశాం అని అర్థమైంది. నిర్మాత మాధవి రెడ్డి సోమ మాట్లాడుతూ.. .. నన్ను ముందు నిలబెట్టి నడిపిస్తున్న నా భర్త రమణకి థాంక్స్. ఆయనే రైటర్, డైరెక్టర్, నిర్మాతగా అన్నీ పనులు చూసుకున్నారు. ఆయన ఈ అమీర్ లోగ్‌సినిమాని అందమైన పెయింటింగ్‌గా తీర్చి దిద్దారు. నటుడు లీది హరి మాట్లాడుతూ.. అమీర్ లోగ్ సినిమా నాకు మంచి అవకాశాన్ని, కుటుంబాన్ని, అనుభవాన్ని ఇచ్చింది.

# సంగీత్ శోభన్, ప్రణయ్ రావు, సాహు గారపాటి కొత్త సినిమా



సక్సెస్ ఫుల్ నిర్మాత సాహు గారపాటి షైన్ స్క్రీన్స్ బ్యానర్ వరుసగా ఆసక్తికరమైన ప్రాజెక్ట్స్ తో సర్ప్రైజ్ చేస్తోంది. ఇటీవల మలయాళంలోకి అడుగుపెట్టి బ్లాక్‌బస్టర్ అందుకున్న ఈ సంస్థ... అదే సమయంలో కంటెంట్ ఉన్న కథలకు కూడా ప్రాధాన్యత ఇస్తోంది. ఈ క్రమంలోనే తాజాగా మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌ను అనౌన్స్ చేసింది.ఈ సినిమాలో ప్రస్తుతం వరుస విజయాలతో దూసుకుపోతున్న టాలెంటెడ్ హీరో సంగీత్ శోభన్ లీడ్ రోల్‌లో నటించనున్నారు. ప్రణయ్ రావు ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. గతంలో ఆయన 'సాహో' సినిమాకు అసోసియేట్ డైరెక్టర్‌గా పనిచేయడంతో పాటు 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్' చిత్రాలకు అడిషనల్ స్క్రీన్‌ప్లే వర్క్ చేశారు. శ్రీమతి అర్చన ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.షైన్ స్క్రీన్స్ ప్రొడక్షన్ నంబర్ 15గా తెరకెక్కుతున్న ఈ సినిమా.. సంగీత్ శోభన్ హీరోగా నటిస్తున్న 5వ చిత్రం కావడం విశేషం. హీరో పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌ను మేకర్స్ అనౌన్స్ చేశారు. సంగీత్ శోభన్‌ను ఇప్పటివరకు చూడని కొత్త తరహా పాత్రలో చూపించ బోతున్న ఈ సినిమాకు ప్రణయ్ రావు ఆసక్తికరమైన కథను సిద్ధం చేశారు.

# 'ఇరుముడి' తప్పకుండా ఇష్టపడతారు: బేబీ నక్షత్ర



**ఇరుముడి అవకాశం ఎలా వచ్చింది?**
దర్శకుడు శివ నిర్వాణ ఇన్‌స్టాగ్రామ్‌లో నా రీల్స్ చూసి ముందుగా మా అమ్మగని సంప్రదించారు. ఇరుముడి నా తొలి తెలుగు సినిమా కావడం చాలా ఆనందంగా ఉంది.

**ఇరుముడి అయ్యప్ప స్వామి నేపథ్యంలో ఉన్న కథ కదా? మీది కేరళ. మీరు ఎప్పుడైనా శబరిమల వెళ్లారా?**
కసారి శబరిమల వెళ్లాను. రవితేజతో వర్క్ చేయడం చాలా హ్యాపీగా అనిపిం చింది. ఆయన నాతో చాలా ఫ్రెండ్లీగా ఉంటారు. ఆయన అంటే నాకు చాలా ఇష్టం.

**ఇరుముడిలో మీ పాత్ర ఎలా ఉండ బోతుంది?**
ఇందులో నా పాత్ర పేరు మణికంఠ. నేను రవితేజ కూతురిగా కనిపించబోతున్నాను.

**మీరు చిన్న వయసులోనే పృథ్వీరాజ్ , శివరాజ్ కుమార్ రవితేజ లాంటి పెద్ద హీరోలతో పనిచేశారు కదా? ఎలా అనిపిస్తుంది?**చాలా హ్యాపీగా ఉంది. ఈ సందర్భంగా మా అమ్మకి థాంక్స్ చెప్తున్నాను.

**సినిమాలను, చదువును ఎలా బ్యాలెన్స్ చేస్తున్నారు?**
ముఖ్యంగా మా టీచర్స్ నాకు చాలా సపోర్ట్ చేస్తున్నారు. మా పేరెంట్స్, టీచర్స్ సపోర్ట్‌తోనే నేను సినిమాలుచేయగలుగుతున్నాను.

**ఇరుముడిలో మీకు ఇష్టమైన పాట ఏమిటి?**
"ఇరుముడ్డి"లో పాటలన్నీ నాకు ఇష్టం. కాకపోతే యాలో యాలోపాట నా ఫేవరెట్.

**శివ నిర్వాణ దర్శకత్వంలో పనిచేయడం ఎలా అనిపించింది?**
శివ నిర్వాణ సపోర్ట్‌తోనే ఈ సినిమాను చాలా కాన్ఫిడెంట్‌గా చేయగలిగాను.

## ఆసియాన్ చెస్ ఛాంపియన్‌షిప్..
# భారత్ బాలికల జట్టుకు కాంస్యం



**సింగపూర్:** సింగపూర్‌లో జరిగిన ఆసియాన్ ఏజ్ గ్రూప్ చెస్ ఛాంపియన్‌షిప్‌లో భారత అండర్11 బాలికల జట్టు కాంస్య పతకాన్ని కైవసం చేసుకుని, ఈ అంతర్జాతీయ జూనియర్ టోర్నమెంట్‌లో తమ అద్భుతమైన ప్రదర్శనను ముగించింది. భారత జట్టులో వరేణ్య లక్ష్మి వకా, అలిగిరి అమృత హేమల్‌తో పాటు మాయ సిద్ధార్థ్ నరులా ఉన్నారు. భారత్ 14.5 పాయింట్లతో ఆతిథ్య సింగపూర్‌తో సమానంగా నిలిచినప్పటికీ, టోర్నమెంట్ టైబ్రేక్ నిబంధనల ఆధారంగా కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. వియత్నాం 19.5 పాయింట్లతో స్వర్ణ పతకాన్ని గెలుచుకోగా, సింగపూర్ రజత పతకాన్ని దక్కించుకుంది. ఈ ఛాంపియన్‌షిప్‌లో 27 దేశాలకు చెందిన 700 మందికి పైగా ఆటగాళ్లు పాల్గొన్నారు. పోటీ అంతటా భారత క్రీడాకారులు నిలకడ, పోరాట స్ఫూర్తిని ప్రదర్శిస్తూ, ఆసియా నలుమూలల నుండి వచ్చిన ప్రముఖ జూనియర్ క్రీడాకారులకు దీటుగా నిలిచారు. వారి ప్రదర్శన, అన్ని వయసుల వర్గాలలో భారత జూనియర్ చెస్ యొక్క పెరుగుతున్న ఆసక్తిని కూడా నొక్కి చెప్పింది. భారతీయ క్రీడాకారులు వయోవర్గ ఖండాంతర మరియు ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లలో నిలకడగా అద్భుత ప్రదర్శన కనబరుస్తూ, క్లాసికల్, ర్యాపిడ్ మరియు బ్లిట్జ్ ఫార్మాట్లలో పతకాలు గెలుచుకున్నారు.

## మహిళల హాకీ ప్రపంచ కప్..
# ఇంగ్లండ్‌తో భారత్ డ్రా




**కొలంబో:** హాకీ మహిళల ప్రపంచ కప్‌లో ఇంగ్లండ్‌తో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌ను భారత్ డ్రా చేసుకుంది. దీంతో భారత్ అమ్మాయిల జట్టు పూల్ డిలో కీలక పాయింట్ సాధించి రెండో రౌండ్‌కు అర్హత సాధించింది. నాలుగు క్వార్టర్స్‌లోనూ ఇరు జట్లు ఒక్క గోల్ కూడా సాధించకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి క్వార్టర్‌లో భారత్ జట్టు అద్భుతమైన ఆటతీరు కనపరచింది. పెనాల్టీ కార్నర్‌లో నవ్‌నీత్ కౌర్ బంతిని నెట్‌లోకి పంపినప్పటికీ, అది భారత్ ప్లేయర్ శరీరానికి తగలడంతో గోల్‌ను అనుమతించ లేదు. మరోవైపు ఇంగ్లండ్‌కు వరుస పెనాల్టీ కార్నర్లు లభించాయి. అయితే భారతన గోల్‌కీపర్ సవితా పునియా, డిఫశ్రీండర్ సలీమా టెటే అద్భుతమైన డిఫెన్స్‌తో ఇంగ్లండ్‌కు గోల్ సాధించే అవకాశాలు ఇవ్వలేదు. కాగా పూల్ డి నుండి చైనా, భారత్ తదుపరి రౌండ్‌కు అర్హత సాధించగా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్లు ఇంటి ముఖం పట్టాయి.



## మహిళల ఛాంపియన్స్ లీగ్..
# ఈస్ట్ బెంగాల్ విజయం

**న్యూఢిల్లీ:** ఏఎఫ్‌సి మహిళల ఛాంపియన్స్ లీగ్ 2026-27 ప్రాథమిక దశలో రోవర్స్ ఎఫ్‌సి (గ్వామ్) పై 12-0 తేడాతో ఘన విజయం సాధించిన తర్వాత ఈస్ట్ బెంగాల్ ఎఫ్‌సి వరుసగా తమ రెండవ విజయాన్ని నమోదు చేసుకుంది. ఈ విజయంతో ఈస్ట్ బెంగాల్ గ్రూప్ దశకు చేరుకోవడానికి మరో విజయం దూరంలో నిలిచింది. గురువారం ఇక్కడ జరిగిన మొదటి మ్యాచ్ రోజున రాజ్‌షాహి స్టార్స్ ఎఫ్‌సి (బంగ్లాదేశ్) పై 4-0 తేడాతో సునాయాస విజయం సాధించిన ఈస్ట్ బెంగాల్ ఆరంభం నుంచే ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఆరో నిమిషంలో ప్రియాంక దేవి నవోరేమ్ కొట్టిన బంతితో ఈస్ట్ బెంగాల్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. 15వ నిమిషంలో రోవర్స్ గోల్ కీపర్ జే అల్మోంటే బాక్స్ లోపలి నుండి అంజు చాను కయెన్‌పైబమ్ కొట్టిన షాట్‌ను వదిలేయడంతో మళ్ళీ గోల్ ఇచ్చింది. అయితే వేగంగా స్పందించిన అస్తమ్ ఒరాన్ రీబౌండ్‌ను గోల్‌గా మలిచింది. ఈస్ట్ బెంగాల్ తమ ఒత్తిడిని కొనసాగించగా, ఏడు నిమిషాల తర్వాత ప్రియాంగ తన గోల్స్ సంఖ్యను రెట్టింపు చేసింది. విరామం తర్వాత అదే రీతిలో ఆటను పునఃప్రారంభించారు. 48వ నిమిషంలో సులంజన రౌల్ బంతిని డ్రిబ్లింగ్ చేసుకుంటూ వెళ్లగా, ఆమె ఇచ్చిన క్రాస్ డిఫ్లెక్ట్ అయి ఒలివియా అనోక్యే వద్దకు చేరడంతో గోల్ చేసింది. ఒక నిమిషం తర్వాత, సౌమ్య గుగులోత్ కచ్చితమైన క్రాస్‌తో అబిగైల్ అంట్వికి బంతిని అందించగా, ఆమె గోల్ చేసి ఈస్ట్ బెంగాల్‌కు ఐదవ గోల్‌ను అందించింది 51వ నిమిషంలో జే రీబౌండ్‌ను గోల్‌గా మార్చింది. 58వ నిమిషంలో షాట్ కొట్టి ఒలివియా తన రెండవ గోల్ సాధించగా, 64వ నిమిషంలో అబెనా ఒపోకు గోల్ పూర్తి చేసింది. అబెనా (70), అంజు (73), సౌమ్య (93+3) గోల్స్‌తో ఈస్ట్ బెంగాల్ తమ ఆధిక్యాన్ని మరింత పెంచుకుని, సమగ్రమైన విజయాన్ని పూర్తి చేసింది.

# భారత్‌కు అసలైన పరీక్ష
## 8 టెస్టుల్లో 7 గెలిస్తేనే ఫైనల్‌కు ఛాన్స్

**న్యూఢిల్లీ:** శ్రీలంకలోని గాలే వేదికగా జరిగిన మొదటి టెస్టులో 165 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన తర్వాత భారత జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్స్‌కు చేరే అవకాశాలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ప్రస్తుతం టీమిండియా ఖాతాలో 53.33 శాతం పాయింట్లతో 5వ స్థానంలో ఉంది. అయితే ఫైనల్ రేసులో నిలవాలంటే కనీసం 60 శాతం మార్కును దాటడం అత్యవసరం. ప్రపంచ టెస్టు ఛాంపియన్షిప్ చరిత్రను పరిశీలిస్తే, 60 శాతానికి పైగా పాయింట్లు సాధించిన జట్లే పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచి ఫైనల్ సమరానికి అర్హత సాధించాయి.గతంలో జరిగిన మొదటి రెండు డబ్ల్యూటీసీ సైకిళ్లలోనూ టీమిండియా వరుసగా ఫైనల్స్‌కు చేరుకుంది. అయితే తొలిసారి న్యూజిలాండ్ చేతిలో, రెండోసారి ఆస్ట్రేలియా చేతిలో ఓటమి పాలై రన్నరప్గా నిలిచింది. ఇక మూడో సైకిల్లో ఆస్ట్రేలియా, సౌతాఫ్రికాల మధ్య ఫైనల్ జరగ్గా, అందులో దక్షిణాఫ్రికా విజయం సాధించి కొత్త చరిత్ర సృష్టించింది. ఇక ప్రస్తుత సైకిల్ విషయానికొస్తే, శ్రీలంకతో ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే రెండో టెస్టులో విజయం సాధించి సిరీస్‌ను 2-0తో క్లీన్ స్వీప్ చేస్తే, భారత్ పాయింట్ల శాతం 57.57కు చేరుతుంది. శ్రీలంక పర్యటన తర్వాత న్యూజిలాండ్ వేదికగా రెండు టెస్టుల సిరీస్, ఆ తర్వాత స్వదేశంలో ఆస్ట్రేలియాతో ఐదు టెస్టుల హోరాహోరీ సిరీస్ ఆడాల్సి ఉంది. రాబోయే ఈ ఏడు మ్యాచ్‌లూ భారత్‌కు అత్యంత కీలకంగా మారనున్నాయి. మొత్తంగా మిగిలివున్న 8 టెస్టుల్లో టీమిండియా కనీసం 6 నుండి 7 టెస్టుల్లో విజయం సాధించాలి. 6 విజయాలు సాధిస్తే పాయింట్లు 60 శాతానికి చేరువవుతాయి. అదే 7 నుండి 8 మ్యా టెస్టులు గెలిస్తే టాప్2 స్థానం ఖాయమవుతుంది. గత సైకిల్లో స్వదేశంలో సౌతాఫ్రికా చేతిలో 2-0తో ఓడిపోవడం భారత్‌ను తీవ్రంగా దెబ్బతీసింది. ఆ సిరీస్ గెలిచి ఉంటే భారత్ ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉండేది. ప్రస్తుతం ఆస్ట్రేలియా 77.78 శాతంతో అగ్రస్థానంలో, డిఫెండింగ్ ఛాంపియన్ సౌతాఫ్రికా 75 శాతంతో రెండో స్థానంలో ఉన్నాయి. అయితే దక్షిణాఫ్రికాకు రాబోయే నాలుగు సిరీస్లలో



ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, బంగ్లాదేశ్లతో కఠిన సవాళ్లు ఎదురుకానున్నాయి. ఇది టీమిండియాకు సానుకూలంగా మారే అవకాశం ఉంది. ప్రస్తుతం న్యూజిలాండ్ 72.22 శాతంతో మూడో స్థానంలో, బంగ్లాదేశ్ 66.67 శాతంతో నాలుగో స్థానంలో కొనసాగుతున్నాయి. రాబోయే కివీస్ సిరీస్ భారత్ ఫైనల్ అర్హతను నిర్దేశించడంలో ఇవన్నీ కీలకం కానున్నాయి.




## ప్రపంచ ఛాంపియన్‌షిప్..
# సింధు సంచలన ఓటమి
### క్వార్టర్స్‌కు ట్రీసా-గాయత్రి



**న్యూఢిల్లీ:** ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో భారత్ ప్లేయర్ పివి సింధు చైనా క్రీడాకారిణి వాంగ్ జియి చేతిలో ఓటమిపాలైంది. అయితే భారత మహిళల డబుల్స్ స్టార్లు ట్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ గురువారం బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్స్ 2026లో ఒక పెద్ద విజయాన్ని నమోదు చేశారు. వారు రౌండ్ ఆఫ్ 16లో ప్రపంచ 7వ ర్యాంకర్ అయిన జపాన్ ద్వయం రిన్ ఇవానగా-కీ నకానిషిలను ఓడించి, పతకం సాధించడానికి కేవలం అడుగు దూరంలో ఉన్నారు. మొదటి గేమ్‌లో జపాన్ జంట చక్కగా ఆడటంతో ట్రీసా-గాయత్రి జోడి 9-13తో వెనుకబడింది. ఆ తర్వాత ట్రీసా కొన్ని శక్తివంతమైన స్మాష్‌లను సంధించి, జపాన్ జంట వ్యూహాన్ని అడ్డుకుంది. దీంతో ట్రీసా, జాలీలు అద్భుతంగా పుంజుకుని, వరుసగా 8 పాయింట్లు గెలుచుకుని తొలి గేమ్‌ను తమకు అనుకూలంగా ముగించారు. రెండవ గేమ్‌లో గాయత్రి కచ్చితమైన నెట్ షాట్‌లతో వెనుక ఉన్న ట్రీసాకు బంతిని అందించగా, ఆమె శక్తివంతమైన విన్నర్‌లతో పాయింట్లను ముగించి క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుని, తమ పతక ఆశలను సజీవంగా ఉంచుకున్నారు. ఇక రౌండ్ ఆఫ్ 16లో, భారత క్రీడాకారిణి పివి సింధు, మూడో సీడ్ చైనా క్రీడాకారిణి వాంగ్ జి యి చేతిలో మూడు గేమ్‌ల హోరాహోరీ పోరులో (21-11, 15-21, 21-17) ఓటమి చెందింది..వాంగ్ మొదటి గేమ్‌లో ఆధిపత్యం చెలాయించి, 7-7తో సమంగా ఉన్న స్కోరు నుండి సింధుపై ఆధిక్యం సాధించి, చివరికి అర్థమైన ఆధిక్యాన్ని కైవసం చేసుకుంది. సింధు, రెండవ గేమ్‌లో ఆరంభంలోనే ఆధిక్యం సాధించినా మధ్యలో కాస్త తడబడినప్పటికీ, అవసరమైనప్పుడు పాయింట్లు సాధించి నిర్ణయాత్మక గేమ్‌కు దారితీసింది. మూడవ గేమ్‌లో 18-17 స్కోరు వద్ద సింధు, వాంగ్ 54 షాట్ల సుదీర్ఘ ర్యాలీలో తలపడ్డారు. అయితే సింధు కోలుకోలేకపోవడంతో, వాంగ్ చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకుంది.

# 13.37 కోట్లకు పెరిగిన స్టాక్‌మార్కెట్ ఇన్వెస్టర్లు

**ముంబయి, ఆగస్టు 20:** భారత స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడిదారుల సంఖ్య భారీగా పెరుగుతోంది. ఈ ఏడాది జూలై నాటికి దేశంలో నమోదైన ఇన్వెస్టర్ల సంఖ్య 13.37 కోట్లకు చేరింది. 2019 ఆర్థిక సంవత్సరంమొదటి త్రైమాసికంలో ఉన్న 2.75 కోట్లతో పోలిస్తే ఇది దాదాపు ఐదు రెట్లు అధికం. పశ్చిమ భారతదేశానికే పరిమితమైన స్టాక్ మార్కెట్ భాగస్వామ్యం ఇప్పుడు దేశవ్యాప్తంగా విస్తరిస్తోంది. జూలైలో కొత్తగా 13.3 లక్షల మంది ఇన్వెస్టర్లు నమోదు చేసుకున్నారు. జూన్‌తో పోలిస్తే ఇది 14.1 శాతం పెరుగుదల. 2025 జూలైతో పోలిస్తే కొత్త రిజిస్ట్రేషన్లు 12.1 శాతం తగ్గాయి.మార్కెట్‌లో ఇన్వెస్టర్ల వయసు కూడా తగ్గుతోంది. 2026 జూన్ నాటికినమోదైన ఇన్వెస్టర్లలో 30 ఏళ్లలోపు వారు 37.9 శాతంగా ఉన్నారు. 30-39 ఏళ్ల వయసు వారు మరో 30.2 శాతం ఉన్నారు. నమోదైన ఇన్వెస్టర్ల మధ్యస్థ వయసు 33 సంవత్సరాలుగా ఉంది. 2027 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు కొత్తగా నమోదైన ఇన్వెస్టర్లలో 30 ఏళ్లలోపు వారు 59 శాతంగా ఉన్నారు. క్యూవన్26లో ఈ వాటా 56.4 శాతంగా



ఉంది. కొత్త ఇన్వెస్టర్ మధ్యస్థ వయసు కేవలం 27 సంవత్సరాలుగా నమోదైంది. జూలైలో ఉత్తర భారతదేశంలో 4.93 కోట్ల మంది నమోదైన ఇన్వెస్టర్లు ఉన్నారు. ఇది దేశ మొత్తం ఇన్వెస్టర్ బేస్‌లో 36.9%. పశ్చిమ భారత్‌లో 3.89 కోట్ల మంది ఇన్వెస్టర్లు ఉండగా, దేశ మొత్తం వాటాలో 29.1 శాతంగా ఉంది.దక్షిణ భారత్‌లో 2.82 కోట్లు, తూర్పు భారతదేశంలో 1.62 కోట్ల మంది ఇన్వెస్టర్లు ఉన్నారు. తూర్పు భారతదేశంలో ఇన్వెస్టర్ బేస్ ఆరు రెట్లు,దక్షిణ భారతదేశంలో 4.2రెట్లు, పశ్చిమ భారతదేశంలో నాలుగు రెట్లు పెరిగింది. రాష్ట్రాల వారీగా చూస్తే జూలైలో కొత్త ఇన్వెస్టర్ల చేరికలో ఉత్తరప్రదేశ్ ముందంజలో నిలిచింది. ఆ రాష్ట్రంలో 1.9 లక్షల మంది కొత్తగా నమోదు కాగా, మొత్తం కొత్త రిజిస్ట్రేషన్లలో ఇది 14 శాతం.మహారాష్ట్రలో 1.4 లక్షలు, గుజరాత్‌లో 1.2 లక్షలు, తమిళనాడులో 90 వేలు, పశ్చిమ బెంగాల్‌లో 80 వేల మంది కొత్త ఇన్వెస్టర్లు చేరారు. ఈ 5 రాష్ట్రాలు కలిపి జూలైలో నమోదైన కొత్త ఇన్వెస్టర్లలో 46.6% వాటాను కలిగి ఉన్నాయి.

వాణిజ్యం



# రూ.10వేల కోట్ల రియాల్టీ లావాదేవీలపై ఐటీ శాఖ నజర్

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఐదు సరిహద్దు రాష్ట్రాల్లో రూ.10వేల కోట్లకు పైగా విలువైన రియల్ ఎస్టేట్ లావాదేవీలు ఆదాయపు పన్ను శాఖ పరిశీలనలోకి వచ్చాయి. పన్ను ఎగవేత, లావాదేవీలను తక్కువగా చూపించడం, తప్పుగా నివేదించడం వంటి పన్ను నిబంధనల ఉల్లంఘనఐటిశాఖ గుర్తించింది.ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్, బిహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు సంబంధించిన 2025-26 ఆర్థిక సంవత్సర లావాదేవీలను శాఖ పరిశీలిస్తోంది. మొత్తం 14,743 ఆస్తి లావాదేవీల్లో పన్ను నిబంధనలకు సంబంధించిన లోపాలను గుర్తించింది. ఇందులో 2,552 లావాదేవీలు అసలు నివేదించనివి ఉన్నాయి. విలువ పరంగా రూ.9,350 కోట్ల లావాదేవీల్లో తప్పులున్న ఫైలింగ్స్ గుర్తించగా, మరో రూ.1,628 కోట్ల విలువైన రియల్ ఎస్టేట్ లావాదేవీలు నివేదించలేదు. ఆస్తి లావాదేవీలకు సంబంధించిన రూ.63 కోట్ల నగదు లావాదేవీలను కూడా ప్రకటించలేదని శాఖ గుర్తించింది.రాష్ట్రాల వారీగా చూస్తే ఉత్తరప్రదేశ్ అత్యధికంగా రూ.4,081.27 కోట్ల లావాదేవీలతో ముందుంది. రాజస్థాన్ రూ.2,694.62 కోట్లు, గుజరాత్ రూ.1,795.65 కోట్లు, బిహార్ రూ.1,472.81 కోట్లు, పశ్చిమ బెంగాల్ రూ.554.15 కోట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

పాన్ వివరాలను తప్పుగా నమోదు చేయడం, లావాదేవీల విలువను తక్కువగా చూపించడం, లావాదేవీలను నివేదించకపోవడం, తప్పు ఆర్థిక సంవత్సరంలో చూపించడం, నగదు భాగాన్ని వెల్లడించకపోవడం వంటి పలు లోపాలను ఐటీ శాఖ గుర్తించింది. ఐదు రాష్ట్రాల్లో పన్ను చెల్లింపులతో పోలిస్తే నగదు జమలు, ఉపసంహరణలు గణనీయంగా అధికంగా ఉన్నట్లు శాఖ విశ్లేషణలో వెల్లడైంది.ఉత్తరప్రదేశ్‌లో నగదు డిపాజిట్‌పన్ను నిష్పత్తి 21.38 రెట్లుగా ఉంది. దేశవ్యాప్తంగా ఈ నిష్పత్తి 2.5 రెట్లు మాత్రమే. అలాగే నగదు ఉపసంహరణపన్ను నిష్పత్తి ఉత్తరప్రదేశ్‌లో 15.6 రెట్లు ఉండగా, దేశవ్యాప్తంగా ఇది 0.74 రెట్లు ఉంది.నగదు డిపాజిట్లు లేదా ఉపసంహరణలను చెల్లించిన పన్నుతో పోల్చి ఈ నిష్పత్తిని లెక్కిస్తారు. అసోంలో నగదు డిపాజిట్‌పన్ను నిష్పత్తి 17.31 రెట్లు, నగదు ఉపసంహరణపన్ను నిష్పత్తి 16.76 రెట్లుగా ఉంది.పశ్చిమ బెంగాల్‌లో ఈ రెండు నిష్పత్తులు వరుసగా 10.38 రెట్లు, 10.28 రెట్లుగా ఉన్నాయి. గుజరాత్‌లో 10.27 రెట్లు, 11.85 రెట్లు, బిహార్‌లో 7.63 రెట్లు, 8.41 రెట్లుగా నమోదయ్యాయి.

# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబయి, ఆగస్టు 20:** భారత స్టాక్ మార్కెట్ గురువారం భారీ లాభాల్లో ముగిసింది. వరుసగా ఏడు రోజులుగా కొనసాగిన నష్టాలకు ఈ రోజు బ్రేక్ పడింది. బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 628 పాయింట్లు లాభపడగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 153 పాయింట్లు లాభపడింది. ఐటీ, ఫైనాన్సియల్ స్టాక్స్ భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 77,468.45 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే సాగింది. గరిష్టంగా 77,611.11 పాయింట్లను తాకింది. చివరకు 628.04 పాయింట్లు లాభంతో 77,537.72 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 153.55 పాయింట్ల లాభంతో 24,231.85 వద్ద ముగిసింది. బీఎస్ఈ 30 షేర్ ఇండెక్స్‌లో ఐటీసీ, కోటక్ బ్యాంక్, ఎటర్నల్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫినాన్స్ షేర్లు లాభపడ్డాయి. వీటిలో ఎటర్నల్ 2 శాతం పైగా లాభపడింది. మరోవైపు టైటాన్, ఇండిగో, టాటా స్టీల్, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు నష్టాల్లో ముగిశాయి. బ్రాడర్ మార్కెట్లలో నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 షేర్లు 0.68 శాతం లాభపడ్డాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ షేర్లు 2.13 శాతం లాభపడగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్స్ మాత్రం 0.50 శాతం నష్టపోయాయి. బిఎస్ఇ మిడ్‌క్యాప్‌షేర్లు 0.53శాతం క్షీణిస్తే స్మాల్‌క్యాప్ కూడా 0.48శాతం క్షీణించింది. బిఎస్ఇలో మొత్తం 2450 షేర్లు లాభపడగా 1874 షేర్లు పతనం చెందాయి. మరో 237 షేర్లుస్థిరంగా కొనసాగాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 93.94 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,490.60 వద్ద ట్రేడవుతోంది. రూపాయితో డాలర్ మారకం విలువ 95.71గా ఉంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి అత్యధికంగా 5.74 శాతం లాభపడింది. జపాన్ నిక్కీ 225, షాంఘై ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్ హ్యాంగ్ సెంగ్ ఇండెక్స్ కూడా లాభాల్లోనే కొనసాగుతున్నాయి. ఇక ఐపిఒలపరంగా టెంప్‌పెన్స్ ఇన్‌స్ట్రుమెంట్స్ 5.69 రెట్లు అధికంగా బిడ్లు రాబట్టిఇంది. ఐపిఒ ధరలు రూ.285 నుంచి రూ.300గా నిర్ణయించింది. గజా ఆల్టర్నేటివ్ అసెట్ మేనేజ్‌మెంట్ 2.36శాతం రెట్టింపు బిడ్లుసాధించింది. ఇష్యూధర రూ.152.నుంచి రూ.160గా నిర్ణయించింది. సన్‌షైన్ పిక్చర్స్ 105.34 రెట్లు బిడ్లు రాబట్టింది. సంకేష్ జ్యూయెలర్స్ 2.77 రెట్లు బిడ్లు సాధించింది. కనీసం 160 షేర్లు కొనుగోలుచేయాలి. రూ.88 నుంచి రూ.93వరకూ ఇష్యూధరలు నిర్ణయించింది.



# కీలక రంగాల ఉత్పత్తి వృద్ధి 5.4%

**న్యూఢిల్లీ, ఆగస్టు 20:** ఎనిమిది కీలక రంగాల ఉత్పత్తిలో వృద్ధి 5.4 శాతంగా నమోదయింది. కేంద్ర మంత్రిత్వశాఖ మోస్పీ ఈ గణాంకాలు గురువారం విడుదలచేసింది. ఎనిమిది మౌలిక రంగాల్లో సిమెంట్ ఉత్పత్తి జూలైలో అత్యధికంగా 13.1 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసింది. జూన్‌లో ఈ వృద్ధి 9.9 శాతంగా ఉంది. విద్యుత్ ఉత్పత్తి వృద్ధి జూన్‌లోని 11.4 శాతం నుంచి జూలైలో 9 శాతానికి తగ్గింది. బొగ్గు ఉత్పత్తి మాత్రం జూన్‌లోని 1.4 శాతం వృద్ధితో పోలిస్తే జూలైలో 7.6 శాతానికి పెరిగింది. ఎరువుల ఉత్పత్తిలో క్షీణత మరింత పెరిగి, జూన్‌లో నమోదైన 3.3 శాతం డీగ్రోత్ నుంచి జూలైలో 8 శాతం క్షీణతకు చేరింది.ఇనుప ఖనిజం ఉత్పత్తి జూలైలో వార్షిక ప్రాతిపదికన 29.5 శాతం పెరిగింది. ఇది మైనింగ్ కార్యకలాపాల్లో బలమైన వృద్ధిని ప్రతిబింబించింది. అయితే జూన్‌లో నమోదైన 44.5 శాతం వృద్ధితో పోలిస్తే ఇది తక్కువ. ఉక్కు ఉత్పత్తి 2.9 శాతం మేర పెరిగింది. జూన్‌లో ఈ వృద్ధి 5.6 శాతంగా ఉంది. మరోవైపు పెట్రోలియం రిఫైనరీ ఉత్పత్తుల ఉత్పత్తి జూలైలో 2.7 శాతం వృద్ధి సాధించింది. జూన్‌లో ఇది 4 శాతం క్షీణించింది.సహజవాయువు ఉత్పత్తి జూలైలో వార్షిక ప్రాతిపదికన 3.7 శాతం క్షీణించింది. అయితే జూన్‌లో నమోదైన 4.8 శాతం క్షీణతతో పోలిస్తే పరిస్థితి కొంత మెరుగుపడింది. ముడి చమురు ఉత్పత్తి జూలైలో 5.3 శాతం తగ్గింది. అంతకుముందు నెలలో ఇది 4.2 శాతం క్షీణించింది. సమిష్టి ప్రాతిపదికన ఏప్రిల్ జూలై కాలంలో ఎనిమిది కీలక రంగాల వృద్ధి 4.3 శాతానికి చేరింది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.